సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12 వెల: ₹ 5.00

సంపుటి: 13 సంచిక: 14

సోమవారం 6-4-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'




**విరామం మంచిదేనా!**

సుదీర్ఘ విరామంతో క్రీడాకారులకు ఫిట్‌నెస్, ఫామ్ కష్టాలు -స్పోర్ట్స్‌లో





**ఇన్వెస్ట్ చేయాలా? విక్రయించాలా..?** - బిజినెస్‌లో






ఢిల్లీలో జ్యోతి వెలిగిస్తున్న ప్రధాని మోదీ



కరోనా వైరస్‌పై అలుపెరగని పోరుకు సంఘీభావంగా ప్రధాని పిలుపు మేరకు ఆదివారం రాత్రి లైట్లను ఆపేసి దీపాలను వెలిగించిన బెంగళూరు వాసులు..



హైదరాబాద్‌లోని గాంధీనగర్‌లో..



ప్రగతిభవన్‌లో కొవ్వొత్తి వెలిగించి సంఘీభావం తెలుపుతున్న సీఎం కేసీఆర్



తాడేపల్లిలో క్యాండిల్ వెలిగించి సంఘీభావం తెలుపుతున్న సీఎం జగన్

కరోనాపై..

# సమర దీపం

- ప్రగతిభవన్‌లో సీఎం, రాజ్‌భవన్‌లో గవర్నర్, తమ నివాసాల వద్ద ప్రజాప్రతినిధుల జ్యోతి ప్రజ్వలన
- తాడేపల్లిలో ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- మోదీ పిలుపునకు అన్ని వర్గాల నుంచి స్పందన

**సాక్షి, హైదరాబాద్:** ఆదివారం రాత్రి 9గంటలు.. రాష్ట్రంలో ఒక్కసారిగా చీకట్లు అలముకున్నాయి.. ఉన్నట్టుండి ప్రజలంతా ఇళ్లలోని లైట్లు ఆపేశారు. చీకటి తెరలు అలా వాలాయో లేదో.. వాటిని చీల్చుకుంటూ కాంతులు ప్రసరించాయి. కరోనా మహమ్మారిపై సమర శంఖం పూరించాయి. 'గో కరోనా.. గో. మా దేశం విడిచి వెళ్లు' అంటూ కోట్లాది గొంతులు దీపాల వెలుగుల సాక్షిగా నినదించాయి.

**వెలుగొందిన ఐక్యతాస్ఫూర్తి..**

కరోనా మహమ్మారిని దేశవాసులమంతా మూకుమ్మడిగా ఎదుర్కొంటామనే ఐక్యతా స్ఫూర్తిని చాటి చెప్పేందుకు, ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు దీపాలు వెలిగించే కార్యక్రమానికి తెలంగాణ అద్భుతంగా స్పందించింది. గత నెల 22న జనతా కర్ఫ్యూ సందర్భంగా సాయంత్రం 5 గంటలకు చప్పట్లు కొట్టే కార్యక్రమానికి దీటుగా ఆదివారం రాత్రి 9 గంటల నుంచి 9 నిమిషాల పాటు దీపాలు వెలిగించే కార్యక్రమం జరిగింది. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం కేసీఆర్


మిగతా 2వ పేజీలో ▶


# మరో 62 కరోనా కేసులు

## మొత్తం 333 మందికి పాజిటివ్..

- వీటిలో 297 కేసులు 'మర్కజ్'వే..
- హైదరాబాద్‌లోనే 162 మందికి..
- రాష్ట్రంలో 25 జిల్లాలకు పాకిన మహమ్మారి

సాక్షి, హైదరాబాద్

కరోనా కల్లోలం ఆగడం లేదు. రోజురోజుకూ కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆదివారం మళ్లీ 62 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో ఇప్పటివరకు రాష్ట్రంలో నమోదైన కరోనా కేసుల సంఖ్య 333కు చేరుకుంది. అందులో 297 మంది ఢిల్లీ మర్కజ్‌తో సంబంధం ఉన్నవారు, వారి కుటుంబీకులే కావడం గమనార్హం. అంటే మొత్తం కేసుల్లో 89 శాతం మంది ఏకంగా ఢిల్లీ మర్కజ్‌తో సంబంధం ఉన్న వారే కావడం ఆందోళన కలిగిస్తోంది. మిగిలిన వారు వివిధ దేశాల నుంచి వచ్చినవారు, వారి కుటుంబీకులు, స్థానికంగా ఎటువంటి కాంటాక్ట్‌తో సంబంధం లేకుండా సోకిన వారున్నారన్నారు. ఆదివారం 480 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా, ఈ ఫలితాలు వచ్చాయి. కాగా, కరోనా కేసుల్లో ఇప్పుడు దేశంలో తెలంగాణ రాష్ట్రం పైపైకి చేరడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

**ఒక్కరోజులో 51..**



ఇప్పటివరకు నమోదైన కరోనా పాజిటివ్ కేసుల్లో అత్యధికంగా హైదరాబాద్ నుంచే ఉన్నాయి. ఇక్కడ 162 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. ఒకరోజు వ్యవధిలోనే 51 కొత్త కేసులు నమోదయ్యాయి. వీరిలో ఇప్పటివరకు ఏడుగురు చనిపోయారు. 11 మంది డిశ్చార్జి అయ్యారు. వరంగల్ అర్బన్‌లో 24 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది. అందులో ఒకరు


మిగతా 2వ పేజీలో ▶



NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE

Vencobb CHICKEN

సూచించిన నేటి గుడ్డు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

గుడ్డు రిటైల్ ధర ₹ 46 డజన్

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 75 కిలో

రిటైల్ లైవ్ బర్డ్ 97 కిలో

డ్రెస్డ్ స్కిన్‌తో 141 కిలో

స్కిన్‌లెస్ 160 కిలో


## ఏపీలో 252..

కరోనా పాజిటివ్ కేసులు

ఆదివారం ఒక్కరోజే 60 కేసులు


- వివరాలు 2లో


# కరోనా లక్షణాలున్న అందరికీ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్

కరోనా వ్యాప్తి నివారణకు చేస్తున్న కృషిని మరింత అంకితభావంతో కొనసాగిస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. రోగులకు వైద్యం అందిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బందికి ప్రభుత్వం అన్ని రకాల అండగా ఉంటుందని చెప్పారు. వ్యాధి లక్షణాలున్న ఏ ఒక్కరినీ వదలకుండా పరీక్షలు నిర్వహించి, వైద్యం అందిస్తామని, వ్యాధి సోకినవారు కలసిన ప్రతి ఒక్కరినీ గుర్తించి క్వారంటైన్ చేస్తున్నామని వెల్లడించారు. కరోనా వ్యాప్తి నివారణకు తీసుకుంటున్న చర్యలపై సీఎం కేసీఆర్.. ప్రగతిభవన్‌లో ఆదివారం రాత్రి 10 గంటల వరకు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. 'కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించే విషయంలో, వ్యాధి సోకిన వారికి వైద్యం అందించే విషయంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది గొప్ప సేవలు అందిస్తోంది. వారి భద్రతలకు సంబంధించిన విషయంలో కూడా ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించింది. వారి ఆరోగ్య పరిరక్షణ విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రస్తుతం పరీక్షలకు, వైద్యానికి వస్తున్న వారికి సరిపడా టెస్ట్ కిట్స్, పీపీఈలు, మాస్కులు, మందులు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో రోగుల సంఖ్య పెరిగినా, అందుకు అనుగుణంగా మాస్కులు, పీపీఈలు సేకరిస్తాం'అని సీఎం ప్రకటించారు. కాగా, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఆరోగ్య రక్షణ కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కేసీఆర్ ఆదేశించారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు వస్తున్న విరాళాలను కూడా వైద్య సిబ్బందికి అవసరమైన మాస్కులు, పీపీఈలు, మందుల కొనుగోలుకు వాడాలని కోరారు. భవిష్యత్తులో రోగుల సంఖ్య పెరిగినా ఎలాంటి ఇబ్బంది కలగకుండా సేవలు అందించడానికి అవసరమైన కార్యాచరణ రూపొందించి, అమలు చేయాలని సూచించారు.



- ఉన్నతస్థాయి సమీక్షలో కేసీఆర్ స్పష్టీకరణ
- కరోనా సోకినవారు కలసిన ప్రతి ఒక్కరూ క్వారంటైన్‌కు
- వైద్య, ఆరోగ్య సిబ్బందికి అండగా ఉంటాం
- వైద్యుల రక్షణ పరికరాల కొనుగోళ్లకు సీఎంఆర్ఎఫ్ విరాళాలు
- టెస్ట్ కిట్స్, పీపీఈలు, మాస్కులు సరిపడా ఉన్నాయి
- వరి కోతలు, ధాన్యం సేకరణకు ఇబ్బందులు రావొద్దు
- పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని వెల్లడి

**రైతులకు ఇబ్బంది రావద్దు..**

లాక్‌డౌన్ అమల్లో ఉన్నప్పటికీ రాష్ట్రంలో వరికోతలకు, ధాన్యం సేకరణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. 'లాక్‌డౌన్ కారణంగా జనజీవనం స్తంభించింది. అయినా రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగొద్దని, వారు ఆర్థికంగా నష్టపోవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించింది. మార్కెట్లలో రద్దీని నివారించడానికి గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. వరి కోతలు, ధాన్యం సేకరణ పూర్తి స్థాయిలో జరగాలి. వరికోతలకు రైతులు హార్వెస్టర్లు ఉపయోగించే పరిస్థితిని గ్రామాల్లో కల్పించాలి. హార్వెస్ట్ పరికరాలను బిగించే మెకానిక్‌లకు ప్రత్యేక పాసులిచ్చి అనుమతించాలి. స్పేర్ పార్ట్స్ అమ్మే షాపులను తెరవడానికి అనుమతి ఇవ్వాలి. గ్రామస్తులు తమ గ్రామాల్లోకి హార్వెస్టర్లను రానివ్వాలి. ఆ తర్వాత ధాన్యాన్ని


మిగతా 2వ పేజీలో ▶




## 3,577

దేశ వ్యాప్తంగా కరోనా కేసులు

## 83

మొత్తం మృతుల సంఖ్య..

**రాష్ట్రాల వారీగా కేసులు..**

| రాష్ట్రం | కేసులు | మరణాలు |
|---|---|---|
| ఢిల్లీ | 503 | 7 |
| మహారాష్ట్ర | 490 | 24 |
| తమిళనాడు | 485 | 3 |
| కేరళ | 306 | 2 |
| ఉత్తరప్రదేశ్ | 227 | 2 |
| రాజస్తాన్ | 200 | 0 |
| మధ్యప్రదేశ్ | 165 | 9 |
| కర్ణాటక | 144 | 4 |
| గుజరాత్ | 122 | 11 |
| జమ్మూ కశ్మీర్ | 106 | 2 |
| పశ్చిమ బెంగాల్ | 80 | 3 |
| హరియాణా | 59 | 1 |
| పంజాబ్ | 57 | 5 |
| బిహార్ | 30 | 1 |
| అస్సాం | 26 | 0 |
| ఉత్తరాఖండ్ | 22 | 0 |
| ఒడిశా | 20 | 0 |
| చండీగఢ్ | 18 | 0 |
| లదాఖ్ | 14 | 0 |
| అండమాన్ దీవులు | 10 | 0 |
| ఛత్తీస్ గఢ్ | 9 | 0 |
| గోవా | 7 | 0 |
| హిమాచల్ ప్రదేశ్ | 6 | 1 |
| పుదుచ్చేరి | 5 | 0 |
| జార్ఖండ్ | 3 | 0 |
| మణిపూర్ | 2 | 0 |
| మిజోరం | 1 | 0 |
| అరుణాచల్ ప్రదేశ్ | 1 | 0 |



# ఆ జిల్లాలు జాగ్రత్త!

- పరిస్థితి చేయి దాటితే అదుపు చేయడం కష్టం
- అవసరమైతే లాక్ డౌన్ వేళలు పొడిగించండి
- మర్కజ్ వెళ్లి వచ్చిన వారిని గుర్తించి వైద్య పరీక్షలు చేయండి
- రాష్ట్రాలకు కేంద్రం వార్నింగ్
- దేశవ్యాప్తంగా 96 'రెడ్' జిల్లాల ప్రకటన
- తెలంగాణలో రెడ్ జిల్లాలుగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్
- ఏపీలో విశాఖపట్నం, చిత్తూరు, తూర్పుగోదావరి, గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు

సాక్షి, హైదరాబాద్

కరోనా మహమ్మారి విరుచుకుపడుతుండటంతో కేంద్రం అప్రమత్తమైంది. పాజిటివ్ కేసుల సంఖ్య ఎక్కువగా నమోదవుతున్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ జిల్లాల్లో మరిన్ని కేసులు నమోదు కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. ఢిల్లీ మర్కజ్ మత ప్రార్థనల్లో పాల్గొని వచ్చిన తర్వాతే పాజిటివ్ కేసుల సంఖ్య అమాంతం పెరిగిన నేపథ్యంలో ఢిల్లీ వెళ్లి వచ్చిన వారికి తక్షణమే వైద్య పరీక్షలు నిర్వహించాలని, వారి కుటుంబ సభ్యులను, కలసిన వారందరినీ క్వారంటైన్ చేయాలని ఆదేశించింది. కేసుల సంఖ్యకు అడ్డుకట్ట వేయకపోతే పరిస్థితి చేయి దాటిపోతుందని అంచనా వేసిన కేంద్రం.. దేశవ్యాప్తంగా అత్యధికంగా కరోనా పాజిటివ్ కేసులు నమోదైన 96 జిల్లాలను రెడ్ జిల్లాలుగా ప్రకటించింది. ఈ జిల్లాల పరిధిలోని హాట్ స్పాట్‌లను గుర్తించి.. అక్కడ కరోనా వైరస్ ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ రెడ్ జిల్లాల




మిగతా 2వ పేజీలో ▶


**కరోనా తీవ్రత ఎక్కువగా ఉన్న జిల్లాలు ఇవే..**

ఉత్తర, మధ్య అండమాన్, దక్షిణ అండమాన్ (అండమాన్ , నికోబార్ దీవులు), విశాఖపట్నం, చిత్తూరు, తూర్పుగోదావరి, గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు (ఆంధ్రప్రదేశ్), పట్నా, ముంగేర్, బేగుసరాయ్, లక్కిసరాయ్, నలందా(బిహార్), చండీగఢ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్, దుర్గ్ (ఛత్తీస్‌గఢ్), సౌత్, సౌత్‌వెస్ట్, ఈస్ట్, వెస్ట్, నార్త్‌వెస్ట్, నార్త్ ఈస్ట్, నార్త్, నార్త్ ఢిల్లీ, సెంట్రల్, సహదరా, సౌత్ ఈస్ట్ (ఢిల్లీ), దక్షిణ గోవా, ఉత్తర గోవా(గోవా), అహ్మదాబాద్, గాంధీనగర్, సూరత్, వడోద, రాజ్‌కోట్, భావ్‌నగర్, బోతాడ్, గిర్ సోమ్‌నాథ్, కచ్, మహేసన, పోర్‌బందర్ (గుజరాత్), గుర్గావ్, ఫరీదాబాద్, అంబాలా (హరియాణా), శ్రీనగర్, బాందిపొర (జమ్ము, కశ్మీర్), బెంగళూరు అర్బన్, చిక్‌బళ్లాపూర్, ఉత్తర కన్నడ, మైసూరు(కర్ణాటక), కసర్‌గఢ్, ఎర్నాకులం, కన్నూర్, పాత్తనమిట్ట, కోజికోడ్, మల్లాప్పురం, తిరువనంతపురం (కేరళ), లేహ్ లఢక్ (లఢక్), ఇండోర్, జబల్‌పూర్, ఉజ్జయిని, భోపాల్ (మధ్యప్రదేశ్, ముంబై, పుణే, నాగ్‌పూర్, సాంగ్లీ, థానే, అహ్మద్‌నగర్, పాలఘర్ (మహారాష్ట్ర), షాహిది భగత్‌సింగ్ నగర్, ఎస్ఏఎస్ నగర్, బిల్వారా (పంజాబ్), జైపూర్, జోధ్‌పూర్, ఝుంఝూ (రాజస్తాన్), చెన్నై, తిరునల్వేలి, ఈరోడ్, నమక్కల్, కోయంబత్తూర్, కన్యాకుమారి (తమిళనాడు), హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి (తెలంగాణ), మీరట్, ఆగ్రా, గౌతం బుద్ధనగర్, లక్నో, గజియాబాద్ (ఉత్తర్‌ప్రదేశ్), డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్), కోల్‌కతా, 24 పరగణాల ఉత్తర, హుగ్లీ, మిడ్నాపూర్ ఈస్ట్, నడియా(పశ్చిమబెంగాల్)


మరింత పటిష్టంగా లాక్‌డౌన్! 2లో



epaper.sakshi.com




**చిట్టి ప్రాణానికి గట్టి రక్షణ**

అమ్మ కడుపులో చల్లగా ఉన్నాడు.. భూమ్మీద పడగానే కరోనా పడగ నీడ పడుతుందనో ఏమో.. అప్పుడే పుట్టిన ఈ నవజాత శిశువుకు నర్సు ముఖ రక్షణ కవచాన్ని అమర్చింది. థాయ్‌లాండ్‌లోని సముత్‌ప్రకరణ్ ప్రావిన్స్‌లో గల ఓ ఆస్పత్రిలో ఈ సన్నివేశం చోటుచేసుకుంది.

# మరింత పటిష్టంగా లాక్‌డౌన్

- రాష్ట్రానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సూచన
- హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్‌లలో తీరుపై కేంద్ర నిఘా వర్గాల ఆరా
- అక్కడి పరిస్థితిపై వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో లాక్‌డౌన్‌ను మరింత పటిష్టంగా అమలు చేయాలని కేంద్రం సూచించింది. కొన్నిచోట్ల లాక్‌డౌన్ సరిగా అమలు కావడంలేదని, వెంటనే దీనిపై దృష్టి సారించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు సూచించింది. రాష్ట్రంలో రోజురోజుకూ కరోనా కేసుల సంఖ్య పెరుగుతోంది. హైదరాబాద్, వరంగల్ అర్బన్, నిజామాబాద్ జిల్లాల్లోనే అత్యధికంగా కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో కరోనా పాజిటివ్ కేసులు నమోదైన పాతబస్తీలోని అనేక ప్రాంతాల్లో లాక్‌డౌన్ సమగ్రంగా అమలు కావట్లేదని కేంద్రానికి నిఘా వర్గాలు నివేదించాయి. దీంతో పాజిటివ్ కేసులు నమోదవుతున్న ప్రాంతాల్లో లాక్‌డౌన్ అమలు తీరుపై వీడియో రికార్డింగ్ తీసి పంపాలని కేంద్ర ఆరోగ్య శాఖ.. రాష్ట్ర అధికారులను ఆదేశించింది. ఆయా ప్రాంతాలకు వెళ్లి అవసరమైతే తమకు వీడియో కాల్ ద్వారా పరిస్థితిని వివరించాలని సూచించింది. దీంతో శని, ఆదివారాల్లో ఆయా ప్రాంతాలకు ప్రత్యేక వైద్య బృందాలు వెళ్లి వీడియో రికార్డ్ చేయడంతో పాటు కేంద్ర అధికారులకు వాట్సాప్‌లో వీడియో కాల్ చేసి పరిస్థితిని వివరించాయి.

**మర్కజ్ సంబంధంతో మరింత అప్రమత్తం..**

రాష్ట్రంలో మార్చి 31 నుంచి కరోనా కేసుల సంఖ్య మరింత పెరుగుతున్న సంగతి తెలిసిందే. గత నాలుగు రోజుల వ్యవధిలోనే 190 కేసులు నమోదయ్యాయి. మార్చి 31న 15 కేసులు, ఏప్రిల్ 1 నుంచి వరుసగా భారీగా కేసులు నమోదయ్యాయి. ఈ కాలంలో ఏకంగా ఒకేరోజు 75 కరోనా కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ కూడా మర్కజ్ వ్యవహారంతో సంబంధమున్నవే కావడం గమనార్హం. ఒకట్రెండు కేసులు మినహా అన్నీ ఢిల్లీతో లింకు ఉన్నవే. మార్చి 26 నుంచి రాష్ట్రంలో ఢిల్లీతో కనెక్ట్ అయిన కరోనా కేసుల సంఖ్య బయటపడుతూ వస్తున్నాయి. మార్చి 22న కేంద్రం జనతా కర్ఫ్యూ విధించింది. మరుసటి రోజు నుంచే మన రాష్ట్రంలో లాక్ డౌన్ కొనసాగుతోంది. అనంతరం కేంద్రం కూడా దేశమంతా లాక్‌డౌన్ విధించింది. అయినా రాష్ట్రంలో కేసుల సంఖ్య తగ్గట్లేదు. దేశమంతా లాక్‌డౌన్ విధించే సమయానికి తెలంగాణలో ఐదారు జిల్లాల్లోనే కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గత ఐదారు రోజులుగా వరుసగా దాదాపు అన్ని జిల్లాల్లో కేసులు నమోదవుతున్నాయి. ముున్ముందు మిగిలిన జిల్లాల్లో కూడా కేసులు నమోదయ్యే అవకాశం కన్పిస్తోంది. ప్రస్తుతం నమోదయ్యే కేసులన్నీ కూడా మర్కజ్‌తో సంబంధమున్నవేనని తేలింది. పైగా అక్కడికి వెళ్లి వచ్చిన వారి కుటుంబాలకే కాకుండా ఇతరులకు కూడా ఇది సోకుతోంది. దాంతో కేసుల సంఖ్య చాలా వేగంగా పెరుగుతోంది. దీంతో అసలు రాష్ట్రంలో లాక్‌డౌన్ సరిగా అమలవుతోందా అన్న అనుమానం కేంద్రానికి కలిగింది. దీంతో పరిస్థితిని నేరుగా పరిశీలిస్తోంది. అంతేకాదు హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల పేర్లు చెప్పి వెంటనే అక్కడికి వెళ్లి లైవ్‌లో ఆ ప్రదేశాలను చూపించాలని కూడా కేంద్ర అధికారులు ఆదేశించారు. దాంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య అధికారులు కేంద్ర అధికారులు సూచించిన ప్రాంతాలకు ఆగమేఘాల మీద వెళ్లి లైవ్‌లో లాక్ డౌన్ అమలు, అక్కడి ప్రజల కదలికలను చూపించారు. అనంతరం కేంద్రం అక్కడి పరిస్థితిపై ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. అత్యధిక కేసులు నమోదైన ప్రాంతాల్లోనే కేంద్రం ఆరా తీసింది. అలాగే మిగిలిన కొన్ని ప్రాంతాల్లో కూడా ఇదే తరహాలో అక్కడి పరిస్థితిని స్వయంగా సమీక్షించింది. అలాగే వరంగల్ అర్బన్, నిజామాబాద్ జిల్లాల్లోనూ అధికంగా కేసులు నమోదయ్యాయి. దీంతో ఆ జిల్లాల్లో పరిస్థితులపై ఆరా తీసినట్లు తెలిసింది.



ఆదివారం టోలిచౌకి ప్రాంతంలో కిటకిటలాడుతున్న జనం

## కరోనా యముడు

ఈ కరోనా కష్ట కాలంలో మీరు బయటకొస్తే యమగంట మోగిపోద్ది ..అలా మోగిందా మీకు మూడినట్లేనంటూ ఆదివారం కరీంనగర్‌లోని సివిల్ ఆస్పత్రి చౌరస్తా వద్ద యమధర్మరాజు వేషంలో కరోనాపై అవగాహన కల్పిస్తున్న ఓ యువకుడు. *– సాక్షి ఫొటో గ్రాఫర్, కరీంనగర్*



## కరోనా మాస్క్

అడవి బిడ్డలకు అక్కడ దొరికే ఆకులు అలమలే వారికి ఆహారమూ, వైద్యమూను. సరిగ్గా వైద్యసదుపాయం లేని ఆ కొండకోనల్లో అక్కడ దొరికే ప్రతి మొక్క వారికి ఓ మూలికే. చిన్న చిన్న అనారోగ్యాలకు, గాయాలకు సైతం ఆకుపసర వైద్యంతోనే నెట్టుకొచ్చేస్తుంటారు. ప్రపంచమంతటా మానవాళిని కరోనా మహమ్మారి కలవరపెడుతున్న వేళ మాస్కులనీ, శానిటైజర్లనీ, భౌతిక దూరం అంటూ జాగ్రత్త పడిపోతున్న తరుణమిది. కరోనా నుంచి తమను తాము కాపాడుకునేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవి పల్లి మండలం గంగమ్మకాలనీలో ఇదిగో ఇలా ఆకులను సైతం మాస్కులుగా మార్చి ధరించిన ఓ తల్లీబిడ్డలు. *– సాక్షి ఫొటో గ్రాఫర్, భద్రాద్రి కొత్తగూడెం*



## కరోనా భయంతో పొలాల్లో నివాసం

- వైరస్ ప్రభావం తగ్గే వరకు ఇళ్లలోకి రామంటున్న 30 కుటుంబాలు

**నేరడిగొండ:** ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో మధుర కాలనీవాసులు ఆదివారం ఉదయం వ్యవసాయ క్షేత్రాల బాట పట్టారు. ఈ కాలనీకి చెందిన 30 కుటుంబాలు పొలాల్లో గుడారాలు వేసుకొని వంటావార్పు చేసుకుంటూ.. వైరస్ ప్రభావం తగ్గే వరకు అక్కడే ఉంటామని పేర్కొన్నారు. కొంతమంది ఇలా వ్యవసాయ క్షేత్రానికి వెళ్లడంతో మిగతా వారు వారి వారి ఇళ్ల నుంచి బయటకు రాకుండా స్వీయ నియంత్రణ పాటిస్తున్నారు. ఈ కాలనీలో ఓ వ్యక్తికి కరోనా పాజిటివ్‌రావడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు.



## ఐక్యతను చాటిన రాష్ట్ర ప్రజలు

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్

**సాక్షి, హైదరాబాద్:** కరోనాను ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రజలు తమ ఐక్యతను చాటారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర ప్రజలంతా రాత్రి 9 గంటలకు తమ ఇళ్ల ముందు దీపాలను వెలిగించి ఐక్యతను చాటుకున్నారని తెలిపారు. కరోనాను ఎదుర్కోవడంలో పోరాటం చేస్తున్న వైద్య సిబ్బందికి తాము ఉన్నామని భరోసా కల్పించడంతోపాటు ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, శానిటేషన్ కార్మికులకు ధైర్యాన్ని ఇచ్చేందుకు ప్రజలు తోడ్పాటును అందించారని పేర్కొన్నారు. ఢిల్లీకి వెళ్లి వచ్చిన వారు, వారిని కలిసిన వారు స్వచ్ఛందంగా పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావాలని కోరారు.

## ఆ జిల్లాలు జాగ్రత్త!

▶ మొదటి పేజీ తరువాయి

జాబితాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 10 జిల్లాలున్నాయి. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు, ఏపీలో విశాఖపట్నం, చిత్తూరు, తూర్పుగోదావరి, గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలున్నాయి. వీటి పరిధిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. ఆదివారం వీడియో కాన్ఫరెన్స్‌లో సైతం కేబినెట్ సెక్రటరీ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. కరోనా తీవ్రరూపం దాల్చితే కట్టడి చేయడం కష్టమని, లాక్‌డౌన్ కఠినంగా అమలు జరిగేలా చూడాలని, అవసరమైతే ఆంక్షలను మరికొన్ని గంటలు పొడిగించాలని సూచించారు.

## వైద్య సిబ్బందికి రక్షణ కల్పించండి

- పోలీసు సిబ్బందికి డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశాలు

**సాక్షి, హైదరాబాద్:** కరోనాపై జరుగుతున్న యుద్ధంలో కీలకంగా ఉన్న వైద్యులు, పారామెడికల్ సిబ్బందికి పూర్తి రక్షణ కల్పించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశించారు. వారిపై దాడులు చేసినా, భయపెట్టినా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు డీజీపీ అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లకు ఆదివారం కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రతి జిల్లాలోనూ కరోనా పాజిటివ్, అనుమానితులకు చికిత్స అందిస్తోన్న వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేయాలని డీజీపీ పేర్కొన్నారు. ఇందులో అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలు, జిల్లా వైద్యాధికారి, కమిషనరేట్లలో డీసీపీలు గ్రూపుల్లో ఉండాలని స్పష్టం చేశారు. వైద్యాధికారులు ఇస్తోన్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులు తెలుసుకోవాలని సూచించారు 'ఈ వాట్సాప్ గ్రూపుల ఏర్పాటుతో గ్రామస్థాయి నుంచి ప్రజల ఆరోగ్యంపై నిరంతర సమాచారం, కరోనా లక్షణాలు బయటపడ్డా.. వైద్యులతోపాటు, పోలీసులకు సమాచారం తెలియాలని, అప్పుడే సమన్వయం సాధ్యమవుతుందనేది డీజీపీ ఆలోచనగా ఓ ఎస్పీ ర్యాంకు అధికారి వ్యాఖ్యానించారు.



ప్రగతి భవన్‌లో కొవ్వొత్తులతో డీజీపీ మహేందర్‌రెడ్డి, ఎంపీ సంతోశ్



ఆదివారం రాజ్‌భవన్‌లో దీపం వెలిగించిన గవర్నర్ తమిళిసై

## చేతకాకపోతే ఇంట్లో కూర్చోండి: కిషన్‌రెడ్డి

### వైద్యులు, పోలీసులపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు

**సాక్షి, న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారిపై మానవాళి ఐక్యంగా పోరాటం చేయాల్సిన సమయంలో కొంతమంది పనిగట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఒకవైపు విపత్కర పరిస్థితులు నెలకొంటే దీపాలు వెలిగించే అంశాన్ని కొంతమంది రాజకీయం చేయడం మంచిదికాదన్నారు. దీపాలు వెలిగించడం చేతకాకపోతే ఇంట్లో కూర్చోవాలని హితవు పలికారు. ఇలాంటి నేతలకు జ్ఞానం లేదా? అంటూ మండిపడ్డారు. కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా కరోనాపై పోరాటం చేయాల్సిన సమయం ఇదని గుర్తు చేశారు. కరోనా మహమ్మారిని ఓడించాలంటే ఆత్మవిశ్వాసం, ఐకమత్యం,సేవాభావం, అంకిత భావమే మార్గాలని స్పష్టం చేశారు. ప్రజలు ఆత్మస్థైర్యంతో పోరాడాలన్నారు. కరోనాతో జరుగుతోన్న యుద్ధంలో పాల్గొంటున్న సివిల్ సర్వీసెస్ మొదలుకుని గ్రూప్ 4 ఉద్యోగి వరకు ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. వైద్యులు, పోలీసులు, ఇతర సిబ్బంది కనీసం గంట కూడా కుటుంబ సభ్యులతో గడపలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.



ఢిల్లీలో దీపం వెలిగిస్తున్న కిషన్‌రెడ్డి

## ఏపీలో 252కి చేరిన పాజిటివ్‌లు

- ఆదివారం ఒక్కరోజే కర్నూలులో 49 కేసులు నమోదు
- ఈ కేసులన్నీ ఢిల్లీ నిజాముద్దీన్ జమాతే లింకులున్నవే
- ఆదివారం కొత్తగా 60 కేసులతో కలిపి రాష్ట్రంలో 252కు చేరిన పాజిటివ్‌లు

**సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ):** కరోనా కేసులతో ఆదివారం ఒక్కసారిగా కర్నూలు జిల్లా ఉలిక్కిపడింది. ఒక్కరోజే ఇక్కడ 49 కేసులు నమోదు కావడంతో జిల్లాలో హై–అలర్ట్ ప్రకటించారు. ఈ కేసులన్నీ ఢిల్లీ జమాతేకు వెళ్లొచ్చిన వారే కావడం గమనార్హం. దీంతో కర్నూలు జిల్లాలో మొత్తం కరోనా కేసులు 53కి చేరాయి.తాజా పరిణామాలతో ఏపీలోనే అత్యధిక కేసులున్న జిల్లా కూడా ఇదే. ఒక్కసారిగా జిల్లాలో కరోనా విజృంభణతో లాక్‌డౌన్ ఆంక్షలను ఇక్కడ మరింత కఠినతరం చేశారు. మరోవైపు.. శనివారం రాత్రి 9 గంటల నుంచి ఆదివారం సా.5 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 60 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 252కు చేరినట్లు ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది. ఆదివారం ప్రకాశం జిల్లాలో 2, చిత్తూరు జిల్లాలో 7, నెల్లూరు జిల్లాలో రెండు కేసులు నమోదయ్యాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో ఆదివారం వరకు నమోదైన కేసుల్లో 11 విదేశాల నుంచి వచ్చిన వారు కాగా, వారి కాంటాక్ట్స్ ద్వారా ఆరుగురికి , మరో ఆరుగురు కరోనా లక్షణాలతో చేరినట్లు వైద్య శాఖ పేర్కొంది. దీని ప్రకారం రాష్ట్రంలో నమోదైన మొత్తం 252 కేసుల్లో 229 కేసులు ఢిల్లీ మూలాలు ఉన్నవారివే. కాగా, కరోనా కేసులు బయటపడుతున్న ప్రాంతాలపై రాష్ట్ర వైద్య శాఖ ప్రత్యేక దృష్టిసారిస్తోంది. ఆయా ప్రాంతాలను రెడ్ జోన్లుగా ప్రకటించి రాకపోకలను నిషేధించడం, శానిటైజేషన్, బ్లీచింగ్ వంటి కార్యక్రమాలను పెద్దఎత్తున చేపడుతోంది.

# సమర దీపం

▶ మొదటి పేజీ తరువాయి

తమ నివాసాలైన రాజ్‌భవన్, ప్రగతిభవన్‌లలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వీరితో పాటు కుల, మత, ప్రాంత, రాజకీయ విభేదాలకు అతీతంగా ప్రజలంతా దీపాలు వెలిగించడం ద్వారా కరోనా రక్కసిపై యుద్ధం చేస్తామని ప్రతినబూనారు. రాష్ట్ర మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, మహిళలు, యువకులు, చిన్నారులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు ఐక్యతా స్ఫూర్తిని చాటుతూ తమ నివాసాల వద్ద దీపాలు వెలిగించగా, బీజేపీ నేతల ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం జరిగింది. వ్యాపార, వాణిజ్య వర్గాలు, సినీ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులు, ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమస్ఫూర్తిని చాటారు.

**ఆంధ్రప్రదేశ్‌లోనూ..**

అటు ఏపీలోనూ వాడవాడలా ప్రజలు ఆదివారం రాత్రి దీప ప్రజ్వలన చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో దీపాలు వెలిగించి కరోనా వైరస్‌పై పోరుకు సంఘీభావాన్ని తెలిపారు. ఇంకా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని, డీజీపీ గౌతం సవాంగ్, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది దీపాలు వెలిగించారు. ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులు కూడా రాజ్‌భవన్‌లో దీప ప్రజ్వలన చేశారు.

**స్పీకర్, మంత్రుల సంఘీభావం**

అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన అధికారిక నివాసంలోనూ, డిప్యూటీ స్పీకర్ పద్మారావు తన ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి దీపాలు వెలిగించారు. మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి మంత్రుల నివాస సముదాయంలోని తమ అధికారిక నివాసంలో దీపాలు వెలిగించారు. ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు కొండాపూర్‌లోని తన నివాసంలో కుటుంబసభ్యులతో కలిసి దీపాలు వెలిగించి కరోనా చీకటిపై సమరభేరి మోగించారు.

## జ్యోతి వెలిగించిన సీఎం కేసీఆర్

కరోనా మహమ్మారిపై దేశవ్యాప్తంగా జరుగుతున్న ఐక్య పోరాటానికి సంఘీభావ సంకేతంగా సీఎం కే.చంద్రశేఖర్‌రావు ఆదివారం రాత్రి ప్రగతిభవన్‌లో జ్యోతి వెలిగించారు. ప్రధాని నరేంద్ర మోది పిలుపుమేరకు రాత్రి 9 గంటల నుంచి 9 నిముషాల పాటు కొవ్వొత్తి పట్టుకుని సంఘీభావం ప్రకటించారు. సీఎం కేసీఆర్ సతీమణి శోభ, మంత్రి కేటీఆర్ సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షు, కుమార్తె అలేఖ్య ఇతర కుటుంబసభ్యులతో పాటు ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు జె.సంతోష్‌కుమార్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు ఎస్.నర్సింగ్‌రావు, రామకృష్ణారావు, శాంతకుమారి, అడ్వకేట్ జనరల్ పీఎస్ ప్రసాద్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ రాంచందర్‌రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మరో 62 కరోనా కేసులు

▶ మొదటి పేజీ తరువాయి

డిశ్చార్జి అయ్యారు. నిజామాబాద్ జిల్లాలో 19 నమోదు కాగా, ఒకరు చనిపోయారు. కాగా, తెలంగాణలోని 25 జిల్లాలకు కరోనా పాకింది. సోమవారం మరో 600 మందికి పరీక్షలు నిర్వహించే అవకాశముంది.

**తప్పులతడకగా బులెటిన్:** ఆదివారం ఆరోగ్యశాఖ విడుదల చేసిన నివేదిక తప్పుల తడకగా ఉంది. శనివారం నాటికి 272 కేసులు నమోదు కాగా, సోమవారం 333 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. కానీ ఆ రెండింటి తేడా 61 మాత్రమే. కానీ 62 కేసులు నమోదైనట్లు నివేదికలో పేర్కొన్నారు. ఏది సరైన సంఖ్యో స్పష్టత లేదు. దీనిపై వివరణ అడిగేందుకు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు ఫోన్ ద్వారా ఎన్నిసార్లు ప్రయత్నించినా ఆయన ఫోన్ కట్ చేశారు. ఇక శనివారం వరంగల్ రూరల్‌లో కేసులు నమోదైనట్లు ప్రస్తావించారు. ఆదివారం రిపోర్టులో మాత్రం ఆ జిల్లా పేరు లేదు. కారణాలు ఏమిటో ఏ అధికారీ వివరణ ఇవ్వలేదు. కొందరు ఫోన్ లిఫ్ట్ చేయకపోగా, ఇంకొందరి ఫోన్లు స్విచ్ఛాఫ్ అని వచ్చింది.

**జిల్లాల వారీగా నమోదైన కేసులు, మృతులు**

| జిల్లా పేరు | పాజిటివ్ | మృతులు | జిల్లా పేరు | పాజిటివ్ | మృతులు |
|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 10 | – | నాగర్‌కర్నూల్ | 02 | – |
| భద్రాద్రి కొత్తగూడెం | 04 | – | నల్లగొండ | 13 | – |
| హైదరాబాద్ | 155 | 07 | నిజామాబాద్ | 19 | 01 |
| జగిత్యాల | 02 | – | రంగారెడ్డి | 17 | 01 |
| జనగాం | 02 | – | సంగారెడ్డి | 07 | – |
| భూపాలపల్లి | 01 | – | సిద్ధిపేట | 01 | – |
| గద్వాల | 05 | 01 | సూర్యాపేట | 02 | – |
| కామారెడ్డి | 08 | – | వరంగల్ అర్బన్ | 24 | – |
| కరీంనగర్ | 17 | – | వికారాబాద్ | 04 | – |
| మహబూబాబాద్ | 01 | – | నిర్మల్ | 01 | 01 |
| మహబూబ్‌నగర్ | 04 | – | పెద్దపల్లి | 01 | – |
| మెదక్ | 05 | – | ములుగు | 02 | – |
| మేడ్చల్ | 14 | – | మొత్తం | 321 | 11 |

# అందరికీ పరీక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే వాహనాలకు అనుమతివ్వాలి. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఒకేసారి రాకుండా చూడాలి. వారికిచ్చిన కూపన్లలో పేర్కొన్న తేదీ ప్రకారమే కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా రైతులను చైతన్యపరచాలి. కొనుగోలు కేంద్రాల వద్ద కావల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలి. రైతుల దగ్గరి నుంచి చివరి గింజ వరకు కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది కాబట్టి రైతులెవరూ తొందరపడొద్దు'అని సీఎం కోరారు.

**గన్నీ బ్యాగుల కోసం ప్రధానికి ఫోన్**

రాష్ట్రంలో గన్నీ బ్యాగులకు తీవ్ర కొరత ఉంది. గన్నీ బ్యాగులు తయారు చేసే పరిశ్రమలు పశ్చిమబెంగాల్‌లో ఉన్నాయి. ఏటా అక్కడి నుంచే బ్యాగులు వస్తాయి. ఈసారి లాక్‌డౌన్ కారణంగా బెంగాల్‌లో పరిశ్రమలు మూతపడటంతో గన్నీ బ్యాగుల కొరత ఏర్పడింది. రాష్ట్రంలో ధాన్యం సేకరణకు 20 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం. ఈ నేపథ్యంలో ఈ విషయంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమబెంగాల్‌లో గన్నీ బ్యాగుల తయారీ పరిశ్రమలను తెరిపించాలని, గన్నీ బ్యాగులు రాష్ట్రాలకు చేరుకోవడానికి ప్రత్యేక రైళ్లను అనుమతించాలని అభ్యర్థించారు. దీనికి మోదీ సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. రాష్ట్రానికి గన్నీ బ్యాగులు చేర్చే విషయంలో సంబంధిత శాఖలతో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. సమీక్షలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి ముఖ్య కార్యదర్శులు నర్సింగ్ రావు, శాంత కుమారి, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి జిల్లాలో స్వల్ప భూకంపం

**ఆందోళనతో ఇళ్ల నుంచి పరుగులు తీసిన జనం**

**పాల్వంచ/ పాల్వంచ రూరల్/బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ, బూర్గంపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో భూమి స్వల్పంగా కంపించింది. దీంతో ప్రజలు ఆందోళనతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పాల్వంచ మండలం రంగాపురం, జగన్నాథపురం, పాండురంగాపురం, లక్ష్మీదేవిపల్లి, కేశవాపురం, బస్వతారక కాలనీల్లో మూడు సెకండ్లపాడు, బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజర, అంజనాపురం, పినపాక పట్టీనగర్ గ్రామాల్లో రెండు సెకండ్లపాటు భూమి కంపించింది. ప్రస్తుతం కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజలంతా ఇళ్లకే పరిమితం కావడం.. ఈ క్రమంలోనే భూమి కంపించడంతో ఆయా గ్రామాల ప్రజలు ఏం జరుగుతుందోననే ఆందోళనతో ఒక్కసారిగా పరుగులు తీశారు. అలాగే పాల్వంచ పట్టణంలోని కేటీపీఎస్ కాలనీలు, గట్టాయిగూడెం, బొల్లేరుగూడెం, కాంట్రాక్టర్స్ కాలనీ, టీచర్స్ కాలనీ, సీతారాంపట్నం తదితర ప్రాంతాల్లో కూడా భూమి కంపించింది. ప్రకంపనలకు ఇళ్లలో వంట సామగ్రి కిందపడినట్లు ప్రజలు చెబుతున్నారు. రిక్టర్ స్కేల్‌పై ఈ ప్రకంపనలు 2.6గా నమోదైనట్లు అధికారులు తెలిపారు.



**రసాయనాల జల్లు.. ఇన్‌ఫెక్షన్లకు చెల్లు**

ఇది మొన్న రాష్ట్ర డీజీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కరోనా సేఫ్టీ టన్నెల్ లాంటిదే.. చెన్నైలో దీన్ని రహదారిపై ఏర్పాటు చేశారు.. ఇందులోని పంపులు ఇన్‌ఫెక్షన్లు దరిచేరకుండా రసాయనాలు చల్లుతాయి. ఆదివారం ఆ టన్నెల్‌లో నుంచి వెళ్తున్న ఓ వాహనదారుడు.

## ‘కరోనా’ కోసం రైల్వే ఆసుపత్రులు

**వేయి పడకలతో క్వారంటైన్ వార్డు**
- 63 బెడ్‌లతో ఐసోలేషన్ వార్డుల ఏర్పాటు
- రైలు బోగీల్లో 7,776 బెడ్లతో మరిన్ని వార్డులు

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా కరోనా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య వేగంగా పెరుగుతుండటంతో కేంద్రం అప్రమత్తమైంది. పాజిటివ్ కేసులకు సంబంధించి వైద్య సాయం, అనుమానితుల క్వారంటైన్ కోసం రాష్ట్రాలతో పాటు రైల్వే శాఖకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు రైల్వే ఆసుపత్రుల్లో ఐసోలేషన్ వార్డుల ఏర్పాటు, రైలు బోగీలను ఐసోలేషన్, క్వారంటైన్ సెంటర్లుగా మార్చే ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. గతంలో ప్రయోగాత్మకంగా వాటిపై దృష్టి సారించగా, ఇప్పుడు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. దీనికి సంబంధించి అన్ని జోన్‌లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా దక్షిణమధ్య రైల్వే పరిధిలో తొలుత 63 పడకలతో కూడిన ఐసోలేషన్ వార్డు, వేయి పడకలతో కూడిన క్వారంటైన్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే మౌలాలిలోని రైల్వే ఆసుపత్రితోపాటు అన్ని డివిజన్ కేంద్రాల్లో ఉన్న ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో వీటి ఏర్పాటుకు చర్యలు మొదలుపెట్టింది. మరో ఐదారు రోజుల్లో ఇవి అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. దీంతోపాటు ఎక్కడికైనా తరలించేలా బోగీలను కూడా సిద్ధం చేసే పనిని వేగిరం చేసింది. 486 కోచ్‌లను క్వారంటైన్, ఐసోలేషన్ వార్డులుగా మార్చబోతోంది. ఒక్కో కోచ్‌లో 16 బెడ్లు ఉంటాయి. మొత్తంగా 7,776 బెడ్లు అందుబాటులోకి వస్తాయి. ప్రతి కోచ్‌లో 9 కూపేలుంటాయి. ఇందులో మొదటి కూపేను పారా మెడికల్ సిబ్బందికి, మిగతా 8 కూపేలను బాధితులకు కేటాయిస్తారు. ప్రతి కూపేలో రెండు బెర్తులను బెడ్లుగా మారుస్తారు.

**కాంట్రాక్టుపై పారా మెడికల్ సిబ్బంది..**

కరోనా బాధితులు ఎంతమందితో కాంటాక్ట్ అయ్యారో గుర్తించి వారిని వెంటనే క్వారంటైన్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అధీనంలోని క్వారంటైన్ కేంద్రాలు, ఆసుపత్రులు చాలని పక్షంలో రైల్వే ఏర్పాటు చేసిన కోచ్‌లను వినియోగిస్తారు. ఇందు కు రైల్వే శాఖకు అందుబాటులో ఉన్న వైద్య సిబ్బం ది సరిపోరు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పెద్ద మొత్తం లో పారా మెడికల్ స్టాఫ్‌ను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే పత్రిక ప్రకటన, ఆన్‌లైన్ నోటిఫికేషన్ జారీ చేసింది.

## పీఎఫ్‌లో పుట్టిన తేదీ సవరణకు అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** భవిష్యనిధి(పీఎఫ్) ఖాతాదారులకు పుట్టిన తేదీ సవరణకు ఈపీఎఫ్ఓ అవకాశం కల్పించింది. పీఎఫ్ ఖాతాలో ఇప్పటికే నమోదై ఉన్న పుట్టిన తేదీ సరైంది కాకుంటే ఆధార్‌లో ఉన్న తేదీ ఆధారంగా సవరణ చేసుకోవచ్చు. ఇందుకు యూఏఎన్ సంఖ్య ఆధారంగా ఆన్‌లైన్‌లో సవరణ చేసుకోవాలి. ప్రస్తుతం కరోనా నేపథ్యంలో పీఎఫ్ ఖాతాదారులకు భవిష్యనిధి ఖాతా నుంచి నగదు ఉపసంహరణకు అవకాశం కల్పించిందని, పూర్తి వివరాలు, కేవైసీ సమర్పించి ఆన్‌లైన్ ద్వారానే నగదు విత్‌డ్రాకు దరఖాస్తు చేసుకోవచ్చని భవిష్యనిధి కమిషనర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



పోకర్న గ్రూప్ తరఫున చెక్కును అందిస్తున్న గౌతమ్ జైన్. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి

## సీఎం సహాయ నిధికి విరాళాలు

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వ్యాప్తి నివారణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తమ వంతు సహాయంగా ఆదివారం పలువురు ప్రముఖులు విరాళాలు ఇచ్చారు. పోకర్న గ్రూప్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.కోటి విరాళం అందజేసింది. దీనికి సంబంధించిన చెక్కును గ్రూప్ చైర్మన్ గౌతమ్ జైన్ ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. అలాగే నాష్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.కోటి విరాళాన్ని అందించింది. దీనికి సంబంధించిన చెక్కును సంస్థ ఎండీ బీఎస్ఎన్ రెడ్డి, డైరెక్టర్ వీవీఎస్ రెడ్డి ముఖ్యమంత్రికి అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్‌కు చెక్కును అందిస్తున్న బీఎస్ఎన్‌రెడ్డి, వీవీఎస్‌రెడ్డి. చిత్రంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## సీఎంఆర్‌ఎఫ్‌కు మమత వైద్య విద్యా సంస్థ రూ.25 లక్షల విరాళం

**ఖమ్మం మయూరి సెంటర్:** కరోనా వైరస్ నివారణ చర్యల్లో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు మమత వైద్య విద్యా సంస్థ చైర్మన్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.25 లక్షల విరాళం ఇవ్వనున్నట్లు ఆదివారం ప్రకటించారు. అలాగే మంత్రి పువ్వాడ పిలుపు మేరకు గత ఐదు రోజులుగా ఖమ్మంలోని పలువురు ప్రముఖులు, వ్యాపారులు, విద్యా సంస్థలు, ఆస్పత్రుల నిర్వాహకులు, వైద్యులు, కాంట్రాక్టర్లు ఇప్పటివరకు రూ.1.75 కోట్ల వరకు విరాళాలు అందజేశారు. వీటితోపాటు తాను ప్రకటించిన రూ.25 లక్షల విరాళంతో కలిపి మొత్తం రూ.2 కోట్లను సీఎం కేసీఆర్‌కు మంత్రి అజయ్‌కుమార్ అందజేయనున్నారు.

## బాబు జగ్జీవన్‌రామ్‌కు సీఎం కేసీఆర్ నివాళి



**సాక్షి, హైదరాబాద్:** బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నివాళులు అర్పించారు. దేశంలో సామాజిక న్యాయ సాధనకు జగ్జీవన్ రామ్ గొప్ప కృషి చేశారని ఆయన సేవలను స్మరించుకున్నారు.

# 5 నిమిషాల్లో కరోనా పరీక్ష

- ‘హాట్‌స్పాట్’ ఏరియాల్లో ర్యాపిడ్ టెస్ట్‌లకు రంగం సిద్ధం
- పరీక్షల తీరుతెన్నులపై ఐసీఎంఆర్ మార్గదర్శకాలు జారీ
- అనుమానితుల రక్త నమూనాల సేకరణ.. అక్కడే పరీక్ష
- పాజిటివ్ వస్తే కరోనా టెస్ట్.. నెగెటివ్ వస్తే హోం క్వారంటైన్
- 2.20 లక్షల మందికి సరిపడేలా కిట్లకు ఆర్డర్ ఇచ్చిన సర్కార్

**సాక్షి, హైదరాబాద్:** ఐదు నిమిషాల్లోనే కరోనా నిర్ధారణ పరీక్షలు చేయాలని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) నిర్ణయించింది. కరోనా రోజురోజుకూ విజృంభిస్తుండటం, పెద్దఎత్తున పరీక్షలు చేయాల్సిన అవసరం ఏర్పడటంతో ర్యాపిడ్ టెస్ట్‌లు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 2.20 లక్షల మందికి సరిపోయేలా కిట్ల కోసం ప్రభుత్వం ఆర్డర్లు పెట్టింది. వీటి ద్వారా రాష్ట్రంలో అత్యధికంగా కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించి అక్కడికక్కడే ర్యాపిడ్ కరోనా టెస్ట్ చేస్తారు. ఐదు నిమిషాల్లో పాజిటివ్ లేదా నెగెటివ్ అనేది తెలుస్తుంది. ఈ పరీక్షను రక్త నమూనాల ఆధారంగా చేస్తారు. దీన్నే యాంటీబాడీ రక్త ఆధారిత పరీక్ష అని కూడా అంటారు. అంటే ఆ వ్యక్తి శరీరంలోకి వైరస్ ప్రవేశించిందా లేదా ప్రభావితమైందా అనేది ఈ ర్యాపిడ్ టెస్ట్‌ల ఉద్దేశం. ఈ పరీక్షలను కరోనా వైరస్ పాజిటివ్ అత్యధికంగా నమోదైన ప్రాంతాల్లోనే నిర్వహిస్తారు. అందుకోసం అత్యధికంగా పాజిటివ్ నమోదైన ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ గుర్తించే పనిలో ఇప్పటికే నిమగ్నమైంది.



**హైదరాబాద్‌లో హాట్‌స్పాట్‌లివే..**

రెండ్రోజుల క్రితం వరకు 25 హాట్‌స్పాట్లను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు గుర్తించాయి. ఇంకా అనేక జిల్లాల్లో వీటిని గుర్తించే ప్రక్రియ మొదలైంది. జీహెచ్ఎంసీ పరిధిలో కరోనా పాజిటివ్ కేసులు నమోదైన యూసఫ్‌గూడ, చంచల్‌గూడ, సికింద్రాబాద్, దారుషిఫా, మహేంద్రహిల్స్, సికింద్రాబాద్ ఎంజీ రోడ్, నాంపల్లి, ఎమ్మెల్యే కాలనీ, న్యూమలక్‌పేట, నారాయణగూడ, ఖైరతాబాద్, మణికొండ, రాజేంద్రనగర్, షాద్‌నగర్, కుత్బుల్లాపూర్, టోలిచౌకి, చార్మినార్, ఫిలింనగర్ బస్తీ, బేగంపేట, నాచారం, కొత్తపేట, పీఅండ్‌టీ కాలనీ, అంబర్‌పేట ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించినట్టు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. కేసుల సంఖ్య మరో నాలుగైదు రోజుల్లో పెరిగే పరిస్థితి ఉన్నందున మరికొన్ని ప్రాంతాలను గుర్తించే అవకాశముంది. అయితే ఆయా ప్రాంతాల్లో ఇంటింటి సర్వేచేసి ర్యాపిడ్ టెస్ట్‌లు చేసే విషయమై వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు ఎలాంటి సమాచారం ఇవ్వడంలేదు. ఒకవిధంగా చెప్పాలంటే హైదరాబాద్ రెడ్‌జోన్‌లోనే ఉన్నట్టుగానే భావిస్తున్నారు. హాట్‌స్పాట్లకు సంబంధించి ఆయా జిల్లా కలెక్టర్లకు బాధ్యత అప్పగించామని అధికారులు చెబుతున్నారు.

**పరీక్షల ప్రక్రియ ఇలా..**

ఇప్పటికే హైదరాబాద్ సహా వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో హాట్‌స్పాట్లను గుర్తించారు. మిగిలిన జిల్లాల్లోనూ గుర్తిస్తున్నారు. అటువంటి ప్రాంతాల్లోనే ర్యాపిడ్ కరోనా పరీక్షలు నిర్వహిస్తారు. ర్యాపిడ్ టెస్టుల్లో ఒకవేళ పాజిటివ్ వస్తే తక్షణమే, హైదరాబాద్‌లోని నిర్ణీత ల్యాబ్‌కు పంపిస్తారు. అక్కడ గొంతుల్లోంచి స్వాబ్ తీసి రియల్ టైం పాలిమరేస్ చైన్ రియాక్షన్ (ఆర్‌టీ–పీసీఆర్) పరీక్ష నిర్వహిస్తారు. ఆ పరీక్షలో పాజిటివ్ వస్తే హైదరాబాద్‌లో చికిత్స చేస్తారు. ఇక ర్యాపిడ్ పరీక్షలో నెగెటివ్ వచ్చినా జ్వరం, జలుబు, దగ్గు ఉంటే వారిని హోం క్వారంటైన్‌లో 14 రోజులు ఉంచాలని ఐసీఎంఆర్ సూచించింది. వారికి లక్షణాలు అధికంగా ఉంటే హైదరాబాద్‌లో ఆర్‌టీ–పీసీఆర్ పరీక్ష నిర్వహిస్తారు. ర్యాపిడ్ టెస్టుల్లో నెగెటివ్ వచ్చిన వారు హోం క్వారంటైన్ పూర్తయ్యాక తిరిగి మళ్లీ పరీక్ష నిర్వహించాకే బయటకు వెళ్లడానికి అనుమతించాలని ఐసీఎంఆర్ సూచించింది. జాతీయస్థాయిలో ఏర్పాటైన జాతీయ టాస్క్‌ఫోర్స్ ఈ పరీక్ష ప్రక్రియను వేగవంతం చేస్తోంది.

**వరంగల్ అర్బన్, నిజామాబాద్ జిల్లాల్లో..**

వరంగల్ అర్బన్ జిల్లాలో జులైవాడ, సుబేదారి, ఈద్గా, కుమార్‌పల్లి, మండిబజార్, పోచంమైదాన్, చార్‌బౌలి, కాశీబుగ్గ, గణేష్‌నగర్, నిజాంపుర, లక్ష్మీపురం, రంగంపేట, శాంబునిపేట, బాపూజీనగర్, చింతగట్టు క్యాంప్‌లను హాట్‌స్పాట్లుగా గుర్తించారు. వీటినే నో మూమెంట్ జోన్లుగా అక్కడి అధికారులు పిలుస్తున్నారు. ఈ ప్రాంతాల్లో కాలనీలను గుర్తించి ఎన్నెన్ని ఇళ్లలో సర్వే చేయాలో కూడా నిర్ణయించారు. ఆ తర్వాత అత్యధిక కేసులు నమోదైన నిజామాబాద్‌లో ఆర్యానగర్, మాలపల్లి, ఖిల్లారోడ్‌ను కూడా హాట్‌స్పాట్లుగా గుర్తించినట్లు తెలిసింది. కరీంగనగర్ జిల్లాలోనూ అధికంగా కేసులు నమోదయ్యాయి. అక్కడ కూడా అధికారులు హాట్‌స్పాట్లను గుర్తించినట్లు సమాచారం. తక్కువ కేసులున్న ప్రాంతాల్లో పాజిటివ్ వ్యక్తులున్న ఇళ్లకు మూడు కిలోమీటర్ల మేర హాట్‌స్పాట్‌గా ప్రకటించి కంటైన్మెంట్ ప్రణాళికను అమలుచేస్తారు. ఇంటింటికి వెళ్లి వైరస్ లక్షణాలున్న వారికి ర్యాపిడ్ టెస్ట్‌లు నిర్వహిస్తారు.

## కరోనాకు మతం రంగు పులమొద్దు

**టీపీసీసీ చీఫ్ ఉత్తమ్**



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ వ్యాప్తి విషయంలో మతం ప్రస్తావన అనవసరమని, మతం రంగు పులిమి ప్రచారం చేయడం తగదని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కుల, మత, ప్రాంత, వర్గ విభేదాలకు తావు లేకుండా ఈ మహమ్మారిని ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. గాంధీభవన్ నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్‌తో పాటు ఫేస్‌బుక్ లైవ్‌లో ఆదివారం ఉత్తమ్ మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో రాష్ట్రంలోని ప్రజలు, పేదలను ఆదుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

## రోజుకు 35 కాల్స్

**కాంగ్రెస్ కరోనా కంట్రోల్ రూంకు మంచి స్పందన**

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ నియంత్రణ కోసం ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాల అమలులో రాష్ట్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు మంచి స్పందన వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలు, వివిధ ప్రాంతాల నుంచి రోజుకు 35 వరకు కాల్స్ వస్తున్నాయని, ఈ కంట్రోల్ రూం ఏర్పాటు చేసిన వారం రోజుల్లో 252 కాల్స్ వచ్చాయని టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి. ఇందులో తమకు ఆహార పదార్థాలు కావాలని, శానిటైజర్లు కావాలని ఎక్కువగా ఫోన్లు చేస్తున్నారని కంట్రోల్ రూం సభ్యులు చెబుతున్నారు. కాగా, ఈ కంట్రోల్ రూంను టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎంఆర్‌జి.వినోద్‌రెడ్డితో పాటు పలువురు నేతలు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. కంట్రోల్ రూం నిర్వహణపై వినోద్‌రెడ్డి ‘సాక్షి’తో మాట్లాడుతూ.. ప్రజలు తమకు చెబుతోన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని, కొన్నింటిని తామే పరిష్కరిస్తున్నామని చెప్పారు. దీనికి స్థానిక కాంగ్రెస్ నేతల సాయం తీసుకుంటున్నామని వెల్లడించారు.

## గట్టెక్కిన గ్రిడ్!

- సాగర్ రివర్స్ పంపింగ్, కాళేశ్వరం ఎత్తిపోతలు నడిపి కృత్రిమ డిమాండ్ సృష్టి
- ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ, ఇంజనీర్లకు సీఎం కేసీఆర్ అభినందనలు



ప్రభాకర్‌రావు

**సాక్షి, హైదరాబాద్:** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆదివారం రాత్రి 9 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి విద్యుత్ దీపాలు ఆర్పినప్పటికీ, విద్యుత్ శాఖ పక్కా వ్యూహంతో వ్యవహరించడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. ఒకేసారి పెద్ద మొత్తంలో విద్యుత్ వినియోగంలో మార్పులు సంభవించినా, ఉత్పత్తి – సరఫరా మధ్య సమతూకం సాధించడంలో జెన్ కో, ట్రాన్స్ కో పూర్తిస్థాయిలో విజయం సాధించాయి. ఆదివారం ఉదయం నుంచి జెన్ కో– ట్రాన్స్ కో సీఎండీ ప్రభాకర్‌రావు విద్యుత్ సౌధలోని లోడ్ డిస్పాచ్ సెంటర్‌లోనే ఉండి విద్యుత్ డిమాండ్ ఒకేసారి పడిపోయినప్పుడు అనుసరించాల్సిన వ్యూహం రచించారు. దానికి అనుగుణంగా రాత్రి 9 గంటల నుంచి 9 నిమిషాల పాటు వ్యవహరించారు. రాష్ట్రంలో ఒకేసారి లైట్లు ఆర్పేయడం వల్ల 300 నుంచి 500 మెగావాట్ల డిమాండ్ పడిపోయే అవకాశం ఉందని కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ అంచనా వేసింది. కానీ రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి లైట్లు ఆర్పేయడం వల్ల రాష్ట్రంలో 1,500 మెగావాట్ల డిమాండ్ పడిపోయింది.

**మూడు రెట్ల విద్యుత్ డిమాండ్ పతనం...**

ఆదివారం రాత్రి 9 గంటలకు ముందు రాష్ట్రంలో 7,380 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా, 9 గంటల తర్వాత 5,800 మెగావాట్లకు పడిపోయింది. రాష్ట్రమంతటా ఇళ్లల్లో విద్యుత్ దీపాలను బంద్ చేస్తే గరిష్టంగా 300–500 మెగావాట్ల డిమాండ్ మాత్రమే తగ్గనుందని కేంద్ర విద్యుత్ ప్రాధికారత సంస్థ (సీఈఏ) అంచనా వేయగా, దాని కన్నా మూడు రెట్లు అధికంగా విద్యుత్ డిమాండ్ పతనమైంది. అయినా విద్యుత్ సరఫరా వ్యవస్థ (గ్రిడ్) కుప్పకూలకుండా లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎల్డీసీ) ఇంజనీర్లు కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఒక్కసారిగా విద్యుత్ డిమాండ్ భారీగా తగ్గడంతో గ్రిడ్‌ను బ్యాలెన్స్ చేసేందుకు నాగార్జునసాగర్ రివర్స్ పంపింగ్ కేంద్రంలోని నాలుగు యూనిట్లను నడపడం ద్వారా 400మెగావాట్ల విద్యుత్‌ను, మేడారంలోని కాళేశ్వరం పంపింగ్ స్టేషన్‌ను నడపడం ద్వారా మరో 300 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగించారు. ఇలా మొత్తం 700 మెగావాట్ల కృత్రిమ విద్యుత్ డిమాండ్‌ను సృష్టించడంతో పాటు మరో 800 మెగావాట్ల వరకు థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి తగ్గించడం ద్వారా గ్రిడ్ బ్యాలెన్సింగ్‌ను పరిరక్షించారు. దీంతో విద్యుత్ ఉత్పత్తి– సరఫరాల మధ్య సమతూకం కుదిరింది. విద్యుత్ దీపాలను మళ్లీ వెలిగించడంతో క్రమంగా రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ పుంజుకుని పూర్వస్థితికి చేరింది. లైట్లు ఆర్పేసినా విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేసిన విద్యుత్ శాఖను ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు.

## మూకుమ్మడి భేటీలతోనే ‘వైరల్ లోడ్’

- ఎక్కువ మంది గుమికూడటం మంచిది కాదు
- అంతర్జాతీయ వైద్య నిపుణుడు డా.శ్రీనాథరెడ్డి
- శ్రీనాథరెడ్డి, డాక్టర్ మూర్తిలతో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ భేటీ

**సాక్షి, హైదరాబాద్:** ప్రపంచాన్ని వణికిస్తోన్న కరోనా వైరస్‌ను బలహీన పర్చడమే మనముందున్న మార్గమని వైద్య నిపుణులు డాక్టర్ కె. శ్రీనాథరెడ్డి, డాక్టర్. జీవీఎస్. మూర్తిలు వెల్లడించారు. మూకుమ్మడి భేటీలతో ఈ వైరల్ లోడ్‌ను ఉధృతం చేయొద్దని, ఇది అత్యంత ప్రమాదకరమని వారు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అంతర్జాతీయ వైద్యనిపుణుడు, అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లోని యూనివర్శిటీల్లో ప్రొఫెసర్‌గా, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రతినిధిగా, ఎయిమ్స్ డైరెక్టర్‌గా పనిచేసిన డాక్టర్. శ్రీనాథరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్. జీవీఎస్ మూర్తిలతో ఆదివారం భేటీ అయి చర్చించారు. కరోనా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్. శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ.. కరోనా నియంత్రణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ క్రియాశీలకంగా పనిచేస్తున్నారని, దేశానికే దిశానిర్దేశం చేసే విధంగా రాష్ట్రం ముందుకెళుతోందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన సూచించారు. భౌతికదూరాన్ని పాటించడం ద్వారా కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణకు నడుం బిగించాలని, ఎక్కువ మంది గుమికూడటం మంచిది కాదని చెప్పారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ.. కరోనా నియంత్రణ కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తోడు ప్రజల సహకారం కూడా అవసరమని, వైద్య నిపుణుల సలహాలతో రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

## రాష్ట్రంలో 14వేల వరి కోత యంత్రాలు

**వ్యవసాయ శాఖ కార్యదర్శి వెల్లడి**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో 14,095 హార్వెస్టర్లు (వరి కోత యంత్రాలు) అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ కార్యదర్శి డాక్టర్ బి.జనార్దన్ రెడ్డి తెలిపారు. తమిళనాడు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన 753 వరి కోత యంత్రాలు సూర్యాపేట, కామారెడ్డి, ఖమ్మం ఇతర జిల్లాల్లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. సగటున రోజుకు 1.50 లక్షల ఎకరాల్లో కోత అవుతుందని, 40 నుంచి 50 రోజుల్లో కోత పూర్తి చేయవచ్చని తెలిపారు. రబీలో 17 లక్షల ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గాను 39 లక్షల ఎకరాలలో వరి సాగైంది. సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా కోతకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## ‘సగం’ మందికి చేరిన బియ్యం

- ఐదు రోజుల్లోనే 1.40 కోట్ల మంది లబ్ధిదారులకు రేషన్ సరఫరా
- 1.60 లక్షల మెట్రిక్ టన్నుల మేర పూర్తయిన బియ్యం పంపిణీ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ బియ్యం పంపిణీ వేగంగా జరుగుతోంది. గడిచిన రెండు మూడు రోజులుగా సర్వర్ సమస్యల కారణంగా అనేక ఇబ్బందులు తలెత్తగా, ఆదివారానికి సమస్య కొలిక్కి రావడంతో పంపిణీ కార్యక్రమం సజావుగా కొనసాగింది. శనివారం ఒక్క రోజే గరిష్టంగా 10.04 లక్షల మంది కార్డుదారులు రేషన్ బియ్యాన్ని తీసుకోగా ఆదివారం మధ్యాహ్నానికి 6.50 లక్షల మంది రేషన్ తీసుకున్నారు. మొత్తంగా రాష్ట్రంలో 87.59 లక్షల కుటుంబాల్లో 2.80 కోట్ల మంది లబ్ధిదారులు ఉండగా, ఇప్పటివరకు 45.11 లక్షల కుటుంబాల్లో 1.60 కోట్ల మంది 1.67 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తీసుకున్నట్లు పౌర సరఫరాల శాఖ వర్గాలు వెల్లడించాయి. నిజానికి సాధారణ రోజుల్లో ఒక్కో లబ్ధిదారుడికి 6 కిలోల చొప్పున నెలకు 1.57 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని శాఖ పంపిణీ చేస్తుంటారు. ఈ ప్రక్రియ ప్రతి నెలా 15 రోజుల పాటు కొనసాగుతుంది. కానీ ప్రస్తుతం ఒక్కో లబ్ధిదారుడికి 12 కిలోల ఉచిత బియ్యాన్ని పంపిణీ చేస్తుండగా ఇప్పటికే నెల కోటాను దాటి 1.67 లక్షల మెట్రిక్ టన్నుల పంపిణీని పూర్తి చేసింది. ఆదివారం సైతం చాలా రేషన్ దుకాణాల వద్ద జనం గుంపులుగా కనిపించినా డీలర్లు వేగంగానే పంపిణీ ప్రక్రియ పూర్తి చేశారు.



**15 తర్వాత కిలో కందిపప్పు..**

కేంద్ర ప్రభుత్వం సైతం రేషన్ లబ్ధిదారులకు కిలో కందిపప్పు ఇచ్చేందుకు సమ్మతించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 87.59 లక్షల కుటుంబాలకు కిలో చొప్పున మొత్తంగా 26,685 మెట్రిక్ టన్నుల మేర కందిపప్పు అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ కందిపప్పును కేంద్ర సంస్థ అయిన నాఫెడ్.. పౌర సరఫరాల సంస్థకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మరో వారం పది రోజుల్లో పూర్తవగానే ఈ నెల 15 తర్వాత నుంచి కందిపప్పును పంపిణీ చేయనున్నారు.

సాక్షి
సాహిత్యం

నల్లగొండ | సోమవారం
ఏప్రిల్ | 6 | 2020

sakshisahityam@gmail.com




సోనియా షా


జినా కోలటా


కార్మాక్ మెకార్తీ














కామూ

● ప్రత్యేక వ్యాసం

# కలం చెప్పిన వైరస్ కథలు

**రవి గాంచనిది కవి గాంచును అంటారు. ఇవాళ ప్రభుత్వాలు ఊహించనది, ఒకప్పుడు రచయితలు ఊహించారు. సాహిత్యంలో సైన్సు ఫిక్షన్ ఒక భాగం. కొందరు రచయితలు తమ కాలం కంటే ముందుకెళ్లి మానవాళికి రాబోయే ప్రమాదాలను తమ రచనల్లో ఆవిష్కరించారు. ఇప్పుడు కరోనా వైరస్ విజృంభిస్తోంది. ఈ నేపథ్యంలో 'వైరస్'ల ప్రమాదఘంటికలు మోగించిన పుస్తకాలను కొన్నింటిని పరిశీలిద్దాం.**

గతంలో మానవాళి మీద చాలా వైరస్‌లే వచ్చాయి. ఇప్పుడు వచ్చిన వైరస్ ప్రపంచాన్నే లాక్‌డౌన్ చేయించింది. దీని వ్యాప్తి తెలియకుండానే, అప్రయత్నంగానే జరుగుతుండటం ఒక కారణం. దీనికి ఇంకా మందు కనిపెట్టలేకపోవడం మరో కారణం. ఈ వ్యాధి సోకినవారు, సోకినవారి ద్వారా మరొకరికి సోకే సమయాలు కనిపెట్టలేకపోవడం ఇందులో అత్యంత ప్రమాదకరమైన విషయం. రచయితలు మనుషులకు వచ్చే సమస్యలను తమ కథాంశాలుగా చేసుకున్నట్టే ఈ 'వైరస్'లను కూడా తమ కథాంశాలు చేసుకున్నారు.

వాటి కథాకమామీషు ఒకసారి చూద్దాం.

## నాన్ ఫిక్షన్

- వైరస్ చరిత్ర, శాస్త్ర సమాచారం, ఎలా వ్యాపిస్తుందో తెలుసుకోవాలంటే మనకు అందుబాటులో ఉన్న మొదటి పుస్తకం 'అండ్ ద బ్యాండ్ ప్లెయిడ్ ఆన్'. రచయిత రాండీ షిల్ట్స్. 1987లో మొదటిసారిగా ఎయిడ్స్ విజృంభణ మొదలైనప్పుడు, దానిని ప్రజలింకా జోక్ స్థాయిలో చూస్తున్నప్పుడు అమెరికా జర్నలిస్ట్ రాండీ ఆ వైరస్ గురించి ఈ పుస్తకంలో రాశాడు. ఇలాంటి వైరస్‌లు ప్రబలినప్పుడు ప్రభుత్వాలు వాటిని ఎలా నిరోధించలేకపోతాయో చెప్పాడు.
- 1854లో లండన్ జనాభాను బలి తీసుకున్న కలరా గురించి రచయిత స్టీవెన్ జాన్సన్ రాసిన పుస్తకం 'ద ఘోస్ట్ మాప్'. కలరా మహమ్మారి తర్వాత సైన్స్ పరిశోధనల్లోనూ, నగర నగర నిర్మాణ శాస్త్రంలోనూ పెనుమార్పులు వచ్చాయి.
- ఎబోలా గురించి తెలిసిందే. ప్రపంచాన్ని గడగడలాడించిన వైరస్ అది. దీని గురించి రచయిత రిచర్డ్ ప్రెస్టన్ 'ద హాట్ జోన్' అనే పుస్తకం రాశాడు. ఎబోలా వైరస్ పుట్టుక, వ్యాప్తిని హారర్ నవలలోలాగా వర్ణించాడు రచయిత. ఆఫ్రికా వర్షారణ్యాలలో ఆవిర్భవించి అనతికాలంలోనే దేశదేశాలకూ పాకిన వ్యాధి అది. ఎబోలా ఒక పీడకల. పునరావృతం కాదని చెప్పలేం.
- 1918 నాటి ఇన్‌ఫ్లూయెంజా మహమ్మారి గురించి రచయిత్రి జినా కోలటా రాసిన పుస్తకం 'ఫ్లూ'. ఈ ఫ్లూనే స్పానిష్ ఫ్లూ అని అంటారు. మొదటి ప్రపంచ యుద్ధంలో మరణించిన వాళ్ల కన్నా రెట్టింపు జనాభాను ఈ ఫ్లూ కబళించింది. ఒక్క అమెరికాలోనే అయిదు లక్షల మంది మరణించారు. ఇది ప్రపంచాన్ని మరోసారి చుట్టివస్తుందేమోనని శాస్త్రజ్ఞులు భయపడుతూనే ఉన్నారు అంటుంది అమెరికా పాత్రికేయురాలు కోలటా.
- గత అయిదు లక్షల ఏళ్లుగా మానవజాతిని శాసించిన మలేరియా గురించిన కథనం 'ద ఫీవర్'. 2010లో వచ్చిన ఈ పుస్తకం పూర్తి పేరు 'ద ఫీవర్: హౌ మలేరియా హాజ్ రూల్డ్ మేన్‌కైండ్ ఫర్ 5,00,000 ఇయర్స్'. రచయిత్రి సోనియా షా. మన జీవన విధాతగా దోమ ఎలా మారిందో ఈ పుస్తకం చెబుతుంది. సోనియా, భారతీయ మూలాలున్న అమెరికా పాత్రికేయురాలు.
- అమెరికా చరిత్రకారిణి బార్బరా టక్‌మాన్ 'ప్లేగ్' గురించి రాసిన 1978నాటి 'ఎ డిస్టంట్ మిరర్: ద కలమిటిస్ ఫోర్‌టీన్త్ సెంచరీ' ప్రతిష్ఠాత్మక పురస్కారం పొందిన శాస్త్ర గ్రంథం. 14వ శతాబ్దంలో యుద్ధం, మతోన్మాదం వంటి భౌతిక పరిస్థితులు ప్లేగు వ్యాపించడానికి ఎలా కారణమయ్యాయో ఈ పుస్తకం చెబుతుంది.
- ఆటలమ్మ (స్మాల్‌పాక్స్) కూడా ఒక మహమ్మారి. 18వ శతాబ్దపు ఉత్తరార్థంలో ఉత్తర అమెరికాను గడగడలాడించిన ఆ వ్యాధి ఆ దేశ చరిత్రనే మార్చివేసింది. ఆటలమ్మ గురించి ఆ రోజుల్లో ఎన్నెన్ని కథలు ప్రచారంలో ఉండేవో. ఎలిజబెత్ ఎఫెన్ రాసిన 'పాక్స్ అమెరికానా' అద్భుతమైన కథనంతో పాఠకులను కట్టిపడేస్తుంది.

## ఫిక్షన్

కొందరికి నాన్‌ఫిక్షన్ ఆసక్తికరంగా ఉండకపోవచ్చు. ప్రస్తుతం ఉన్న 'తప్పనిసరి తీరిక సమయం'లో కథల లోకంలో విహరిద్దామనుకుంటే 'వైరస్' కథాంశంగా గల కొన్ని నవలలనైనా చదవండి.

- ఈ జాబితాలో మొదట చెప్పుకోవలసింది హోసె సారమాగో (నోబెల్ బహుమతి పొందిన పోర్చుగీస్ రచయిత) రాసిన 1995 నాటి నవల 'బ్లైండ్‌నెస్'. కథాకాలం 1990. ఒక వ్యక్తి టాక్సీలోంచి దిగబోతూ అకస్మాత్తుగా అంధుడైపోతాడు. ఆ తర్వాత టాక్సీ డ్రైవర్ కూడా అంధుడైపోతాడు. క్రమంగా అందరూ అంధులుగా మారిపోతుంటారు. ఇక్కడ అంధత్వం ఒక వైరస్ కావచ్చు, ఒక ప్రతీక కూడా కావచ్చు.
- ఫ్రెంచ్ రచయిత ఆల్బర్ట్ కామూ రాసిన 'ద ప్లేగ్' చాలామంది చదివే ఉంటారు. ఇరవయ్యవ శతాబ్దంలో మహమ్మారుల గురించి వచ్చిన అన్ని నవలలకూ 'బైబిల్' లాంటిదిది. అల్జీరియాలోని ఓరాన్‌లో వచ్చిన ప్లేగు గురించే రాసినప్పటికీ 'ప్రజలలో ఫాసిస్టు భావజాలం దాగివున్నంత కాలం దీన్నెవరూ ఆపలేరు' అంటాడు కామూ. ఈజిప్షియన్లు, గ్రీకులు, ఫినిషియన్లు, హిందువులు– అందరూ మహమ్మారుల కోసం దేవతలను సృష్టించుకున్నారు. 'పాండోరా' తన వద్ద ఉన్న పెట్టె తెరిస్తే అందులో నుంచి బయటికొచ్చి మహమ్మారులు లోకమంతా వ్యాపించాయని కథ ఉంది కదా.
- 14వ శతాబ్దానికి చెందిన ఇటాలియన్ రచయిత బొకాషియో రచించిన 'ద డెకామెరాన్' చాలా ప్రసిద్ధ నవల. 'బ్లాక్‌డెత్' అనబడే ప్లేగు నేపథ్యంలో పాత్రలు చెప్పుకునే జ్ఞాపకాలే ఈ నవల. వ్యంగ్యం హాస్యం కూడా ఉంటాయి గాని శృంగారానికే యివి ప్రసిద్ధి. అదే శతాబ్దానికి చెందిన ఇంగ్లిష్ కవి జాఫ్రీ ఛాసర్ రాసిన 'ద కాంటర్‌బరీ టేల్స్' నేపథ్యం కూడా ప్లేగే. ఈ కథల ద్వారా పాత్రలు ఒకరినొకరు ధైర్యం చెప్పుకుంటాయి.
- 'రాబిన్‌సన్ క్రూసో' రచయిత డేనియల్ డెఫో 1722లో 'ఎ జర్నల్ ఆఫ్ ద ప్లేగ్ ఇయర్' ప్రచురించాడు. 1995లో లండన్‌లో వేలాదిమందిని బలిగొన్న బుబోనిక్ (ఈగల ద్వారా వ్యాపించే) ప్లేగ్‌ను అత్యంత వాస్తవికంగా చిత్రించిన కథనం యిది.
- ఇక 1985లో నోబెల్ గ్రహీత గేబ్రియల్ గార్షియా మార్కెజ్ ప్రచురించిన 'లవ్ ఇన్ ద టైమ్ ఆఫ్ కలరా' చాలా ప్రసిద్ధం. ఇది ఒక ప్రేమకథ. స్పానిష్‌లో 'కలరా' అన్న పదానికి 'కోపం' అనే అర్థం కూడా ఉంది. మహమ్మారులను కట్టడి చెయ్యడానికి డాక్టర్లున్నారు. మన లోపలి కోపం, ద్వేషాగ్నులను ప్రేమ మాత్రమే ఆపగలదు అంటాడు మార్కెజ్.
- 2006లో వచ్చిన నవల 'ద రోడ్'. రచయిత కార్మాక్ మెకార్తీ. మానవజాతి చివరిదశలో సమాజం, నాగరికత, వ్యక్తి సంబంధాలు ఎలా పతనమవుతాయో అత్యంత భయానకంగా చిత్రిస్తుంది. ఈ నవల ధైర్యం ఉన్న గుండెలకే. ఈ అమెరికన్ రచయిత దీనికిగానూ పులిట్జర్ ప్రైజ్ గెలుచుకున్నారు. ఈ నవల 2009లో ఇదేపేరుతో సినిమాగా వచ్చింది.

పుస్తక పఠనం మానసిక స్థయిర్యాన్ని పెంచుతుంది. అవగాహనను కల్పిస్తుంది. కనుక ఈ పుస్తకాలు చదవుదాం. లేదా నచ్చిన పుస్తకాలు చదువుదాం.

◆ ముక్తవరం పార్థసారథి

● మీకు తెలుసా?

# లౌకికాతీత ఆనందం

స్త్రీని భోగ వస్తువుగా మాత్రమే చూడడానికి అలవాటయిన సమాజంలో మార్పు తేవడం ఈ ప్రక్రియ ఉద్దేశ్యం. కరుణ, శృంగార రసములు రెండే రసవిపాకమునకు సమర్థములని రాయప్రోలు సుబ్బారావు అభిప్రాయపడ్డారు. పూర్ణానంద స్వాదమునకు శృంగార రసము, మనోదోష శుద్ధికి కరుణ రసము ఉపయుక్తములని వీరి భావము. సౌందర్యము వలన, శృంగారము వలన వీరు పొందునది అమలినమైన ఆనందము. 'అమలినానందము' అనగా లౌకిక వాసనలకు అతీతమైన ఆనందము. అదే రసానందము. వియోగ శృంగారములోనున్న పవిత్రతను దృష్టిలోనుంచుకొని వీరు అమలిన శృంగారము అను కొత్త సిద్ధాంతమును లేవనెత్తిరి. ఉపనిషత్తులు మొదలుకొని అలంకారికుల లక్షణ గ్రంథముల వరకు ఉన్న రస సిద్ధాంతములన్నింటిని అవలోకించి మథించి తీసిన నవ్య నవనీతమిది. రాయప్రోలు, దేవులపల్లి, నండూరి, నాయని, బసవరాజు ఈ ప్రక్రియను ప్రచారం చేసిన వారిలో ప్రముఖులు.

## మానవతావాదం

ఆంగ్లంలో హ్యూమనిజం అని పిలువబడే ఈ మానవతావాదం మానవునికి పారమార్థిక జీవనంకంటే నిత్యజీవితంలో మనిషి మనుగడకు బలం యిచ్చింది. ఈ చరాచర ప్రపంచం మనుగడకు మానవుడే మకుటధారి అనే భావం ఈ వాదంలో కనిపిస్తుంది. బ్రహ్మ సమాజం మానవతావాదానికి బలమిచ్చింది. మానవులందరు సమానులనడం, అంధ విశ్వాసాలకు లోనుకాకపోవడం శాస్త్రీయ దృక్పథం అలవరచుకోడం, ఈ వాదంలో కనిపిస్తాయి. కందుకూరి, గురజాడ, జాషువా, ఉన్నవ, త్రిపురనేని మొదలైనవారు ఈ మావవతావాదాన్ని విశ్వసించారు.

◆ డా॥ దన్నాన అప్పలనాయుడు

● లాక్‌డౌన్ కవిత

# కనులకు వీసా అక్కర్లేదుగా!

కనులు మూసుకొంటాను అనుదినం
కంచె దాటతాను మెహదీ హసన్ కోసం
కనులకు వీసా అక్కర్లేదుగా!
కలలకు కంచెల కాపలా లేదుగా!

''ఫరాజ్ కూడా వెళ్లిపోయాడు
పుస్తకాల పుటల్లోని
పువ్వులు వాడిపోయాయి
కానీలే, కలల మీదుగా
నా సాథీని కలవొచ్చులే''
అంటుండగానే ఆయన గొంతు
గాయపడిందని విన్నాను
ఆయన ఎదుట పలుకు మరిచి
వణికే పెదాలతో గజల్ మూగగా

కనులు మూసుకొంటాను
కంచె దాటతాను తరచూ
కనులకు వీసా అక్కర్లేదుగా!
కలలకు కంచెల కాపలా లేదుగా!

మూలం: గుల్జార్
తెలుగు: రివేరా



● ప్రతిధ్వనించే పుస్తకం

# కర్మణి ప్రయోగం


చేకూరి రామారావు

ఈ రచనలో అక్కడక్కడ కర్మణి వాక్యాలను ప్రయోగించాను. కర్మణి వాక్యాల మీద నాకు ప్రత్యేకమైన మోజేమీ లేదు. అకారణమైన ద్వేషమూ లేదు. సకర్మక వాక్యాల్లో కర్తృ ప్రాధాన్యాన్ని తగ్గించటానికి భాషలు అనుసరించే ఒక పద్ధతి కర్మణి ప్రయోగం. ఇది ఇతర మార్గాల ద్వారా సాధించవచ్చు గాని, తెలుగులో క్రియా విభక్తులు అందుకు ఆటంకం. రచనా భాషలో, ముఖ్యంగా పరిశోధనా వ్యాసంగంలో ఉత్తమ పురుష కర్తృక వాక్యబాహుళ్యం తప్పించుకోటం కష్టం. ఒక్కోసారి ఆ వాక్యాలు రచయిత అభీష్టానికి విరుద్ధంగా అహంకార ద్యోతకాలు కావచ్చు. ఆ ప్రమాదం నుంచి కాపాడుకోటానికి కర్మణి వాక్యాలు రచయితలకు కవచాల్లాంటివి.

*(1975లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించిన 'తెలుగు వాక్యం' పుస్తకానికి 'ముందుకు పోయే ముందు' పేరిట చే.రా. రాసిన దాన్లోంచి.)*

● ఎందుకు రాశానంటే?

# కాంతి సంవత్సర దూరంలో చైనా



**చైనాయానం**
(యాత్రా కథనం)
పేజీలు: 116 ; వెల: 100
రచన: దాట్ల దేవదానం రాజు ; ప్రతులకు: రచయిత, 8-1-48, జక్రియా నగర్, యానాం-533464.
ఫోన్: 0884-2321096

ఎవరైనా ప్రపంచ పర్యాటన చేద్దామనుకున్న దేశాల చిట్టాలో చైనా ఉండదు. పర్యాటనకు వెళ్ళడానికి తొలిరోజుల్లో ఇదే ప్రశ్న ఎదుర్కొన్నాను. వెళ్ళిన తర్వాత దిగ్భ్రాంతి కలిగింది. ఎలా ఉంది చైనా అంటే అశ్వనీకుమార్ అన్నట్టు 'మనకు కాంతి సంవత్సరం దూరంలోనే ఉంది'. ఇది చెప్పడానికి భుజాలు తడుముకుంటూ మనకున్న 'దేశభక్తి'ని శంకించాల్సిన అవసరం లేదు. చైనా గురించి అచ్చెరువు పొందే విషయాలు కొన్ని ఉన్నాయి. ముఖ్యంగా 'చరిత్ర అవశేషాల' పరిరక్షణ ఒకటి. ఈ విషయంలో వారి శ్రద్ధ, అంకిత భావం గొప్పవి. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అభివృద్ధి చెందిన విధానం మరొకటి. అత్యాధునికమైన సాంకేతిక ప్రగతితో వేగవంతమైన రైలు ప్రయాణం, పటిష్టమైన రహదారులతో ట్రాఫిక్ సమస్య లేని విధంగా రవాణా వ్యవస్థ, ప్రయాణ సాధనాలు రూపొందించుకున్న విధానం, విదేశీ పర్యాటకుల్ని ఆకర్షించడంలో వాళ్ళు అవలంబించిన పద్ధతులను వివరించడానికి నా పుస్తకంలో ప్రయత్నించాను. 1958 ప్రాంతంలో 'గ్రేట్ లీప్ పార్వార్డ్' పేరిట అసాధారణ లక్ష్యాలు నిర్దేశించుకున్న చైనా దాన్ని సాధించడానికి దేశంలో పిచ్చుకల వల్ల పంటలు నాశనం అవుతున్నాయని వాటిని చంపడానికి ఒక విచిత్రమైన ఆదేశం ఇచ్చింది. ప్రపంచమంతా చైనా అవివేకాన్ని చూసి నవ్వుకుంది. అలాంటి చైనా 1960లో రష్యా నుంచి పిచ్చుకలను దిగుమతి చేసుకుని చేసిన తప్పు సవరించుకుంది. మానవవనరులను సద్వినియోగం చేసుకుంటూ నిర్మాణాత్మకంగా అడుగులు వేస్తూ ప్రగతి సాధించింది. 'చైనాయానం' చదివి మరికొంతమందైనా చైనా పర్యటనకు (ఇప్పటి పరిస్థితుల్లో కాదు) వెళ్ళడానికి ఉవ్విళ్లూరాలనేది నా ఆశ.

◆ దాట్ల దేవదానం రాజు



● సాహిత్య మరమరాలు

# నిలబడే ఇవ్వాలి

ఒకసారి మార్క్ ట్వేన్ ఉపన్యాసాలు ఇస్తూ ఎక్కడెక్కడో తిరుగుతున్నాడు. అట్లా ఒక కొత్త ఊరికి వెళ్ళాడు. అక్కడ గడ్డం గీయించుకోవడానికి మంగలి షాపులోకి వెళ్ళాడు. మాటల సందర్భంలో తాను ఆ ఊరికి రావడం మొదటిసారి అని కూడా చెప్పాడు.

మంచి దినాన వచ్చావు, ఇవాళ మార్క్ ట్వేన్ ఉపన్యాసం ఉంది. వెళ్లాలి అనుకుంటున్నావా? అని అడిగాడు, మంగలి.

వెళ్లక తప్పదు, అన్నాడు మనవాడు.

మరి టికెట్ కొన్నావా? అని అడిగాడు, అతను.

లేదు, అన్నాడు ట్వేన్.

అయితే ఉపన్యాసం సాంతం నిలబడి ఉండక తప్పదు, హెచ్చరించాడు అతను.

మామూలుగా అంతే. ఎప్పుడు ఉపన్యాసం ఇచ్చినా నేను నిలబడే ఉంటాను, జవాబిచ్చాడు ట్వేన్.

◆ డా॥ కె.బి.గోపాలం

● కొత్త బంగారం

# ఆట ఆడించేది ఎవరు?






■ నవల: డెడ్ టు హర్
రచయిత్రి: సారా పిన్‌బరో
విడుదల: 2020 ఫిబ్రవరి

ఇరవైకి పైగా నవలలు రాసిన బ్రిటిష్ రచయిత్రి సారా పిన్‌బరో తాజా సైకలాజికల్ థ్రిల్లర్ 'డెడ్ టు హర్' ఫిబ్రవరిలో విలియమ్ మారో ప్రచురణ సంస్థ ద్వారా విడుదలయింది. మూడేళ్ల క్రితం ఆమె రాసిన 'బిహైండ్ హర్ ఐస్' స్థాయికి తగ్గకుండా, కేవలం థ్రిల్లర్ నవలకి ఉండే సాధారణాంశాలే కాకుండా ఆర్థిక స్థితిగతుల్నీ, మానవ బలహీనతల్నీ, ప్రేమకి సంబంధించిన వివిధ వర్ణాలనీ ఈ నవలలో పొందుపరచడం విశేషం. మనం ఆడే ఆటల్ని ఆడించే మహాశక్తి నిజానికి ఇంకేదో ఉంటుందని అందరూ అంటారు కానీ, ఈ నవలలో ఆ మహాశక్తి రూపం కొంత భిన్నంగా ఉంటుంది; ఆశ్చర్యాన్నీ కలిగిస్తుంది.

కథలోకి వెళ్తే– చాలా ఏళ్ల క్రితం కొడుకునీ, ఈ మధ్యనే భార్యనీ కోల్పోయిన దాదాపు డెబ్బై ఏళ్ల విలియమ్ అనే సంపన్నుడి సంస్థలో జేసన్ భాగస్వామి. జేసన్ భార్యనుంచి అతని దృష్టి మరల్చి, అతన్ని విడాకులకి ప్రోత్సహించి, మర్సీ అతన్ని పెళ్లి చేసుకుంటుంది. వీళ్ల కాపురం బానే సాగుతున్న సమయంలో, వ్యాపార లావాదేవీల నుంచి బ్రేక్ కావాలని విలియమ్ ఒక సంవత్సరం పాటు యూరప్ అంతా తిరిగివస్తానని వెళ్లి, ఆరునెలల్లోనే ఇంగ్లండ్‌లో కెయీషా అనే ఇరవై రెండేళ్ల మెరుపుతీగని పెళ్లిచేసుకుని తిరిగివస్తాడు. అప్పటివరకూ కమ్యూనిటీలో అందమైన పిన్నవయస్కురాలి హోదాని అనుభవిస్తున్న ముప్పై అయిదేళ్ల మర్సీలో ఒక చిన్న అసూయ మొదలవుతుంది. దీనికి తోడు, జేసన్ చూపులు కెయీషాని పరిశీలించే పద్ధతి అనుమానాన్ని పుట్టిస్తుంది; జేసన్ అర్ధరాత్రి లేచి మాట్లాడే కాల్స్, పంపే మెసేజెస్ ఆ పెనుభూతాన్ని స్థిరపరుస్తాయి. మర్సీ, కెయీషా– ఇద్దరూ రెండో భార్యలే. ఇద్దరూ బీద నేపథ్యం గలవారే. ఇద్దరూ స్టేటస్ కోసం ఈ పెళ్లిళ్లు చేసుకున్నవారే. కానీ, అన్ని విషయాల్లోనూ కెయీషాదే పైచేయిగా ఉందిప్పుడు. విలియమ్ కంపెనీని తను కొనేసే ఉద్దేశంతో ఉన్న జేసన్, కెయీషాతో భార్యని స్నేహంగా ఉండమంటాడు. పుండు మీద కారం చల్లినట్లవుతుంది మర్సీకి.

చివరికి మర్సీకి కెయీషా స్నేహితురాలు అవుతుంది. కానీ, విచిత్రమైన పరిస్థితుల్లోకి ఆ స్నేహం విస్తరిస్తుంది. ''ఇతరులు మనగురించి ఇలా అనుకుంటారేమో అని మనం భయపడుతూ ఉండేది నిజంగా మనం మనగురించి అలా అనుకునేదే!'' అని కెయీషా మర్సీకి ఆలంబన అవుతుంది. ఆ స్నేహపు సన్నిహితత్వంలో మరిన్ని విషయాలు తెలుస్తాయి. విలియమ్ తొందరగా చచ్చిపోతే బాగుండునని కెయీషా ఎదురుచూస్తున్నట్టుగా కూడా తెలుస్తుంది. ఇక్కడినుంచి కథ ఊహించిన దానికి విరుద్ధంగా విచిత్రమైన మలుపులు తిరుగుతూ, మంత్రతంత్రాలూ, వూడూలు లాంటి పక్కదోవ పట్టించే విషయాలతో సాగుతూ, ఊహించని ఘట్టాలకి చేరుతూ ఉంటుంది. ముళ్లు బిగుసుకుపోయిన పరిస్థితుల్లో మర్సీ చాలా పరిశోధన చేసి చాలా ఆశ్చర్యకరమైన సంగతులు తెలుసుకుంటుంది. ఈ ఆట రహస్యం మొత్తం తన గుప్పిట్లో ఉందనుకుంటున్న సమయంలో, ఆ ఆటలో తన పాత్ర ఏమిటో తెలుసుకునే పరిస్థితి వస్తుంది!

ముందే చెప్పినట్టు, ఈ నవల కేవలం థ్రిల్స్‌కి మాత్రమే పరిమితం కాకుండా, చేరుకున్న ప్రతి దశా ఎన్ని ఇతర విషయాల మీద ఆధారపడి ఉంటుందో చూపిస్తూ ఉంటుంది. స్వచ్ఛమైన స్నేహం ఎలా ఉంటుందో ఒకవైపూ, డబ్బాశ అంటుకున్న స్నేహం ఎలా ఉంటుందో మరో వైపూ చూపిస్తుంది. ప్రేమల్లో రకాలనీ, గాఢతల్నీ, పలచబారటాల్నీ చూపిస్తుంది. నవల మొదటి సగం కొంచెం నిదానంగా సాగినట్టు అనిపించినా, చకచకా నడిచే రెండో భాగానికి అది సరైన పునాదులు వేస్తుంది. అన్నీ మన అధీనంలో ఉన్నాయని ధీమాగా ఉండేవాళ్లు నిజానికి ఎలా పరాధీనంగా ఉండివుండే అవకాశం ఉందో చూపించిన తీరు మాత్రం నవల చదివి ఆశ్చర్యపడాల్సిన విషయం!

◆ ఎ.వి. రమణమూర్తి




## గ్రహం అనుగ్రహం

శ్రీశార్వరినామ సంవత్సరం. ఉత్తరాయణం, వసంత ఋతువు. చైత్ర మాసం. తిథి శు.త్రయోదశి ప.1.36 వరకు, తదుపరి చతుర్దశి. నక్షత్రం పుబ్బ ఉ.10.05 వరకు, తదుపరి ఉత్తర. వర్జ్యం సా.4.48 నుంచి 6.20 వరకు. దుర్ముహూర్తం ప.12.25 నుంచి 1.15 వరకు, తదుపరి ప.2.55 నుంచి 3.44 వరకు. అమృత ఘడియలు రా.1.45 నుంచి 2.34 వరకు.

సూర్యోదయం: 5.56 సూర్యాస్తమయం: 6.09 ;
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు.
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

## రారండోయ్

ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచయిత, గోల్కొండ పత్రిక సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి జయంతి (మే 28)ని పురస్కరించుకుని మొగ్గల సంకలనాన్ని పాలమూరు సాహితి వెలువరించనుంది. సురవరం సాహిత్యం, జీవితం, రాజకీయం, వ్యక్తిత్వంపై కవితలు కోరుతున్నారు. వివరాలకు: డా॥ భీంపల్లి శ్రీకాంత్, ఫోన్: 9032844017

## ఈవారం పుస్తకాలు





**లకుమ** (నవలిక)
రచన: నటరాజ రామకృష్ణ;
పేజీలు: 78; వెల: 40

**రాఘవరెడ్డి రచనలు**
(సావిత్రి, రతివిలాపం, గోపికావల్లభ, పరిదేవనం)
పేజీలు: 72; వెల: 30





**అమ్జద్ రుబాయీలు**
అనువాదం: సదాశివ; పేజీలు: 76; వెల: 30

**కాళిదాసు ఋతుసంహారం**
తెలుగు: గొట్టుముక్కల రాధాకృష్ణరావు;
పేజీలు: 46; వెల: 20

పై అన్నింటి ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-500004. ఫోన్: 040-29703142





**కలైంజ్ఞర్ కరుణానిధి**
రచన: అన్నవరపు బ్రహ్మయ్య; పేజీలు: 48; వెల: 30; ప్రచురణ: అడుగు జాడలు పబ్లికేషన్స్, ఎం.ఎస్.కె. టవర్స్, ఫోర్త్ ఫ్లోర్, ఫ్లాట్ నం. 410, రోడ్ నం. 11, హిమాయత్ నగర్, హైదరాబాద్.

**యోధుడు కొండారెడ్డి** (చారిత్రక నవల)
రచన: గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి; పేజీలు: 80; వెల: 50; ప్రతులకు: సాహితీ స్రవంతి, కర్నూలు. ఫోన్: 9110595847

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

## లైఫ్ ఈజ బ్యూటిఫుల్

### గుండెను పిండేసే కోత

**జీ**తాల్లో కోతలు తప్ప కరోనా కేసుల్లో తగ్గుదల కనిపించడం లేదు. లాక్‌డౌన్‌తో ప్రపంచమే తిరగడం ఆగిపోయింది. బండి నడిస్తేనే కదా.. బతుకైనా, బాలాజీ టెలీఫిల్మ్స్ అయినా. ఆ కంపెనీకి ఓనరు ఏక్తాకపూర్. సిబ్బందికి జీతాలు ఇవ్వాల్సిందీ ఆవిడే. చేతిలో డబ్బుంది కానీ, కోత విధించకుండా ఇచ్చేంత లేదు. అందుకే తన జీతంలో కోత విధించుకుని ఉద్యోగులకు పూర్తి జీతాలను ఇవ్వబోతున్నట్లు ప్రకటించారు ఆమె. ఓనరు –కమ్–క్రియేటివ్ హెడ్ అయిన ఏక్తా ఏడాది జీతం రెండున్నర కోట్ల రూపాయలు. లోపల పని చేసే పెద్ద ఉద్యోగులు డెబ్బై మందే కానీ, బయట తిరిగేవారు వేలల్లో ఉన్నారు. వారి నెల జీతంలో కాస్త కూడా లోటు రానివ్వకుండా ఉండేందుకు మిగతా ఖర్చుల్ని కూడా తగ్గించుకోబోతున్నారు ఏక్తా కపూర్. టీవీ భాషలో చెప్పాలంటే గుండెను పిండేసే గుడ్‌న్యూసే ఇది.. వాళ్ల ఉద్యోగులకు.


ఏక్తా కపూర్

### డౌన్ కాకుండా యోగా

**లా**క్‌డౌన్ రెండు విధాలుగా మనిషిని కుంగదీస్తోంది. అన్నీ ఉన్నవారిని మానసికంగా! అసలేమీ లేనివారిని శారీరకంగా! వలస కార్మికులకు ఉన్నదేదో పెట్టి, ఉండటానికేదో ఇంత చోటు చూపించగలుగుతున్నాయి రాష్ట్ర ప్రభుత్వాలు. అయితే మానసికంగా వారిని ఉల్లాసంగా ఉంచడమే సాధ్యం కావడం లేదు. అప్పటికీ హర్యానాలోని ఫతేహాబాద్ జిల్లా యంత్రాంగం ఎల్.సి.డి. టీవీలు అమర్చి, కూలీలకు కాలక్షేపం చేయిస్తోంది. అదీ ఫలించకపోవడంతో ఇప్పుడు.. ఒక యోగా గురువును తెప్పించి, మానసిక ప్రశాంతత కోసం శిక్షణ ఇప్పిస్తోంది. హర్యానా నుంచి తమ సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌కు మూటాముల్లే సర్దుకున్న 68 మంది వలస కార్మికులకు ధన్‌ఘర్ గ్రామంలో ఇలాగే ఆశ్రయం ఇచ్చి, ధ్యానం చేయిస్తున్నారు ఫతేహాబాద్ అధికారులు.


ఉండి పొండి... వెళ్లకండి

### పాలమ్మా.. సీఎం తెచ్చారు

**ఒ**క ఇంట్లో ఆహారం వృథాగా మిగిలిపోయిన సమయంలోనే వారికి దగ్గర్లో మరొక ఇంట్లో తినడానికి తిండి లేక అలమటిస్తూ ఉంటారు. వీళ్లు వెళ్లి వాళ్లకు పెట్టడానికి, వాళ్లొచ్చి వీళ్లను అడగడానికి ఆ రెండిళ్ల మధ్య ఏ సంబంధమూ ఉండదు. కర్ణాటకలో ప్రతి రోజూ 27 లక్షల లీటర్ల పాలు అమ్ముడు కాకుండా మిగిలిపోతున్నాయి! మొత్తం అక్కడ రోజుకు ఉత్పత్తి అయ్యే పాలు 69 లక్షల లీటర్లు అయితే, అమ్ముడవుతున్నది 42 లక్షల లీటర్లే. ఈ విషయం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యడ్యూరప్ప దృష్టికి వచ్చింది. వెంటనే ఆ మిగులు పాలను పేదలకు పంపిణీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. లాక్‌డౌన్ ఏప్రిల్ 14న ముగుస్తుంది. అప్పటి వరకు ప్రతిరోజూ ఇంటింటికీ తిరిగి పాల ప్యాకెట్‌లను ఉచితంగా పంపిణీ చేస్తుండాలని కూడా ఉత్తర్వులు జారీ అయ్యాయి! స్వయంగా యడ్యూరప్పే కొన్ని ఇళ్లకు వెళ్లి పాల ప్యాకెట్ ఇచ్చి వచ్చారు.


పాల ప్యాకెట్ పంపిణీ చేస్తున్న యడ్యూరప్ప

### మహిళా ఉద్యోగులకు మలేషియా క్షమాపణ

**దే**శాలన్నీ ఇస్తున్నట్లే మలేషియా కూడా తన ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఆఫర్‌ని ఇచ్చింది. అయితే మహిళా ఉద్యోగులకు మాత్రం కొన్ని సూచనలు చేసింది. ఆఫీస్‌కు వచ్చినట్లే ఇంట్లో కూడా మహిళలు చక్కగా మేకప్ అయి ఆఫీస్ పనికి కూర్చోవాలట! అలాగే, ఇంట్లో కళ్లెదుట ఉన్నాడు కదా అని భర్తను నసపెట్టకూడదట! అలా అని పోస్టర్‌లు ప్రింట్ చేయించి మహిళా ఉద్యోగుల్ని 'మేల్కొలుపుతోంది' మలేషియా ప్రభుత్వం. ఒక పోస్టర్‌లో... పురుష పుంగవుడొకరు సోఫాలో కూర్చొని మహిళలకు ఇలా చెబుతుంటాడు.. 'ఇంటి పనిలో సహాయం కావాలంటే మీ భర్తలను అడగండి కానీ, చికాకు పుట్టించేలా అడక్కండి' అని!! ఈ పిచ్చి సలహాలు, తిక్క పోస్టర్‌లపై దేశవ్యాప్తంగా వర్కింగ్ ఉమెన్ మండిపడడంతో వెంటనే క్షమాపణ చెప్పి వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు మలేషియా ప్రభుత్వ అధికారులు.



### ఆనియన్ రింగులే పెళ్లి ఉంగరాలు

**రిం**గులు మార్చుకుంటే చాలు పాశ్చాత్యుల పెళ్లి తంతు ముగుస్తుంది. అయితే బ్రిటన్ వధూవరులు ఆడమ్ ఉడ్స్, లారా ఆక్షన్‌ల పెళ్లి.. రింగుల వరకు వెళ్లలేదు. కనీసం పెళ్లి వేదిక వరకైనా వెళ్లలేదు. తెల్లారే వచ్చి చూస్తే 'వెడ్డింగ్ వెన్యూ' మూతపడింది. 'అడ్వాన్స్ ఇచ్చాం కదా, అలా ఎలా మూసేస్తారు?' అని ఆశ్చర్యపడి వాళ్లు అడగక ముందే.. 'కరోనా ఎఫెక్ట్' అనే సమాధానం వచ్చింది. పైగా పెళ్లికెవరూ రాలేదు. వచ్చినవారు కూడా వెన్యూ కనిపించక వెళ్లిపోయారు. చివరికి వాళ్లిద్దరే మిగిలారు. పక్కనే 'బర్గర్ కింగ్' దుకాణంలోకి వెళ్లి రెండు ఆనియన్ రింగులు తెచ్చాడు పెళ్లి కొడుకు. ఒకటి పెళ్లికూతురుకిచ్చి 'పెట్టు' అన్నాడు. ఒకటి తను తీసుకుని 'పట్టు' అన్నాడు. రింగులు మార్చుకోవడం అయిపోయింది. సో.. పెళ్లి జరిగినట్లే. 'ఒరిజినల్ రింగ్స్ తర్వాత మార్చుకుందాం' అని లారాను ఓదార్చాడు ఆడమ్.


ఆనియన్ రింగ్స్

### 81 అండ్ 28

**ఈ** 81 అనేది మిలింద్ సోమన్ తల్లి ఉష వయసు. 28 అనేది మిలింద్ భార్య అంకిత కొన్వర్ వయసు. ఇద్దరూ కలిసి ఇంటి మేడపైన రన్నింగ్, హాపింగ్ (గెంతడం) చేస్తున్న వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో శనివారం అప్‌లోడ్ చేశారు మిలింద్. ఆ వీడియోకు 81 అండ్ 28 అని క్యాప్షన్ పెట్టారు. సూపర్ మోడల్, ఫిట్‌నెస్ ప్రమోటర్ అయిన 55 ఏళ్ల మిలింద్ తరచు తన తల్లిని కలుపుకుని మారథాన్‌లు, రన్నింగ్‌లు చేస్తుంటారు. మొదటి భార్యతో విడిపోయి, 2018లో తన కన్నా 27 ఏళ్లు చిన్నదైన గౌహతి అమ్మాయి అంకితను వివాహం చేసుకున్నాక ఆ ఫిట్‌నెస్ ఫ్యామిలీలో ఆమె కూడా భాగస్వామి అయ్యారు. ఒక పూట భోజనం చేయకున్నా నష్టం లేదు.. బాడీని మాత్రం ఒక్కపూటైనా కదిలించకుండా ఉండకూడదని మిలింద్ చెబుతుంటారు. లాక్‌డౌన్‌లో వాకింగ్‌కి వెళ్లడం కుదురుతుందా! అందుకే తల్లినీ, భార్యను మేడ ఎక్కించారు మిలింద్.


అంకిత, ఉష


మిలింద్ సోమన్

### మనసున్న మేడమ్

**రీ**తూ మహేశ్వరి ఐఎఎస్ అధికారి. డైనమిక్ లేడీ. నోయిడా అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్. నోయిడా ఉత్తరప్రదేశ్‌లో ఉంది. 'న్యూ ఓఖ్లా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ' (షార్ట్‌కట్‌లో నోయిడా) పేరుతో ఆ ప్రాంతాన్నంతా అభివృద్ధి చేసే పనిని రీతూ చేతుల్లో పెట్టింది ప్రభుత్వం. ఏడాది కూడా కాలేదు ఆమె చార్జి తీసుకుని. ఈ లోపు లాక్‌డౌన్! లాక్‌డౌన్‌లో ఆమె దృష్టి మొదటిగా తోపుడు బండి వ్యాపారుల మీద పడింది. వాళ్లకిప్పుడు ఉపాధి లేదు. ఎలా బతుకుతారు? ఏదైనా సాయం చేయాలనుకున్నారు రీతూ. వెంటనే నోయిడా మొత్తం ఎన్ని తోపుడు బండ్లు ఉన్నాయో లెక్కతీయించి, ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయలు ఇవ్వాలని ఆదేశించారు. అభివృద్ధికి అడ్డుగా రోడ్డు మీద నడుస్తున్న తోపుడు బండ్ల వ్యాపారులను కూడా అభివృద్ధిలో భాగమే అని అనుకునే ఇలాంటి ఆఫీసర్‌లు దేశమంతా ఉంటే నాగరిక నగరాలు బడుగు జీవులను ఏ విధంగానూ కలత పెట్టలేవు.


రీతూ మహేశ్వరి


సానియా మీర్జా
ఈషాసింగ్
మిథాలీ రాజ్
మేరీ కోమ్


సింధు
హిమాదాస్
పూనమ్ యాదవ్
అపూర్వీ

# ఆటకు సై

**నేడు 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ స్పోర్ట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ పీస్'**

ఒలింపిక్స్‌కు దగ్గూ జ్వరం. ఐపీఎల్‌కు ఒళ్లునొప్పులు.
అండర్–17 మహిళల కప్‌కు గొంతునొప్పి.
కోట్ల మంది క్రీడాభిమానులకు ఐసొలేషన్.
'మీ ఆటలు సాగవు..' అంటోంది కరోనా.
'నీ ఆటల్నే కట్టిపెట్టు' అంటున్నారు క్రీడాకారిణులు.
ఓడించేందుకు అటువైపు ఎత్తుగడలు.
గెలిచి తీరేందుకు ఇటువైపు సర్వశక్తులు.
వైరస్‌పై యుద్ధానికి బరి ఉండకపోవచ్చు.
స్పోర్ట్స్ ఉమెన్ ఇచ్చే విరాళాల
పోరాట స్ఫూర్తికి తిరుగుంటుందా!

**ఈషాసింగ్ ముప్పై వేలు**

గన్‌లో బులెట్ మాత్రమే ఉంటుంది. ఆ బులెట్ వెళ్లి టార్గెట్‌కు తగిలేలా గురి చూసి ట్రిగ్గర్ నొక్కడం మాత్రం షూటర్ చేతిలో ఉంటుంది. ఈషా సింగ్ షూటర్. వయసు పదిహేను. పి.ఎం. రిలీఫ్ ఫండ్‌కి 30 వేల విరాళం ఇచ్చింది. 'నా సేవింగ్స్ నుంచి ఇస్తున్నాను' అని ట్వీట్ చేసింది. కరోనా సంహారానికి విరాళం ఇవ్వడం ద్వారా తన గన్ ట్రిగ్గర్ నొక్కిన అతి చిన్న వయసు క్రీడాకారిణి ఈషా.. హైదరాబాద్‌లోని బోల్టన్ స్కూల్ విద్యార్థిని. వయసెంత అని కాదు, దాచుకున్న మొత్తం ఇచ్చేయడం భారీ విరాళం కాదంటారా?!

**హిమాదాస్.. నెల జీతం**

హిమాదాస్ (20) స్ప్రింటర్. ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన 49 మంది 'టాప్ స్పోర్ట్స్‌పర్సన్స్'లో హిమ ఒకరు. కరోనాను పరుగెత్తించేందుకు ఆమె కూడా తను ఇవ్వగలినంత ఇచ్చారు. తన ఒక నెల జీతాన్ని అస్సాం ప్రభుత్వానికి ఇచ్చారు. గౌహతిలోని ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్‌లో హెచ్.ఆర్.ఆఫీసర్‌గా ఉన్నారు హిమ.

**సింధు ఐదు ప్లస్ ఐదు**

తెలుగు రాష్ట్రాల క్రీడాజ్యోతి పి.వి.సింధు (20) ఏపీ, తెలంగాణ సీఎంల రిలీఫ్ ఫండ్‌కు పది లక్షల రూపాయలు ఇచ్చారు. 2016 రియో ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన ఈ బాడ్మింటన్ చాంపియన్.. కరోనాపై పోరులోనూ చాంపియనేనని తన విరాళం ద్వారా నిరూపించుకున్నారు. ఈ ఏడాది టోక్యో ఒలింపిక్స్ వాయిదా పడటంతో ఆమె అభిమానులు నిరుత్సాహపడినప్పటికీ ఆమె మాత్రం... ''ముందు జీవితం. తర్వాతే ఈవెంట్స్'' అన్నారు.

**మిథాలీ పది లక్షలు**

రైట్ హ్యాండ్ బాట్స్‌ఉమన్, వన్డే ఇంటర్నేషనల్ టీమ్ కెప్టెన్ మిథాలీరాజ్ (37) కరోనాకు ముక్కు పగిలే షాటే ఇచ్చారు. ప్రధాని ఫండ్‌కి 5 లక్షలు, తెలంగాణ సీఎం ఫండ్‌కి 5 లక్షలు. 'కొద్దిగా మాత్రమే ఇవ్వగలుగుతున్నాను' అని ట్వీట్ కూడా చేశారు మిథాలీ. పదిలో, ఐదులో లేదు విలువ. 'ఇవ్వడం'లో ఉంది.

## ఏప్రిల్ 6

**స**రిగ్గా ఈరోజునే నూట ఇరవై నాలుగేళ్ల క్రితం 1896 ఏప్రిల్‌లో గ్రీసు రాజధాని ఏథెన్స్‌లోని పనాథినైకో స్టేడియంలో తొలి ఒలింపిక్ క్రీడల ప్రారంభ వేడుకలు జరిగాయి. ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 వరకు జరిగిన ఆ ఒలింపిక్స్‌లో 14 దేశాలు పోటీపడ్డాయి. 241 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో మహిళలు లేరు. ఆ తర్వాతి (1900) ఒలింపిక్స్ నుంచి మహిళల ప్రవేశం మొదలైంది.
తొలి ఒలింపిక్స్ మొదలైన ఏప్రిల్ 6ను 2014 నుంచి ఐక్యరాజ్య సమితి 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ స్పోర్ట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ పీస్'గా గుర్తిస్తోంది.

భారత మహిళా క్రికెట్ జట్టులోని ఈ సీనియర్ హ్యాండ్.. ఆటలో తనకెదురైన సమస్యల్ని గుండె నిబ్బరంతో డీల్ చేశారు. కరోనాను తరిమికొట్టేందుకు ప్రభుత్వాలకైనా, ప్రజలకైనా కావలసింది అలాంటి నిబ్బరమే.


దీప్తి శర్మ

**దీప్తి శర్మ లక్షన్నర**

బ్యాటింగ్‌లో లెఫ్ట్ హ్యాండ్, బౌలింగ్‌లో రైట్–ఆర్మ్ ఆఫ్ బ్రేక్ ప్రావీణ్యాలు గల టీ20 వరల్డ్ కప్ టీమ్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ (22) కరోనాకు లెఫ్ట్ అండ్ రైట్ వాయించడానికి తన వైపు నుంచి వెస్ట్‌బెంగాల్ స్టేట్ ఎమర్జెన్సీ ఫండ్‌కి 50 వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. అది కాకుండా, పి.ఎం. రిలీఫ్ ఫండ్‌కి, యు.పి. రిలీఫ్ ఫండ్‌కి కలిపి లక్ష రూపాయలు ఇచ్చారు. దీప్తి ఆగ్రాలో పుట్టారు. తండ్రి రైల్వేస్‌లో చేశారు. అలా ఆమెకు యు.పి.తోనూ, పశ్చిమ బెంగాల్‌తోనూ అనుబంధం ఉంది.

**ప్రియాంక పది వేలు**

ప్రస్తుతం బెంగాల్ జట్టుకు యు–19 కోచ్‌గా ఉన్న భారత జట్టు మాజీ క్రికెట్ ప్లేయర్ ప్రియాంక రాయ్ (32) బెంగాల్ కరోనా రిలీఫ్ ఫండ్‌కి పది వేల రూపాయలు ఇచ్చారు. బ్యాటింగ్‌లో రైట్ హ్యాండ్, బౌలింగ్‌లో లెగ్ బ్రేక్, కోచింగ్‌లో.. 'హెడ్స్ అండ్ షోల్డర్స్, నీస్ అండ్ టోస్'లా ఉండే ప్రియాంక.. విరాళం మాత్రమే ఇచ్చి ఊరుకోలేదు. లాక్‌డౌన్‌లో ప్రజలెవ్వరూ ఇళ్లలోంచి రాకుండా మోటివేట్ కూడా చేస్తున్నారు.


ప్రియాంక రాయ్

**పూనమ్ రెండు లక్షలు**

ఇటీవలి ఉమెన్ టి20 వరల్డ్ కప్‌లో దుమ్మురేపిన స్పిన్నర్ పూనమ్ యాదవ్ (28) కరోనా కొమ్ములు వంచడం కోసం పి.ఎం.–కేర్స్ ఫండ్‌కి, యు.పి. సీఎం ఫండ్‌కి కలిపి 2 లక్షల రూపాయలను ఇచ్చారు. కెరీర్ ఆరంభంలో ఎదురైన తట్టుకోలేని పరిస్థితులకు నిరుత్సాపడి క్రికెట్‌ను వదిలేసినప్పుడు తండ్రే ఆమెలో ఫైటింగ్ స్పిరిట్ నింపి, మళ్లీ క్రికెట్‌లోకి పంపించారు. ఆర్మీ ఆఫీసర్ ఆయన. పూనం జీవితంలోంచి ఇప్పుడు మనం తీసుకోవలసింది ఇదే. కరోనాపై ఆర్మీ స్పిరిట్‌తో పోరాడాలని.

**మేరీ కోమ్ కోటీ లక్ష**

కరోనాకు ఇవ్వవలసిన పంచ్‌నే ఇచ్చారు బాక్సర్ మేరీ కోమ్ (37). రాజ్యసభ సభ్యురాలు కూడా అయిన కోమ్ ఎంపీ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్ నుంచి కోటి రూపాయలను కరోనాపై పోరుకు విడుదల చేశారు. రాజ్యసభ సభ్యురాలిగా తన ఒక నెల జీతాన్ని పి.ఎం. నేషనల్ రిలీఫ్ ఫండ్‌కు ఇచ్చేశారు.

**రీచా.. మనూ.. అపూర్వీ**

ఉమెన్ టి20 వరల్డ్ కప్‌లో భారత జట్టు ఆల్‌రౌండర్ పదహారేళ్ల రీచా ఘోష్ లక్ష, ఎయిర్ గన్ షూటింగ్ ఒలింపియన్ మనూ భాకర్ (18) లక్ష, షూటర్ అపూర్వీ చండేలా (27) 5 లక్షలు.. విరాళంగా అందించారు. టెన్నిస్ తార సానియా మీర్జా (33) ప్రతిరోజూ దినసరి కార్మికులకు ఆహార దినుసులు పంపిణీ చేస్తున్నారు.

ఎవరు ఎంత ఇచ్చారని కాదు. క్రీడారంగంలోనైనా, మరే రంగంలోనైనా విరాళంగా మహిళలు ఇచ్చే ప్రతి రూపాయి కూడా అమూల్యమైనదే. క్రీడల్లో ఆ విరాళం మరింత విలువైనది. ఈవెంట్‌లలో పురుషులకు వచ్చినంత రెమ్యునరేషన్ మహిళలకు రాదు. అయినా వారు తాము ఇవ్వగలిగినంత ఇస్తున్నారంటే.. ఇచ్చే ఆ మనసును చూడాలి.

**జయంతి**

## ఆదర్శ హనుమ

**యు**వత హనుమను చూసి నేర్చుకోవలసింది చాలా ఉంది. వాక్చాతుర్యం, సమయస్ఫూర్తి, పట్టుదల, ఎంత కష్టమైనా సరే, చెప్పిన పనిని శ్రద్ధగా చేయడం. బుద్ధి, బలం, యశస్సు, ధైర్యం, చురుకుదనం, మాటకారితనం, పౌరుషం, పరోపకారం, అచంచలమైన ఆత్మవిశ్వాసం, దీక్ష, కార్యదక్షత, అపారమైన ప్రభుభక్తి, వజ్రంలా ప్రకాశించే ఆరోగ్యకరమైన శరీరం గల ఆంజనేయుడు చైత్రపౌర్ణమినాడు జన్మించినట్లు పలుచోట్ల ఉంది. ఉత్తర భారతదేశంలోనూ, తెలంగాణ ప్రాంతంలోనూ చైత్రపూర్ణిమనాడే హనుమజ్జయంతిని జరుపుకుంటారు.



హనుమజ్జయంతి రోజున స్వామిని షోడశోపచారాలతో పూజించడం వల్ల గ్రహదోషాలు నశిస్తాయి. భూత, ప్రేత, పిశాచ పీడలు, మానసిక రుగ్మతలు తొలగిపోతాయి. చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని పురాణ వచనం. ఆలయానికి వెళ్లలేని ప్రస్తుత పరిస్థితులలో హనుమజ్జయంతి రోజున ఇంట్లోనే ఆయనని షోడశోపచారాలతో పూజించి, హనుమ ప్రతిమకు సింధూరం, నవనీతం సమర్పించి, తమలపాకులతో అలంకరించి, అరటిపండ్లు లేదా పానకం, వడపప్పు, నారికేళ ఫలాన్ని నివేదించాలి.

**నాలుగో సింహం**

## మానవత్వం డ్యూటీ చేస్తోంది


విరాళి మోదీకి సహాయంగా వచ్చిన పోలీసులు

**ముం**బయిలోని డిజేబులిటీ యాక్టివిస్ట్ విరాళీ మోదీకి డీసీపీ నుంచి ఫోన్ వచ్చింది. 'నిన్నటి మీ ట్వీట్ చూశాం. మా పోలీసులు వస్తారు. ఏం కావాలో వారికి తెలియచేయండి' అని చెప్పారు విరాళితో డీసీపీ. అన్నట్లుగానే కొంత సేపటికే ఇద్దరు పోలీసులు విరాళి ఇంటికి వచ్చారు. విరాళి ట్వీట్‌లో సారాంశం 'మా సహాయకురాలు రోజూ మా ఇంటికి రావడానికి అనుమతించండి' అని. విరాళి దివ్యాంగురాలు కావడంతో ఆమెకు సహాయకురాలి ఆసరా రోజూ అవసరమే. లాక్‌డౌన్ కారణంగా డొమెస్టిక్ హెల్పర్‌లు కూడా తమ ఇళ్ల నుంచి కదలకూడదనేది నిబంధన. కానీ విరాళికి ఒకరి ఆసరా తప్పని సరి. అదే విషయాన్ని ఆమె పోలీసులకు తెలియచేశారు. పోలీసుల సూచన మేరకు విరాళి తన డొమెస్టిక్ హెల్పర్‌ను, డ్రైవర్‌ను డ్యూటీకి అనుమతించాల్సిందిగా కోరుతూ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు ఉత్తరం రాశారు. మాస్కులు, గ్లవుజ్‌లు ధరించి, శానిటైజర్ వాడి పరిశుభ్రంగా విధులకు హాజరు కావాలనే నిబంధనతో పోలీసులు అధికారికంగా అనుమతి జారీ ఇచ్చారు. విరాళి డొమెస్టిక్ హెల్పర్, డ్రైవర్‌లకు లాక్‌డౌన్ పాస్‌లు కూడా జారీ చేశారు.


గర్భిణికి సహాయం చేసిన పోలీసులు


విరాళాల పంపిణీలో పోలీసులు

**ఊరికో శ్రీమంతుడు**

లాక్‌డౌన్‌లో పనులు లేక అవస్థలు పడుతున్న వాళ్ల కోసం ముందుకొచ్చిన దాతలకు పోలీసులు స్నేహహస్తం అందిస్తున్నారు. దాతలు విరాళంగా ఇచ్చిన సరుకులను ఆపన్నులకు చేరవేయడంలో ముందడుగు వేస్తున్నారు. నెల్లూరు జిల్లా, జలదంకి మండలం ఎస్‌ఐ ప్రసాద్ రెడ్డి... బ్రాహ్మణక్రాక పంచాయితీ, వంటేరు వరదారెడ్డి గిరిజన కాలనీలోని గిరిజనులకు శనివారం నాడు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న పారిశ్రామిక వేత్త వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తన సొంత గ్రామం కోసం చేస్తున్న సహాయానికి తాను చేయూతనిచ్చానని చెప్పారాయన. ''ఈ గిరిజన కాలనీని ఇరవై ఏళ్ల కిందటే వేణుగోపాల్‌రెడ్డి తన తండ్రి పేరుతో దత్తత తీసుకుని అందరికీ ఇళ్లు కట్టించారు. ఇప్పుడు కరోనా సంక్షోభంలో ఈ గిరిజన కాలనీలోని మొత్తం 135 కుటుంబాల కోసం వెయ్యి కిలోల బియ్యం, రెండు వందల కిలోల కంది పప్పు, తొమ్మిది రకాల వంట దినుసులు, సబ్బుల కిట్‌తోపాటు ఇతర అత్యవసరాల కోసం కొంత నగదు కూడా ఇచ్చారు. ఊరిని దత్తత తీసుకునే శ్రీమంతులు సినిమాలో మాత్రమే కాదు. నిజ జీవితంలోనూ ఉంటారు. జీవితంలో ఎదిగిన ప్రతి ఒక్కరూ ఈ కష్టకాలంలో తమ గ్రామాన్ని తలుచుకుంటే... దాదాపుగా అన్ని గ్రామాలకూ సహాయం అందుతుంది. ప్రభుత్వ ఉద్యోగులుగా మేము మా విధిని నూటికి నూరు పాళ్లు నిర్వహిస్తున్నాం. ఇలాంటి శ్రీమంతులు ముందుకొస్తే మా వంతుగా సహకారం అందించడానికి సిద్ధంగా ఉంటాం'' అని చెప్పారు ఎస్‌ఐ.

**పురుడు పోసిన పోలీసులు**

లాక్‌డౌన్ ఉన్నప్పుడు గడప దాటకూడదని తల్లికి తెలుస్తుంది కానీ, తల్లి కడుపులో ఉన్న బిడ్డకు తెలుస్తుందా! 'అమ్మా నన్ను కనూ' అని ఆ బిడ్డ తల్లిని తొందర పెట్టాడు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మూసి ఉంది. నడుచుకుంటూనే ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లారు భార్యాభర్తలు. 'ఇప్పుడు కాదు' అన్నారు వాళ్లు! మరింకెప్పుడో?! 'నొప్పులెక్కువయ్యాయి నేనిక నడవలేను' అని ఆ తల్లి దారిలోనే కూలబడింది. పంజాబ్‌లోని ధరమ్‌కోట్ అది. లాక్‌డౌన్ విధుల్లో ఉన్న పోలీసులు ఆమెను, అసహాయంగా ఉన్న ఆమె భర్తను చూశారు. రోడ్డు పక్కన ఉన్న రెండు చెక్క బల్లల్ని పక్కపక్కనే కలిపి వేసి, ఆమెను పడుకోబెట్టారు. నర్స్ ఎవరైనా ఉంటే అర్జెంటుగా పంపమని ఫోన్ చేశారు. ఆమె వచ్చే లోపు దుప్పటిని తెప్పించి బల్లల చుట్టూ కప్పారు. నర్సు వచ్చి డెలివరీ చేసింది. అబ్బాయి పుట్టాడు. ఆ పోలీసులు తల్లీబిడ్డల్ని ఇంటికి చేర్చారు. ఆ పోలీసులు ఎ.ఎస్.ఐ. బిక్కర్ సింగ్, కానిస్టేబుల్ సుఖ్‌జిందర్ సింగ్. ఈ కరోనా కాలంలో డ్యూటీ చేస్తున్నది యూనిఫామ్‌లో ఉన్న మానవత్వమే.

## 2027 ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీకి భారత్ బిడ్

ప్రతిష్టాత్మక ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహణ కోసం అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) అధికారికంగా బిడ్ దాఖలు చేసింది. 2027 టోర్నమెంట్ ఆతిథ్య హక్కులు ఇవ్వాలని కోరుతూ తాము ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్యకు (ఏఎఫ్‌సీ) అవసరమైన పత్రాలు పంపించామని ఏఐఎఫ్ఎఫ్ జనరల్ సెక్రటరీ కుశాల్ దాస్ తెలిపారు. 2027 ఆతిథ్య దేశం పేరును వచ్చే ఏడాది ఏఎఫ్‌సీ ప్రకటించే అవకాశముంది. ఈ మెగా టోర్నీలో ఆసియా నుంచి మొత్తం 24 జట్లు పాల్గొంటాయి. ఆసియా కప్‌లో భారత్ నాలుగుసార్లు బరిలోకి దిగింది. 1964లో రన్నరప్‌గా నిలువగా... 1984, 2011, 2019లలో గ్రూప్ దశను దాటలేకపోయింది.

# విరామం మంచిదేనా!

న్యూజిలాండ్ పర్యటనలో గాయపడిన భారత స్టార్ బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ ఇటీవలే కోలుకున్నాడు. కివీస్‌తో వన్డే, టెస్టు సిరీస్‌లకు దూరమైన అతను ఐపీఎల్ కోసం సన్నద్ధమయ్యాడు. అయితే ఇప్పుడు లాక్‌డౌన్ కారణంగా ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. రోహిత్ మాటల్లోనే చెప్పాలంటే... 'ముంబైలో నేను ఉండే ఫ్లాట్ 54 అంతస్తుల భవనంలో ఉంది. ప్రభుత్వ ఆదేశాలతో ఇందులో ఉండే అధునాతన జిమ్‌లను మూసివేశారు. నేను అనుకున్నా సరే, బయటకు వెళ్లే అవకాశం లేదు. ఏదో నాలుగు అంతస్తులు అలా పైకి, కిందకి పరుగెత్తడం మినహా మరో మార్గం కనిపించడం లేదు. గాయం నుంచి కోలుకుంటున్న సమయంలో మరింత మెరుగైన ఫిట్‌నెస్ ప్రణాళిక అమలు చేసి ఉంటే బాగుండేది' అంటూ తన అసంతృప్తిని ప్రదర్శించాడు. కివీస్‌తో పోరుకు ముందే గాయం నుంచి కోలుకున్న పేసర్ బుమ్రా పరిస్థితి కూడా దాదాపు ఇలాగే ఉంది. అతనూ తన బాధను రోహిత్‌తో పంచుకున్నాడు. క్రికెటేతర క్రీడాకారుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. బ్యాడ్మింటన్ స్టార్స్ పీవీ సింధు, సైనా నెహ్వాల్, సాయిప్రణీత్, పారుపల్లి కశ్యప్, టెన్నిస్ స్టార్ సానియా మీర్జా తదితరులు ప్రస్తుతం ఫిట్‌నెస్ ట్రెయినింగ్‌కే పరిమితమయ్యారు. పరిస్థితులు అనుకూలిస్తే ఫామ్‌లోకి రావడానికి మళ్లీ ప్రాక్టీస్ మొదలు పెడతారు. అసలు ఈ అనూహ్య విరామం ఆటగాళ్లకు చేటు చేస్తోందా లేక విశ్రాంతి కూడా మంచిదేనా అనే చర్చ ఇప్పుడు క్రీడా వర్గాల్లో వినిపిస్తోంది.

భారత క్రీడాకారుల ఫిట్‌నెస్, ఫామ్ కష్టాలు
సుదీర్ఘ విరామం చేటు చేసే అవకాశం
గాయాల నుంచి కోలుకుంటున్న కొందరు


ధావన్

సాక్షి క్రీడా విభాగం

సాధారణంగా బిజీ షెడ్యూల్‌తో తీరిక లేకుండా ఉండే క్రికెటర్లకు, క్రీడాకారులకు ఇప్పుడు కరోనా కారణంగా ఎక్కువ సమయం ఇంట్లోనే గడిపే అవకాశం లభించింది. చాలా మంది సీనియర్ క్రికెటర్లు, ఇతర క్రీడాంశాల్లోని స్టార్ ప్లేయర్లు ఎప్పుడెప్పుడు మైదానంలోకి దిగుదామా అని ఆత్రుతగా ఎదురు చూస్తుంటే మరికొందరు మాత్రం విరామం మంచిదే అంటూ సంతోషిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవలే గాయం నుంచి కోలుకుంటున్న కొందరు భారత క్రికెటర్లు లాక్‌డౌన్ తమకు మేలు చేసినట్లు భావిస్తున్నారు. 'ఫిట్‌నెస్ ట్రెయినింగ్ సమయంలో ఎక్కువ మంది ఆటగాళ్లు పట్టించుకోని ప్రధాన అంశం విశ్రాంతి. మీ ప్రదర్శన మెరుగవ్వాలంటే విరామం కూడా చాలా కీలకం. లేదంటే వైద్య పరిభాషలో చెప్పే ఓవర్ ట్రెయినింగ్ సిండ్రోమ్‌కు గురవుతారు. అప్పుడు వారి ఆట మరింత దిగజారుతుంది. కాబట్టి నా దృష్టిలో క్రికెటర్లకు విరామం లభించడం మంచిదే. ఇది వారి కెరీర్‌ను పొడిగించుకునేందుకు ఉపయోగపడుతుంది' అని సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఆశిష్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. గతంలో దశాబ్దకాలం పాటు విదర్భ క్రికెట్ జట్టుకు పని చేసిన అగర్వాల్ జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో కూడా సేవలందించారు.


రోహిత్


హార్దిక్

గత ఏడాది కాలంగా బిజీ షెడ్యూల్ కారణంగా పలువురు భారత క్రికెటర్లు గాయాలపాలయ్యారు. ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, పేసర్లు బుమ్రా, భువనేశ్వర్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ జాబితాలో ఉన్నారు. ఆటగాళ్లు ఇంటి వద్ద గడపడం మంచిదే కానీ... ప్రొఫెషనల్ క్రీడాకారులకు ఇంత సుదీర్ఘ విరామం చేటు చేస్తుందని స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ వీపీ సుదర్శన్ చెబుతున్నారు. 'ఎలైట్ అథ్లెట్లు వరుసగా మూడు రోజుల పాటు ట్రెయినింగ్ చేయకపోతే వారి ప్రదర్శన కనీసం ఐదు శాతం తగ్గుతుంది. ఇంత సుదీర్ఘ విరామం వల్ల తగినంత విశ్రాంతి లభించిందని వారు అనుకుంటూ ఉండవచ్చు. కానీ మైదానంలోకి అడుగు పెట్టాక వారి ఫిట్‌నెస్ అదే స్థాయిలో ఉంటుందా అనేది సందేహమే' అని సుదర్శన్ అభిప్రాయపడ్డారు. అత్యున్నత స్థాయి సౌకర్యాలతో నిపుణుల పర్యవేక్షణలో ట్రెయినింగ్‌కు అలవాటు పడిన భారత క్రికెటర్లు ఇంటి దగ్గర ఏదో ఏరోబిక్ ఎక్సర్‌సైజ్‌లు చేసుకోవడం వల్ల ఏమాత్రం ప్రయోజనం ఉండదని, అది వారిని ఫిట్‌గా ఉంచేందుకు సరిపోదని ఆయన అంటున్నారు.

అయితే తీరిక లేని కార్యక్రమాలతో అలసిపోయే భారత క్రికెటర్లకు ఇప్పుడు శారీరక ఫిట్‌నెస్‌కంటే మానసిక ఉల్లాసమే ఎక్కువ ముఖ్యమని, ఎలాంటి ఫిట్‌నెస్ ప్రోగ్రామ్ లేకుండా కుటుంబ సభ్యులతో గడిపితే చాలు, వారు కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగగలరని ప్రముఖ ఫీల్డింగ్ కోచ్ బిజూ జార్జ్ విశ్లేషించారు. లాక్‌డౌన్ కారణంగా అకాడమీలు మూతబడటంతో... భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ తన శిష్యులు శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉండేందుకు వాట్సాప్ ద్వారా రోజువారీ షెడ్యూల్‌ను పంపిస్తున్నారు. ఒకటి మాత్రం స్పష్టం. క్రీడాకారులకు తాము కోరుకోకుండానే లభించిన ఈ విరామం ఎప్పటి వరకు, ఎంత కాలం ఉంటుందో ఎవరికీ తెలీదు. కానీ వారు ఎప్పుడు బరిలోకి దిగినా అభిమానులు మాత్రం వారిని పూర్తి ఫిట్‌గా, మైదానంలో చురుగ్గా కనిపించాలని కోరుకుంటారు. దానిని నెరవేర్చాల్సిన బాధ్యత ఆటగాళ్ళదే.



ఆల్ ఇంగ్లండ్ టోర్నమెంట్‌లో పాల్గొని వచ్చాక 21 రోజులపాటు క్వారంటైన్‌లోనే ఉన్నాను. ఆదివారంతో స్వీయ నిర్బంధం ముగిసింది. ఫిట్‌నెస్ కోసం రోజూ ఇంట్లోనే కొంతసేపు తేలికపాటి వ్యాయామాలు చేస్తున్నాను. ప్రాక్టీస్ చేయకుండా ఖాళీగా ఉంటున్నందుకు కండరాల్లో కదలికలు ఉండవు. మ్యాచ్ ఫిట్‌నెస్ కోల్పోతాం. మ్యాచ్ ఫిట్‌నెస్ రావడానికి సమయం పడుతుంది. -'సాక్షి'తో సింధు



నేను రోజూ ఇంట్లోనే రెండు గంటలపాటు ఫిజికల్ ట్రెయినింగ్ చేస్తున్నాను. టెన్నిస్ ప్రాక్టీస్ చేయడంలేదు. అయితే టోర్నమెంట్‌లు మొదలయ్యే సమయానికి మ్యాచ్ ఫిట్‌నెస్‌ను సంతరించుకోలేమన్నది వాస్తవం. ప్రపంచం మొత్తం కరోనాతో అల్లాడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో క్రీడల గురించి ప్రత్యేకంగా ఆలోచించాల్సిన అవసరం లేదు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి ప్రపంచం బయటపడాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను. -'సాక్షి'తో సానియా మీర్జా







ఆదివారం రాత్రి దీపాలు వెలిగించి కరోనా వైరస్‌పై జరుగుతున్న పోరాటానికి సంఘీభావం తెలిపిన భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లి, అనుష్క శర్మ, బ్యాడ్మింటన్ స్టార్స్ పీవీ సింధు, సైనా, సాయిప్రణీత్... రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, రెజ్లర్ సాక్షి మలిక్, ఆమె భర్త సత్యవర్త్

## ఎఫ్-1 సీజన్ రద్దు చేయాలి

### మాజీ బాస్ ఎకిల్‌స్టోన్ వ్యాఖ్య



**లండన్:** ఈ సీజన్ ఫార్ములావన్ (ఎఫ్1) చాంపియన్‌షిప్‌ను రద్దు చేయాలని ఫార్ములావన్ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బెర్నీ ఎకిల్‌స్టోన్ అన్నారు. షెడ్యూల్ ప్రకారం ఇప్పటివరకు జరగాల్సిన 8 రేసులు కరోనా కారణంగా వాయిదా పడటమో, రద్దు కావడమో జరిగాయి. తదుపరి రేసులు కూడా అనుకున్న సమయానికి జరిగే పరిస్థితులు లేకపోవడంతో మాజీ బాస్ మిగతా 14 రేసుల్ని కూడా నిలిపివేసి వచ్చే ఏడాది తాజాగా సీజన్‌ను ప్రారంభించాలని అభిప్రాయపడ్డారు. 'ఈ ఏడాది చాంపియన్‌షిప్ నిర్వహణను ఆపేయాలి. వచ్చే సీజన్‌ను తాజాగా ప్రారంభిస్తే మంచిది. ఎందుకంటే ఈ సీజన్‌లో చాంపియన్‌షిప్ టైటిల్ గెలుపొందడానికి అవసరమైన రేసుల్ని నిర్వహించే పరిస్థితులు కనిపించడం లేదు. కనీసం 8 రేసులు జరిగితే ఆ చాంపియన్‌షిప్‌కు విలువ ఉంటుంది. కానీ ఈ విపత్కర పరిస్థితుల్లో అది జరిగేలా అనిపించడం లేదు' అని ఎకిల్‌స్టోన్ పేర్కొన్నారు. కరోనా కారణంగా రేసులన్నీ రద్దుకావడంతో షుమాకర్ పేరిట ఉన్న ఏడు 'డ్రైవర్స్ చాంపియన్‌షిప్' టైటిళ్ల రికార్డును సమం చేసేందుకు లూయిస్ హామిల్టన్‌కు మరింత కాలం వేచి చూడాల్సి రావొచ్చు. ప్రస్తుతం హామిల్టన్ ఖాతాలో 6 టైటిళ్లు ఉన్నాయి.

# తారా దీపం

చీకటిని అంతం చేసేది వెలుగు.
కోవిడ్-19తో ప్రపంచాన్ని ఒకలాంటి చీకటి ఆవహించింది.
మన దేశంలో ఈ చీకటిని పోగొట్టడానికి 'దీపం వెలిగిద్దాం'
అని పిలుపునిచ్చారు ప్రధాని మోదీ.
ఆదివారం రాత్రి సరిగ్గా 9 గంటలకు
దేశవ్యాప్తంగా కొన్ని కోట్ల దీపాలు వెలిగాయి.
సినిమా స్టార్స్ కూడా దీపాలు వెలిగించి
"మేము సైతం" అన్నారు.
ఆ వెలుగులు చూద్దాం.


కృష్ణంరాజు, శ్యామలా దేవి


మోహన్ బాబు


చిరంజీవి, సురేఖ


మహేశ్ బాబు


వెంకటేష్


నాగార్జున, అమల, అఖిల్


పాయల్ రాజ్‌పుత్


విష్ణు


గోపీచంద్


శ్రియ


పూజా హెగ్డే


రాశీ ఖన్నా


రాజశేఖర్, జీవిత, శివాని, శివాత్మిక


అర్జున్, ఐశ్వర్య


సాయి కుమార్, సురేఖ

## పేద సినీ కార్మికులకు సహాయం


కార్మికులకు సహాయం చేస్తున్న ఎన్.శంకర్

కరోనా వైరస్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ విధించిన సంగతి తెలిసిందే. దీంతో షూటింగ్‌లు నిలిచిపోవడంతో సినీకార్మికుల్ని ఆదుకునేందుకు చిరంజీవి ఆధ్వర్యంలో 'కరోనా క్రైసిస్ చారిటీ మనకోసం' (సీసీసీ) ప్రారంభించారు. నటీనటుల సహా పలువురు దాతల నుంచి సీసీసీకి విరాళాలు వెల్లువెత్తాయి. ముందే ప్రకటించినట్లు ఈ ఆదివారం నుంచి 24 శాఖల్లోని పేద కార్మికులకు దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, దర్శకుల సంఘం అధ్యక్షుడు శంకర్ బృందం నిత్యావసరాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్ మాట్లాడుతూ –"సినీపరిశ్రమలోని ప్రతి కార్మికుడి ఇంటికి నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకుల్ని అందిస్తున్నాం. అందులో భాగంగా ఆదివారం స్టూడియోస్ విభాగం కార్పెంటర్స్‌కి సరుకులు అందించాం. నిరంతరం సాగే ప్రక్రియ ఇది. ప్రతి నెలా సరుకులు కార్మికుల ఇంటికే చేరతాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య కర్త అయిన చిరంజీవిగారితో సహా దాతలందరికీ కృతజ్ఞతలు. 'సీసీసీ మనకోసం' కమిటీ సభ్యులైన తమ్మారెడ్డి భరద్వాజ, సురేష్ బాబు, సి.కళ్యాణ్, దామోదర ప్రసాద్ , బెనర్జీ.. ఇలా అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. దర్శకుడు మెహర్ రమేష్ అందిస్తున్న సహకారం ఎప్పటికీ మర్చిపోలేనిది" అన్నారు.

## ఇప్పట్లో పెళ్లి ఆలోచన లేదు


కీర్తీ సురేష్

'కీర్తీ సురేష్ పెళ్లి కూతురు కాబోతోంది. మహానటి ఇల్లాలు కాబోతోంది" అనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కేరళకి సంబంధించిన బిజినెస్‌మేన్‌ని కీర్తి వివాహం చేసుకోబోతున్నారన్నది ఆ వార్తల సారాంశం. ఈ విషయమై నటి, కీర్తీ సురేష్ తల్లి మేనకను 'సాక్షి' సంప్రదించగా "పెళ్లి వార్తలు ఉట్టి పుకార్లు" అని స్పష్టం చేశారు. ఈ వార్తల్లో ఎటువంటి నిజం లేదని కీర్తీ సురేష్ కూడా కొట్టిపారేశారు. పెళ్లి వార్త గురించి స్పందిస్తూ –'ఈ వార్తలు విని నాకు ఆశ్చర్యంగా అనిపించింది. ఇలాంటి వార్తలు ఎలా పుడతాయో అర్థం కాదు. ప్రస్తుతానికి పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదు. ప్రస్తుతం మనందరం దృష్టి పెట్టాల్సిన విషయం కరోనా వైరస్. దానిపై పోరాటం చేద్దాం. ఇలాంటి అసత్యపు వార్తల్ని (పెళ్లి వార్తలు) ప్రచారం చేయొద్దు" అని పేర్కొన్నారు కీర్తీ సురేష్.

epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com
స్పర్ధయా వర్ధతే విద్య
సోమవారం
6-4-2020

# లాక్‌డౌన్ కాలంలో.. ఆన్‌లైన్ విజ్ఞానం

## ఉద్యోగ సమాచారం

### తెలంగాణలో 2,157 స్టాఫ్‌నర్స్ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒప్పంద ప్రాతిపదికన స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 2,157
- **పోస్టులు–ఖాళీల వివరాలు:** పల్లియేటివ్ కేర్ స్టాఫ్ నర్స్–82, ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్) స్టాఫ్ నర్స్–435, స్టాఫ్ నర్స్–1640.
- **అర్హతలు:** జీఎన్ఎం(జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ) లేదా బీఎస్సీ నర్సింగ్.
- **వయసు:** 01.07.2020 నాటికి 18 ఏళ్ల నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీలకు గరిష్ట వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు లభిస్తుంది.
- **ఎంపిక విధానం:** జీఎన్ఎం కోర్సు/బీఎస్సీ నర్సింగ్ కోర్సులో సాధించిన అకడెమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. జోనల్ స్థాయిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి నియామకాలు జరుపుతారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 06.04.2020
- **వెబ్‌సైట్:** www.health.telangana.gov.in

## ఎడ్యున్యూస్

### జేఈఈ అడ్వాన్స్‌డ్-2020 వాయిదా

ఐఐటీ ఢిల్లీ.. ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్–2020 పరీక్షను వాయిదా వేసింది. మే 17న జరగాల్సిన పరీక్ష కరోనా కారణంగా వాయిదా పడింది. జేఈఈ మెయిన్ 2020 పరీక్ష నిర్వహించాక.. జేఈఈ అడ్వాన్స్‌డ్–2020 పరీక్షా తేదిని ప్రకటిస్తామని ఐఐటీ ఢిల్లీ తెలిపింది. ఇప్పటికే ఏప్రిల్ 5 నుంచి 11 మధ్య జరగాల్సిన జేఈఈ మెయిన్ పరీక్షను వాయిదా వేశారు. పరీక్ష తేదీ ఏప్రిల్ 15 తర్వాత ప్రకటించే అవకాశముంది. జేఈఈ మెయిన్ పరీక్షకు సుమారు 9లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. జేఈఈ మెయిన్ పరీక్షలో టాప్‌లో నిలిచిన సుమారు 2.5లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అర్హులు.

#### జేఈఈ అడ్వాన్స్‌డ్- 2020

జేఈఈ అడ్వాన్స్‌డ్–2020 అనేది జాతీయ పరీక్ష,ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష. ఇందులో పేపర్–1, పేపర్–2 అనే రెండు ప్రశ్నపత్రాలు ఉంటాయి. ప్రతి పేపర్‌కు 3గంటల కాలవ్యవధి ఉంటుంది. పరీక్షలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

» వెబ్‌సైట్: https://jeeadv.ac.in




కరోనా కారణంగా విద్యార్థులు ఇంటికే పరిమితమయ్యారు. యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు, కాలేజీలు, కోచింగ్ సెంటర్లు.. అన్నింటికీ సెలవులు ప్రకటించారు. కాని ఇంకా అటు అకడెమిక్ పరీక్షలు కానీ.. ఇటు పోటీ పరీక్షలు కానీ పూర్తికాలేదు. ఇలాంటి కీలక సమయంలో తరగతి గది బోధన లేని లోటును తీరుస్తున్నాయి.. ఆన్‌లైన్ వేదికలు! ముఖ్యంగా కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ(ఎంహెచ్ఆర్‌డీ) అందుబాటులోకి తెచ్చిన.. స్వయం, ఈ పాఠశాల, స్వయం ప్రభ, నేషనల్ డిజిటల్ లైబ్రరీ, ఈ-సోధ్ సింధు వంటివి విద్యార్థులకు వరంగా మారుతున్నాయి. ఇంట్లోనే ఉండి అవసరమైన సబ్జెక్టులను నేర్చుకునేందుకు వీలుండడం, ఎంతో అనుభవం ఉన్న అధ్యాపకులు చెప్పే పాఠాలు, వీడియో లెక్చర్స్ అందిస్తుండటంతో.. విద్యార్థులు ఆన్‌లైన్ లెర్నింగ్‌వైపు దృష్టిసారిస్తున్నారు. ఎంహెచ్ఆర్‌డీ అందిస్తున్న ఆన్‌లైన్ లెర్నింగ్ వేదికలపై ప్రత్యేక కథనం...

**విద్యార్థులకు వరంగా ఎంహెచ్ఆర్‌డీ స్వయం, స్వయం ప్రభ, ఈపాఠశాల**

**అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు, నిష్ణాతుల వీడియో లెక్చర్స్‌తో ప్రయోజనం**

**డిజిటల్ రూపంలో అకడెమిక్ పుస్తకాలు సైతం అందుబాటు**

### స్వయం (SWAYAM)

నాణ్యమైన, ఉత్తమమైన విద్యను, బోధనను ప్రతి ఒక్కరికి చేరువచేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన డిజిటల్ పోర్టల్.. 'స్వయం'. ఇందులో అందుబాటులో ఉంచిన కోర్సులు.. దేశంలోని వెయ్యిమందికి పైగా అత్యుత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులు కలిసి రూపొందించినవే కావడం విశేషం. స్వయం ద్వారా అందిస్తున్న కోర్సుల పాఠాలు వీడియోల రూపంలో, ప్రింటింగ్ డౌన్‌లోడ్ చేసుకునేలా పొందుపరిచారు.

- ఇందులో 4 వారాల నుంచి 24 వారాల కాలపరిమితి గల తొమ్మిదో తరగతి నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ దాకా.. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ వంటి కోర్సులను ఉచితంగా పొందవచ్చు. తరగతి గదిలో బోధించినట్టే ఇక్కడా పాఠాలు ఉంటాయి. వీటిని ఎవరైనా ఎక్కడి నుంచైనా యాక్సెస్ చేయవచ్చు. అంతేకాకుండా స్వీయ అంచనా వేసుకునేందుకు వీలుగా పరీక్షలు, క్విజ్‌లు, సందేహాల నివృత్తికి ఆన్‌లైన్ చర్చావేదికగా అందిస్తున్నారు. కొన్ని అంశాలను మల్టీమీడియా ద్వారా వివరిస్తూ నైపుణ్యాలను మెరుగుపరుస్తున్నారు. స్వయం పోర్టల్‌లో కోర్సులకు నేషనల్ కోఆర్డినేటర్లుగా ఏఐసీటీఈ, ఎన్‌పీటీఈఎల్, యూజీసీ, సీఈసీ, ఎన్‌సీఈఆర్‌టీ, ఇగ్నో, ఐఐఎం బెంగళూరు, ఎన్ఐఓఎస్, ఎన్ఐటీటీఆర్ వ్యవహరిస్తున్నాయి. ఈ ఆన్‌లైన్ కోర్సులు ఉచితంగా అందిస్తున్నారు. పైగా ఈ కోర్సుల క్రెడిట్స్‌ను రెగ్యులర్ కోర్సులతో కలుపుకోవచ్చు. సర్టిఫికెట్ పొందాలనుకునేవారు మాత్రం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- పూర్తి వివరాలకు https://swayam.gov.in

### ఈ-పాఠశాల

- ఈ పాఠశాల ద్వారా ఆన్‌లైన్‌లో ఒకటో తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థుల వరకు.. ఎన్‌సీఈఆర్‌టీ 'ఈ–టెక్స్ట్ బుక్స్, సప్లిమెంటరీ బుక్స్, ఆడియో, వీడియో పాఠాలు' అందుబాటులో ఉంచింది. అవసరమనుకుంటే పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ కూడా చేసుకోవచ్చు.
- ఉపాధ్యాయుల కోసం ఈ బుక్స్, టీచింగ్ నిబంధనలు, విధివిధానాలు, అభ్యాస ఫలితాలు(లెర్నింగ్ ఔట్‌కమ్స్).. చిన్నారులకు ఎలా అందించాలో వివరించే టెక్నిక్స్ కూడా ఉన్నాయి. ఈ రిసోర్సెస్ వంటి విభాగాల ద్వారా బోధనా ప్రమాణాలు పెంచే అంశాలను, ప్రామాణికంగా రూపొందించిన ఎడ్యుకేషనల్ జర్నల్స్‌ను అందుబాటులో ఉంచారు.విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపయోగపడే సమాచారం, విద్యావంతులకు అవసరమైన వివరాలు సైతం ఇందులో పొందవచ్చు.
- పాఠశాల విద్యలో గుణాత్మక మార్పులు తెచ్చేందుకు భారత ప్రభుత్వం 1961లో ఏర్పాటు చేసిన స్వయం ప్రతిపత్తి గల సంస్థ 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్' (ఎన్‌సీఈఆర్‌టీ). కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నతమైన, మెరుగైన స్కూల్ ఎడ్యుకేషన్‌ను అందించేందుకు అవసరమైన సహాయ, సహకారాలను ఎన్‌సీఈఆర్‌టీ అందిస్తుంది. పాఠ్యపుస్తకాలు రూపొందించడం, విద్యా సంబంధ పరిశోధనలు చేపట్టడం, జర్నల్స్ వంటి అంశాలను ఈ సంస్థ పరిశీలిస్తుంది.
- పూర్తి వివరాలకు http://epathshala.nic.in

### స్వయం ప్రభ (swayamprabha)

ఉపగ్రహం ద్వారా నిరంతరాయంగా నాణ్యమైన విద్యా కార్యక్రమాలు అందించేందుకు భారత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన 32 డీటీహెచ్ చానెళ్ల సమూహం 'స్వయం ప్రభ'. ఈ చానెళ్ల ద్వారా ప్రతిరోజు నాలుగు గంటలపాటు కొత్త కంటెంట్‌ను ప్రసారం చేస్తారు. రోజులో ఐదు పర్యాయాలు తిరిగి అదే కంటెంట్ ప్రసారం చేస్తుండడంతో.. విద్యార్థులు తమకు అనువైన సమయంలో వాటిని వీక్షించే వీలుంది.

- ఉన్నత విద్యకు సంబంధించి యూజీ, పీజీ కోర్సుల విద్యార్థులకు ఉపయోగపడేలా కరిక్యులం ఆధారిత కంటెంట్‌ను అందిస్తున్నారు. ఆర్ట్స్, సైన్స్, కామర్స్, ఆర్ట్స్, సోషల్ సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్, ఇంజనీరింగ్, టెక్నాలజీ, లా, మెడిసిన్, అగ్రికల్చర్ వంటి విభాగాల విద్యార్థులు ప్రయోజనం పొందొచ్చు.
- ఈ చానెళ్ల ద్వారా పాఠశాల విద్య (9 నుంచి 12 తరగతులు)లో భాగంగా ఉపాధ్యాయుల శిక్షణా అంశాలను, పిల్లలకు పాఠ్యాంశాల బోధనను ప్రసారం చేస్తున్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి అవసరమైన సమాచారం సైతం అందుబాటులో ఉంచుతున్నారు. ఈ పాఠాలను ఎన్‌పీటీఈఎల్, ఐఐటీలు, యూజీసీ, సీఈసీ, ఇగ్నో, ఎన్‌సీఈఆర్‌టీ, ఎన్ఐవోఎస్‌లు అందిస్తున్నాయి.

- పూర్తి వివరాలకు https://www.swayamprabha.gov.in

### నేషనల్ డిజిటల్ లైబ్రరీ

భారత మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఆర్‌డీ).. 'నేషనల్ మిషన్ ఆన్ ఎడ్యుకేషన్ త్రూ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ' (ఎన్ఎంఈఐసీటీ) కింద నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా(ఎన్‌డీఎల్ ఇండియా) పైలట్ ప్రాజెక్టును ఖరగ్‌పూర్ ఐఐటీ ఆధ్వర్యంలో అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా ప్రవేశ పరీక్షలు, పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు ఉపయోగపడే మెటీరియల్, కంటెంట్, టెక్ట్స్, వీడియో, ఆడియోల రూపంలో పొందుపరిచారు. వివిధ భాషల్లో స్కూల్ స్థాయి నుంచి పీజీ స్థాయి వరకు ఆయా సబ్జెక్టుల పాఠ్యాంశాలు.. సైన్స్, సోషల్ సైన్సెస్, టెక్నాలజీ, హుమానిటీస్, హిస్టరీ, జాగ్రఫీ వంటి వాటితోపాటు వివిధ కేసుల్లో కోర్టులు ఇచ్చిన తీర్పులు, జర్నల్స్‌లను ఇక్కడ చూడొచ్చు. ప్రఖ్యాత విద్యాసంస్థలు అందించే పాఠ్యాంశాలు ఇక్కడ కోకొల్లలుగా పొందవచ్చు. ప్రధానంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఇదో అద్భుతమైన వేదికగా చెప్పవచ్చు.

- పూర్తి వివరాలకు https://ndl.iitkgp.ac.in

### ఈ-సోధ్ సింధు (e-ShodhSindhu)

ఒకవిధంగా చెప్పాలంటే.. ఈ సోధ్ సింధు కూడా ఆన్‌లైన్ లైబ్రరీ వంటిదే. ఇందులోని పాఠ్యాంశాలు, జర్నల్స్, ఆర్కైవల్స్ పొందేందుకు చందా చెల్లించాల్సి ఉంటుంది. ప్రధానంగా విద్యాసంస్థలకు తక్కువ చందాతో విలువైన ఈ–పుస్తకాలను అందించేందుకు యూజీసీ–ఇన్‌ఫోనెట్ లైబ్రరీ కన్సార్టియం, ఎన్ఎల్ఐఎస్‌టీ, ఇన్‌డెస్ట్–ఏఐసీటీఈలను అనుసంధానం చేస్తూ.. 'ఈ–సోధ్ సింధు'ను ఏర్పాటు చేశారు. దీనికి సైన్స్, ఆర్ట్స్, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర రంగాలకు చెందిన ప్రసిద్ధ విభాగాల గ్రంథాలయాలను, పెద్ద సంఖ్యలో ప్రచురణకర్తలు, ఆగ్రిగేటర్లు, కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సాంకేతిక సంస్థలు, విశ్వ విద్యాలయాలు, కళాశాలల డేటాబేస్‌ను అనుసంధానం చేశారు. పోర్టల్‌లో 10 వేలకు పైగా ఈ జర్నల్స్, 32 లక్షల ఈ బుక్స్ అందుబాటులో ఉన్నాయి.

- దీని ప్రధాన లక్ష్యం ఏంటంటే.. శాశ్వత ప్రాతిపదికన ఈ–జర్నల్స్, ఈ–ఆర్కైవ్స్, ఈ–పుస్తకాలను అభివృద్ధి చేయడం. దాంతోపాటు అవగాహన, శిక్షణా కార్యక్రమాల ద్వారా మెంబర్‌షిప్ గల విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, సాంకేతిక సంస్థల్లో ఈ–వనరుల వినియోగాన్ని పర్యవేక్షించడం, ప్రోత్సహించడం.
- ఈ–సోధ్ సింధులో సభ్యత్వం తీసుకున్న కళాశాలలు , విద్యా సంస్థలకు దేశంలో ఏ యూనివర్సిటీ డేటాబేస్‌తోనైనా అనుసంధానం అయ్యే వీలుంటుంది.
- ఇప్పటికే ఇందులో 217 విశ్వవిద్యాలయాలు, 75 టెక్నికల్ ఇనిస్టిట్యూట్స్, 3200పైగా కళాశాలలు సభ్యత్వం పొందాయి. వీటి ద్వారా విద్యార్థులు ప్రయోజనం పొందొచ్చు.
- పూర్తి వివరాలకు https://ess.inflibnet.ac.in

# ఫిజియోథెరపీకి ఫుల్ డిమాండ్

## కెరీర్ కౌన్సెలింగ్

» నేను ఇటీవల ఇంటర్మీడియెట్ బైపీసీ పరీక్షలు రాశాను. బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సులో చేరాలనుకుంటున్నాను. నాకు అర్హత ఉందా? ఫిజియోథెరపీతో ఉపాధి అవకాశాలు ఎలా ఉంటాయి?!

- సంగీతా



- ప్రస్తుత కాలంలో శారీరక శ్రమ లేని ఉద్యోగాలు పెరుగుతున్నాయి. ఐటీ, అనుబంధ రంగాలతోపాటు దాదాపు 60శాతం ఉద్యోగాలు కూర్చుని చేసేవే కావడం గమనార్హం. దాంతో చిన్న వయసులోనే అనేక రోగాల బారిన పడుతున్నారు. అనారోగ్యకర ఆహార అలవాట్లు, మారుతున్న జీవన శైలి కారణంగా చిన్నా, పెద్దా తేడా లేకుండా అధిక సంఖ్యలో ఊబకాయం, పెరాలసిస్ వంటి రోగాలతో బాధపడుతున్నారు. అంతేకాకుండా ప్రమాదాల కారణంగా కాళ్లు, చేతులు బెణకడం వంటివి జరిగినప్పుడు డాక్టర్లు వీరికి వ్యాయామం, మసాజ్ తప్పనిసరిని చెబుతున్నారు. దాంతో వైద్య రంగంలో ఫిజియోథెరపిస్టుల అవసరం పెరుగుతోంది.

### ఫిజియోథెరపీ కోర్సు చేయాలంటే

బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ(బీపీటీ) కోర్సులో చేరేందుకు ఇంటర్మీడియెట్‌లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ(బైపీసీ) కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీలు కనీసం 45శాతం మార్కులతో పాసైతే సరిపోతుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎంసెట్‌లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా ఫిజియోథెరపీ కోర్సులో ప్రవేశం పొందవచ్చు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశం లభిస్తే ఫీజు సుమారు రూ.25 వేలు ఉంటుంది. ప్రైవేటు కళాశాలల్లో రూ.70 వేల నుంచి రూ.లక్షన్నర వరకు ఉంటుంది. ఇతర రాష్ట్రాల్లో సైతం ప్రవేశ పరీక్ష ఆధారంగానే అడ్మిషన్ లభిస్తోంది. రాష్ట్రాన్ని, కళాశాలను బట్టి ఫీజు ఆధారపడి ఉంటుంది. కోర్సు కాల వ్యవధి 4 సంవత్సరాలు కాగా, మరో ఆరు నెలలు క్లినికల్ ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. బీపీటీ తర్వాత ఆసక్తిని బట్టి మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సు కూడా చేయవచ్చు.

### ఉద్యోగం-ఉపాధి

ఫిజియోథెరపీ కోర్సులు పూర్తిచేసిన వారికి దేశ, విదేశాల్లో ఉద్యోగావకాశాలకు, ఉపాధి మార్గాలకు ఢోకా లేదని నిపుణులు పేర్కొంటున్నారు. ఎందుకంటే.. వైద్య సేవల రంగంలో బీపీటీ కోర్సు పూర్తి చేసినవారి అవసరం రోజురోజుకూ పెరుగుతోంది. వీరికి ఆసుపత్రులు, హెల్త్ ఇన్‌స్టిట్యూట్స్, ఫిట్‌నెస్ సెంటర్లు, ప్రైవేటు క్లినిక్స్‌లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. నైపుణ్యాలుంటే సగటు వార్షిక వేతనం రూ.3 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు పొందవచ్చు. ఉద్యోగం చేయడం ఇష్టం లేకుంటే.. సొంతంగా ఫిజియోథెరపీ క్లినిక్ ప్రారంభించవచ్చు. ఇటీవల కాలంలో స్పోర్ట్స్ ఫిట్‌నెస్ ఫిజియోథెరపిస్టులకు డిమాండ్ పెరుగుతోంది. క్రీడాకారులు అధిక వేతనాలు చెల్లించి వ్యక్తిగత ఫిజియోథెరపిస్టులను నియమించుకుంటున్నారు.

### విధులు

ఫిజియోథెరపీ అనేది ఆరోగ్య సంరక్షణకు సంబంధించింది. ముఖ్యంగా వృద్ధాప్యం, నొప్పి, గాయం, పెరాలసిస్ వంటి వాటితో పాటు ఇతర కారణాల వల్ల శరీర కదలికలు, పనితీరు సక్రమంగా లేకుంటే... ఫిజియోథెరపిస్టుల సలహాలు, సూచనలు అవసరమవుతాయి. శారీరక కదలికల తీరుతెన్నులు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించి.. మసాజ్ వంటి వాటి ద్వారా వాటిని సరిచేస్తారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగాలు-2020
❖ స్టడీ మెటీరియల్, బిట్‌బ్యాంక్, జీకే, మాక్ టెస్టులు, కరెంట్ అఫైర్స్, ప్రీవియస్ పేపర్స్, వీడియో గైడెన్స్ మొదలైనవి.
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

# ఉజ్వల భవితకు టూల్ డిజైన్

హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ) 1968లో ఏర్పాటు చేశారు. తాజాగా సీఐటీడీలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఆయా కోర్సుల వివరాలు, అర్హతలు, దరఖాస్తు విధానంతోపాటు సీఐటీడీ అందిస్తున్న ఇతర కోర్సుల గురించి తెలుసుకుందాం..

» సీఐటీడీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
» దరఖాస్తులకు చివరి తేది: 02.05.2020




### కోర్సులు-అర్హతలు

- **కోర్సు పేరు:** డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్.
  » **సీట్ల సంఖ్య:** 60 » **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు
  » **వయసు:** 15–19 ఏళ్లు.
  » **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణత; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులుంటే సరిపోతుంది.
- **కోర్సు పేరు:** డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్.
  » **సీట్ల సంఖ్య:** 60 » **కోర్సు వ్యవధి:** మూడేళ్లు
  » **వయసు:** గరిష్ట వయసు 19 ఏళ్లు.
  » **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- **కోర్సు పేరు:** డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజనీరింగ్.
  » **సీట్ల సంఖ్య:** 60 » **కోర్సు వ్యవధి:** మూడేళ్లు
  » **వయసు:** గరిష్ట వయసు 19 ఏళ్లు.
  » **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణత.
- **కోర్సు పేరు:** డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్.
  » **సీట్ల సంఖ్య:** 60 » **కోర్సు వ్యవధి:** మూడేళ్లు
  » **వయసు:** గరిష్ట వయసు 19 ఏళ్లు .
  » **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణత తప్పనిసరి.

### ప్రవేశ పరీక్ష

ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు అడ్మిషన్ లభిస్తుంది. ఎంట్రన్స్ టెస్టులో పదోతరగతి స్థాయి మ్యాథమెటిక్స్, సైన్స్, ఇంగ్లిష్, ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్ నుంచి ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంటన్నర.

### ఇతర కోర్సులు

- నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్ వర్క్(ఎన్ఎస్‌క్యూఎఫ్) కోర్సులు.
- సీఏడీ, సీఏఎమ్, టూల్ డిజైన్ కోర్సులు.
- ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్(ఈఎస్‌డీఎం).

### మరికొన్ని కోర్సుల వివరాలు

- ఏడాది వ్యవధితో సీఎన్‌సీ మెషినింగ్‌పై అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ కోర్సు అందుబాటులో ఉంది. మెషినిస్ట్, టర్నర్, బెంచ్ ఫిట్టర్, టూల్ మేకర్ స్పెషలైజేషన్స్‌తో ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులు.
- కంప్యూటర్ ఎయిడెడ్ టూల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్ సర్టిఫికెట్ కోర్సు అందుబాటులో ఉంది. కోర్సు వ్యవధి ఆరు నెలలు. మెకానికల్ ఇంజనీరింగ్/ తత్సమాన కోర్సులో డిప్లొమా లేదా డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- సీఏడీ, సీఏఎంలో మాస్టర్ సర్టిఫికెట్ కోర్సు అందుబాటులో ఉంది. కోర్సు వ్యవధి ఆరు నెలలు. మెకానికల్ ఇంజనీరింగ్/తత్సమాన కోర్సులో డిప్లొమా లేదా డిగ్రీ ఉత్తీర్ణులు ప్రవేశానికి అర్హులు.
- సీఎన్‌సీ మిల్లింగ్‌లో ఆరు నెలల వ్యవధితో సర్టిఫికెట్ కోర్సు అందుబాటులో ఉంది. పదోతరగతి/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు.
- సీఎన్‌సీ టర్నింగ్‌లో ఆరు నెలల వ్యవధితో సర్టిఫికెట్ కోర్సు అందుబాటులో ఉంది. పదోతరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు.

### నాలుగు నెలల కోర్సులు

- మెకానికల్ సీఏడీ/సీఏఎం » అడ్వాన్స్‌డ్ మెకానికల్ సీఏడీ/సీఏఎం.
- **అర్హత:** మెకానికల్ ఇంజనీరింగ్/తత్సమాన కోర్సులో డిప్లొమా లేదా డిగ్రీ ఉత్తీర్ణులు పై రెండు కోర్సుల్లో ప్రవేశానికి అర్హులు

### మూడు నెలల కోర్సులు

- ఇంటిగ్రేటెడ్ సీఆర్ఈవో పారామెట్రిక్ » ఇంటిగ్రేటెడ్ క్యాషియా » ఇంటిగ్రేటెడ్ ఏఎన్ఎస్‌వైఎస్ » ఇంటిగ్రేటెడ్ హైపర్‌మెష్ » మెకానికల్ సీఏడీ.
- **అర్హత:** మెకానికల్ ఇంజనీరింగ్/తత్సమాన కోర్సులో డిప్లొమా లేదా డిగ్రీ ఉత్తీర్ణులు పై కోర్సుల్లో ప్రవేశానికి అర్హులు.

### స్వల్పకాలిక కోర్సులు

సీఐటీడీలో పైకోర్సులతోపాటు రెండు నెలలు, నెల వ్యవధితో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా ఆరు నెలల వ్యవధిలో ఇండస్ట్రియల్ ట్రైనింగ్, బీఈ/బీటెక్ విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్, ఇంటర్న్‌షిప్‌ను సైతం అందిస్తోంది.

### ముఖ్యతేదీలు

- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2 మే 2020
- **ప్రవేశ పరీక్ష తేదీ:** 10 మే 2020
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులు రూ.700, ఎస్సీ‌ఎస్టీ కేటగిరీ రూ.350.
- **వివరాలకు:** www.citdindia.org

# దీప యజ్ఞం సక్సెస్

- కరోనాపై కదనానికి దేశ ప్రజల సంఘీభావం
- ప్రధాని మోదీ పిలుపునకు అపూర్వ స్పందన

**న్యూఢిల్లీ:** దీప కాంతిలో భారతావని వెలుగులీనింది. కరోనా రక్కసి అంతానికి దేశ ప్రజలంతా ఐక్యంగా దీపాలు చేతబూని ప్రతిజ్ఞ చేశారు. ప్రాణాంతక కరోనా వైరస్‌పై అలుపెరగని పోరుకు సంఘీభావంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'దీప యజ్ఞం' విజయవంతమైంది. దేశవ్యాప్తంగా ప్రజలు దీపాలు, కొవ్వొత్తులు, మొబైల్ టార్చ్‌లు వెలిగించి కరోనా రాక్షసిని అంతమొందించే ఉమ్మడి సంకల్పానికి ఘనంగా సంఘీభావం తెలిపారు. కోట్లాది భారతీయులు ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రారంభించి 9 నిమిషాల పాటు తమ ఇళ్ల ముందు, బాల్కనీల్లో దీపాల వెలుగులను విరజిమ్మి, మహమ్మారిపై పోరులో విజయమే లక్ష్యమని ప్రతిన బూనారు. ప్రధాని మోదీ కూడా తన ఇంటిముందు దీప స్థంభాన్ని వెలిగించి, కరోనాపై కదనంలో ముందుంటానని దేశ ప్రజలకు ధైర్యం చెప్పారు. కేంద్ర మంత్రులు, రాష్ట్రాల్లో గవర్నర్లు, ముఖ్యమంత్రులు ఈ దీప యజ్ఞంలో మమేకమయ్యారు. తమ నివాసాల్లో దీపాలను వెలిగించి, ప్రధాని మోదీ సంకల్పానికి సంఘీభావం తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు బాణాసంచా కాల్చడం, హిందూ ప్రార్థనా గీతాలను, మంత్రాలను వినిపించడం కూడా కనిపించింది. మరికొన్ని చోట్ల జాతీయ గీతాన్ని ఆలపించారు. ప్రజలంతా ఆదివారం రాత్రి 9 గంటలకు 9 నిమిషాల పాటు, తమ ఇళ్లల్లోని విద్యుద్దీపాలను ఆర్పేసి, ఇంటి ముందు దీపాలు, కొవ్వొత్తులు, లేదా మొబైల్ టార్చ్‌లు వెలిగించి కరోనాను తరిమికొట్టే తమ ఉమ్మడి సంకల్పాన్ని ఘనంగా ప్రకటించాలని శుక్రవారం ప్రధాని మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

**ఎలక్ట్రిసిటీ గ్రిడ్ సేఫ్**

దేశవ్యాప్తంగా ఇళ్లల్లో విద్యుద్దీపాలను ఒకేసారి 9 నిమిషాల పాటు ఆర్పేసే కార్యక్రమం జరిగినప్పటికీ.. విద్యుత్ గ్రిడ్‌కు ఎలాంటి ఇబ్బంది కలగలేదని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కే సింగ్ తెలిపారు. డిమాండ్‌లో ఒకేసారి భారీగా తగ్గుదల, 9 నిమిషాల అనంతరం ఒకేసారి అదే స్థాయిలో పెరుగుదల చోటు చేసుకున్నప్పటికీ.. ఆ పరిస్థితిని ఎదుర్కొనేందుకు తమ శాఖ సిద్ధమై, అవసరమైన చర్యలు తీసుకుందన్నారు. 'గ్రిడ్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. నేను, మా శాఖ కార్యదర్శి, ఇతర సీనియర్ అధికారులు స్వయంగా పరిస్థితిని సమీక్షించాం. సమర్థవంతంగా ఈ పరిస్థితిని ఎదుర్కొన్న ఎన్‌ఎల్‌డీసీ, ఆర్‌ఎల్‌డీసీ, ఎస్‌ఎల్‌డీసీల్లోని ఇంజినీర్లందరికి అభినందనలు' అని సింగ్ పేర్కొన్నారు. 'దేశవ్యాప్తంగా ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో విద్యుత్ వినియోగం ఒక్కసారిగా 117 గిగావాట్ల నుంచి 85.3 గిగావాట్లకు తగ్గిపోయింది. అంటే 30 గిగావాట్లకు పైగా డిమాండ్ తగ్గింది. ఇది మేం తగ్గుతుందని ఊహించిన 12 గిగావాట్ల కన్నా చాలా ఎక్కువ' అని ఆయన వివరించారు. దీప యజ్ఞం సందర్భంగా ఒకేసారి విద్యుత్ వినియోగం తగ్గితే గ్రిడ్ కుప్పకూలుతుందని ఆందోళన వ్యక్తమైన విషయం తెలిసిందే.

**సరుకుల రవాణాకు సహకరించండి**

నిత్యావసరాల రవాణాలో కీలకమైన ట్రక్ డ్రైవర్లు, ఇతర కూలీలు తమ పని ప్రదేశాలకు వెళ్లేందుకు సహకరించాలని కేంద్రం రాష్ట్రాలను కోరింది. అప్పుడే నిత్యావసరాల సరఫరా సజావుగా సాగుతుందని పేర్కొంది.



గాంధీనగర్‌లోని తమ నివాసంలో దీపం పట్టుకున్న ప్రధాని మాతృమూర్తి హీరా బెన్



దీపయజ్ఞానికి సంఘీభావంగా ప్రమిదలు వెలిగించిన కోల్‌కతాలోని జేఎన్ రే ఆస్పత్రి సిబ్బంది

# ఒక్కరోజులో... 505 కేసులు, 7 మరణాలు

**దేశవ్యాప్తంగా విజృంభిస్తున్న కరోనా మహమ్మారి**

83కు చేరిన మరణాల సంఖ్య • కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడి

**న్యూఢిల్లీ:** భారత్‌లో కరోనా మహమ్మారి బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. తాజాగా 505 కొత్త కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, ఏడుగురు మరణించారని కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం ప్రకటించింది. దీంతో దేశంలో మొత్తం కేసుల సంఖ్య 3,577, మొత్తం మరణాల సంఖ్య 83కి చేరిందని వెల్లడించింది. కానీ, రాష్ట్రాల వారీగా గణాంకాలు చూస్తే కరోనా వల్ల దేశవ్యాప్తంగా 110 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది. పాజిటివ్ కేసుల సంఖ్య 3,959కు చేరినట్లు స్పష్టమవుతోంది. వీరిలో 306 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొంది, ఆరోగ్యవంతులుగా మారి, ఇళ్లకు చేరారు. దేశవ్యాప్తంగా కరోనా కేసులు, మరణాల గణాంకాలను మదింపు చేయడంలో జరుగుతున్న జాప్యం వల్లే లెక్కల్లో వ్యత్యాసం కనిపిస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

**4.1 రోజుల్లో కేసులు రెట్టింపు**

దేశంలో కరోనా పాజిటివ్ కేసులు రెట్టింపు కావడానికి ప్రస్తుతం 4.1 రోజులు పడుతోంది. ఢిల్లీలో జరిగిన తబ్లిగీ జమాత్‌కు సంబంధించిన కేసులు గనుక లేకపోయినట్లయితే, ఇందుకు 7.4 రోజులు పట్టేదని కేంద్ర ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రెటరీ లవ్ అగర్వాల్ ఆదివారం తెలిపారు. దేశంలో 274 జిల్లాల్లో కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయని పేర్కొన్నారు. కరోనా విషయంలో తాజా పరిస్థితిపై కేంద్ర కేబినెట్ సెక్రెటరీ రాజీవ్ గౌబా ఆదివారం అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఆరోగ్య శాఖ కార్యదర్శులు, జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, ఎస్పీలతో చర్చించారని వివరించారు. కరోనా నేపథ్యంలో ఆధునిక రక్షణ పరికరాలను రాష్ట్రాలకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.



ఆదివారం ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్ వద్ద ఫోరెన్సిక్ నిపుణులు

**అగ్రస్థానంలో మహారాష్ట్ర**

మృతుల విషయంలో మహారాష్ట్ర అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ రాష్ట్రంలో ఇప్పటి దాకా 24 మంది ప్రాణాలు కోల్పోయారు. పాజిటివ్ కేసుల్లో ఢిల్లీ మొదటిస్థానం. ఇక్కడ 503 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కరోనా వైరస్ గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని భారత వైద్య పరిశోధనా మండలి స్పష్టం చేసింది.

**ఢిల్లీలో 8 మంది మలేషియన్ల పట్టివేత**

ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో తబ్లిగీ జమాత్‌కు హాజరై, సొంత దేశం మలేషియాకు తిరిగి వెళ్లేందుకు ప్రయత్నించిన 8 మంది మలేషియన్లను ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఇండియాలో చిక్కుకుపోయిన తమ దేశ పౌరులను సొంత దేశానికి తీసుకెళ్లడానికి మలేషియన్ హైకమిషన్ ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేసింది. ఈ విమానం ఆదివారం ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరింది. అయితే, తబ్లిగీ జమాత్‌కు హాజరైనవారు కూడా ఈ విమానంలో మలేషియాకు తిరిగి వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం అందడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మొత్తం 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా ఇప్పటిదాకా ఢిల్లీలోనే తలదాచుకున్నారు.

## వ్యక్తిగత రక్షణ పరికరాలు అందరికీ అక్కర్లేదు

**కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్**



కరోనా అనుమానిత లక్షణాలు ఉన్నవారు, ఆసుపత్రుల్లో రోగులకు వైద్య సేవలందించేవారు మినహా ఇతరులు పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్(పీపీఈ) ఉపయోగించాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ చెప్పారు. ఆయన ఆదివారం హరియాణా రాష్ట్రం ఝజ్జర్‌లోని ఎయిమ్స్‌లోని కరోనా చికిత్సా కేంద్రాన్ని సందర్శించారు.

## పలువురు నేతలకు ప్రధాని ఫోన్

**న్యూఢిల్లీ:** ప్రధాని మోదీ ఆదివారం కాంగ్రెస్ చీఫ్ సోనియాగాంధీ, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ తదితరులతో ఫోన్‌లో మాట్లాడారు. దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా తలెత్తిన పరిస్థితులపై వారితో చర్చించారు. ఆదివారం ప్రధాని మోదీ.. మాజీ రాష్ట్రపతులు ప్రణబ్‌ముఖర్జీ, ప్రతిభా పాటిల్, మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, హెచ్‌డీ దేవెగౌడలతో కూడా ఫోన్‌లో సంభాషించారు. ఇంకా.. సమాజ్‌వాదీ పార్టీ అగ్ర నేతలు అఖిలేశ్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్, పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ, ఒరిస్సా సీఎం నవీన్ పట్నాయక్, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, శిరోమణి అకాలీదళ్ నేత ప్రకాశ్ సింగ్ బాదల్ తోనూ మాట్లాడారు. పార్లమెంట్‌లో వివిధ పక్షాల నేతలతో ప్రధాని మోదీ ఈనెల 8వ తేదీన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## ఈపీఎఫ్‌వోలో జనన ధ్రువీకరణకు ఆధార్

**న్యూఢిల్లీ:** ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌వో) ఖాతాదారులు తమ జనన తేదీ ధ్రువీకరణకు ఆధార్ కార్డును రుజువుగా చూపవచ్చని కేంద్రం తెలిపింది. ఈ మేరకు క్షేత్ర స్థాయి అధికారులకు ఈపీఎఫ్‌వో ఆదేశాలిచ్చిందని పేర్కొంది. ఖాతాదారులు తమ ఆధార్‌తో ఆన్‌లైన్‌లో కేవైసీ సమర్పించవచ్చని వివరించింది. రికార్డుల్లో ఉన్న పుట్టిన రోజుకు, ఆధార్‌లో జనన తేదీకి మధ్య మూడేళ్లలోపు ఉంటే అధికారులు ఆధార్‌నే పరిగణనలోకి తీసుకుంటారని పేర్కొంది. లాక్‌డౌన్ కారణంగా ఆర్థికంగా ఇబ్బందిపడే ఖాతాదారులు తమ మూడు నెలల బేసిక్ వేతనం, డీఏ ఉపసంహరించుకునేలా కేంద్రం వెసులుబాటు కల్పించిన విషయం తెలిసిందే. కేవైసీ ద్వారా పూర్తి వివరాలు అందజేసిన వారికే ఈ సౌకర్యం వర్తించనుంది.

## ప్రజలు లేకుండానే పోప్ ప్రార్థనలు



**వాటికన్ సిటీ:** కరోనా కారణంగా వాటికన్ సిటీ వెలవెలబోయింది. ఏటా గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం జరుపుకునే ప్రాని కొమ్మల (పామ్) ఆదివారం ప్రార్థనలకు దేశ, విదేశాల నుంచి వేలాది సంఖ్యలో హాజరయ్యే వారు. కరోనా వైరస్ వ్యాప్తి భయంతో ఈ ఏడాది వాటికన్ సిటీని మూసివేయడంతో, భక్తులు లేకుండానే పోప్ ఫ్రాన్సిస్ ప్రత్యేక దివ్యబలి పూజను సెయింట్ పీటర్స్ బసిలికా లోపలే నిర్వహించారు. ఆ కార్యక్రమంలోనూ అతి తక్కువ మంది హాజరు కాగా, వారు కూడా భౌతిక దూరాన్ని పాటించారు. ఈ సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ.. కరోనా మహమ్మారి మానవాళి ఆశలపై గండి కొట్టిందని, హృదయాలపై మోయరాని భారాన్ని పెట్టిందని అన్నారు.

## కశ్మీర్‌లో చొరబాటు కుట్ర భగ్నం

**శ్రీనగర్:** సరిహద్దులో నియంత్రణ రేఖ (ఎల్వోసీ)ను దాటి భారత్‌లో చొరబడేందుకు యత్నించిన ఐదుగురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఈ ఘటనలో ముగ్గురు సైనికులు కూడా మృతి చెందినట్లు రక్షణ శాఖ ప్రతినిధి వెల్లడించారు. ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా వద్ద ఆదివారం ఈ ఘటన జరిగింది.

# ఎకానమీ కోసం మరో ప్యాకేజ్!

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ కారణంగా భారీగా దెబ్బతింటున్న ఆర్థిక రంగాన్ని పునరుత్తేజపరిచేందుకు మరో ప్యాకేజ్‌ను ప్రకటించే విషయంపై కేంద్రం సమాలోచనలు చేస్తోంది. లాక్‌డౌన్ తరువాత ఆర్థిక రంగంలో నెలకొనునున్న వివిధ పరిస్థితులను బేరీజు వేస్తోంది. అయితే, మరో ప్యాకేజ్‌ను ప్రకటించే విషయమై ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సంబంధిత అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం లాక్‌డౌన్ అనంతర పరిస్థితులను అంచనా వేసే పనిలో ఉన్నామన్నారు. అలాగే, కొన్ని సంక్షేమ, ఇతర ప్రభుత్వ పథకాలను లాక్‌డౌన్ అనంతర పరిస్థితులకు అనుగుణంగా మార్చే అవకాశాలపై కూడా కేంద్రం ఆలోచిస్తోందని తెలిపారు. కరోనా వల్ల ఆర్థిక రంగంపై పడే ప్రతికూల ప్రభావాన్ని తగ్గించే దిశగా ఏదైనా నిర్ణయం ప్రకటిస్తే.. అది కేంద్రం తీసుకున్న మూడో నిర్ణయమవుతుంది. ప్రధాని మోదీ మార్చి 24న లాక్‌డౌన్‌ను ప్రకటించడానికి కొద్ది గంటల ముందు.. ఆర్థికమంత్రి పన్ను చెల్లింపుదారులు, పారిశ్రామిక వేత్తలకు కొన్ని ఉపశమన చర్యలను ప్రకటించారు. రెండు రోజుల తరువాత మార్చి 26న కరోనా ప్రభావిత రంగాలను ఆదుకోవడం కోసం రూ. 1.7 లక్షల కోట్ల రిలీఫ్ ప్యాకేజ్‌ను కూడా ప్రకటించారు. కోవిడ్ 19పై పోరు కోసం ఉన్నతాధికారులతో ప్రధాని మోదీ ఏర్పాటు చేసిన 10 సాధికార బృందాల్లో ఒకటి ఆర్థిక రంగ పునరుత్తేజంపై పని చేస్తోంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ నేతృత్వంలోని మంత్రుల బృందం కూడా లాక్‌డౌన్ అనంతర పరిస్థితులను సమీక్షిస్తోంది.

# విడతలుగా విమాన సర్వీసులు?

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్త లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత దశలవారీగా విమాన సర్వీసులను ప్రారంభించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి తర్వాత 21 రోజుల కరోనా లాక్‌డౌన్ ముగియనుంది. ఆ తర్వాత దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను దశలవారీగా ప్రారంభించే అవకాశాలున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. 'దేశంలో వైరస్ వ్యాప్తి ఇంకా కొనసాగుతోంది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్ 14వ తేదీ తర్వాత దశల వారీగా దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను ప్రారంభించాలని యోచిస్తున్నాం. ఏప్రిల్ 14 తర్వాత ప్రయాణాలకు విమానయాన సంస్థలు టికెట్లు చేసుకోవచ్చు'అని ఓ అధికారి తెలిపారు. లాక్‌డౌన్‌ను మరికొన్ని రోజుల పాటు పొడిగిస్తే మాత్రం ఆ మేరకు టికెట్లు క్యాన్సిల్ చేసుకోవాల్సి ఉంటుందని ఆయన వివరించారు. ఎయిరిండియా మినహా ఇప్పటికే ప్రముఖ విమానయాన సంస్థలు 14వ తేదీ నుంచి జరిగే దేశీయ ప్రయాణాలకు టికెట్ల బుకింగ్స్ మొదలుపెట్టగా ఎయిరిండియా మాత్రం ఈ నెల 30 తర్వాత ప్రయాణాలకు మాత్రమే బుకింగ్స్ ప్రారంభించింది.

**దెబ్బతిన్న విమానయాన రంగం**

లాక్‌డౌన్ కారణంగా ఆదాయం పడిపోవడంతో విమానయాన రంగం తీవ్రంగా దెబ్బతింది. దీంతో ఎయిర్ డెక్కన్ సంస్థ అన్ని విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతానికి ఉద్యోగులంతా ఇళ్లలోనే ఉండాలని కోరింది.

**14 తర్వాత రైళ్లు!**

దేశంలో లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత ప్రయాణికులు కనీస ముందు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకుంటూ విడతల వారీగా సర్వీసులను ప్రారంభించాలని రైల్వేశాఖ యోచిస్తోంది. ప్రయాణికులు వ్యక్తిగత దూరం పాటించడం, మాస్కులు ధరించడం, ఆరోగ్య సేతు యాప్ వాడుతూ ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడం వంటి ముందు జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే వారిని అనుమతించాలని భావిస్తోంది. తద్వారా కోవిడ్ వైరస్ మరింత వ్యాప్తి చెందకుండా అడ్డుకట్ట వేయవచ్చని ఆశిస్తోంది.

# పింక్ సూపర్ మూన్

**8వ తేదీ ఉదయం 8 గంటలకు**



**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న సమయంలోనే ఆకాశవీధిలో ఓ అందాల దృశ్యం ఆవిష్కృతం కానుంది. ఈ నెల 7న చంద్రుడిలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అమెరికా కాలమానం ప్రకారం ఏప్రిల్ 7 రాత్రి 8.30 గంటలకు చంద్రుడు భూమి కక్ష్యలోకి మరింత దగ్గరగా వచ్చి, భారీ సైజులో కాంతులీనుతూ కనువిందు చేయనున్నాడు. దీనినే పింక్ సూపర్ మూన్ అని పిలుస్తారు. 2020 సంవత్సరంలో చంద్రుడు అత్యంత పెద్దగా కనిపించే రోజు ఇదే. భారత్‌లో 8వ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకు ఈ దృశ్యాన్ని చూడవచ్చునని ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్‌తో ఇంటిపట్టునే ఉన్న ప్రజలు ఈ సూపర్ మూన్ అందాలను పూర్తిగా ఆస్వాదించే పరిస్థితి లేదు. ఎందుకంటే భారత్‌లో ఉదయం సమయం కాబట్టి సూపర్ మూన్ పూర్తి స్థాయిలో కనిపించే అవకాశాలు తక్కువ ఉన్నాయని ఖగోళ శాస్త్రవేత్తలు అంటున్నారు.

**ఏమిటీ పింక్ సూపర్ మూన్**

పున్నమి రోజుల్లో కనిపించే చంద్రుడు కంటే అత్యంత ప్రకాశవంతంగా, ఇంకా పెద్దగా ఆకాశ వీధిలో అందాల జాబిలి కనువిందు చేయడాన్నే సూపర్ మూన్ అంటారు. భూ కక్ష్యలో చంద్రుడు దగ్గరగా ఉండే స్థానాన్ని పెరోజి అంటారు. ఈ పెరోజీలోకి వచ్చినప్పుడు చంద్రుడు మరింత పెద్దగా, ప్రకాశవంతంగా కనిపించి అందరినీ అలరిస్తాడు. సాధారణంగా భూమికి, చంద్రుడికి మధ్య దూరం 3,84,000 కి.మీ. ఉంటుంది. కానీ ఏప్రిల్ 7, 8వ తేదీల్లో ఆ దూరం 3,56,000 కి.మీ. తగ్గిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఫలితంగా పౌర్ణమి నాడు కనిపించే చంద్రుడి కంటే 14 శాతం పెద్దగా, 30 శాతం ఎక్కువ ప్రకాశవంతంగా సూపర్ పింక్ మూన్ దర్శనమిస్తాడు. 20 ఏళ్లలో ఇప్పటివరకు 79 సూపర్ మూన్‌లు వచ్చాయి. సగటున మూడు నెలలకో సూపర్ మూన్ కనిపిస్తుంది. ఈ ఏడాది నెలకో సూపర్ మూన్ వస్తూనే ఉంది.

# కోవిడ్–19పై సహకరించుకుందాం

- ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్
- క్లోరోక్విన్ ఎగుమతులు ఆపొద్దన్న అమెరికా అధ్యక్షుడు
- చేతనైనంత సాయం చేస్తామని మోదీ హామీ

**వాషింగ్టన్/న్యూఢిల్లీ:** ప్రపంచానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న కరోనా వైరస్‌పై యుద్ధం చేయడానికి పరస్పరం సహకరించుకోవాలని అమెరికా, భారత్ నిర్ణయించుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్య శనివారం జరిగిన ఫోన్ సంభాషణలో పలు అంశాలపై చర్చించుకున్నారు. ప్రపంచ దేశాల్లో ఆరోగ్య అత్యవసర పరిస్థితి నెలకొన్న ఈ సమయంలో ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ, ఆయుర్వేద వైద్య విధానం ప్రాముఖ్యతపైన కూడా ఇద్దరు నేతలు చర్చించారు. కోవిడ్–19 రోగులకు ఇచ్చే హైడ్రాక్సీ క్లోరోక్విన్ మందుల్ని పంపించాలని ట్రంప్ కోరారు. మలేరియా వ్యాధిని అరికట్టే క్లోరోక్విన్ టాబ్లెట్లు కరోనా వైరస్‌ను నిర్మూలించడంలో సత్ఫలితాలు చూపిస్తున్నాయని భావిస్తూ ఉండడంతో అమెరికా కొన్నాళ్ల క్రితమే భారత్‌కి ఆర్డర్ పెట్టుకుంది. భారత్‌లో కూడా కరోనా కేసులు ఎక్కువ కావడంతో క్లోరోక్విన్ ఎగుమతుల్ని ఈ నెల 4న భారత్ నిషేధించింది. దీంతో ట్రంప్ ఫోన్ చేసి మోదీతో మాట్లాడారు. తమ కంపెనీలు ఆర్డర్ చేసిన క్లోరోక్విన్ మాత్రల్ని పంపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ట్రంప్ విలేకరులతో.. 'భారత ప్రధానితో మాట్లాడాను. భారత్ క్లోరోక్విన్ మాత్రలను భారీ స్థాయిలో తయారు చేస్తోంది. నా విజ్ఞప్తిపై భారత్ సీరియస్‌గానే ఆలోచిస్తోంది'అని అన్నారు.

# ప్రపంచం ఉక్కిరిబిక్కిరి

**వృద్ధులైతే ఇంటికే**

- చికిత్స చేయలేమని చేతులెత్తేసిన స్పెయిన్
- అమెరికాలో మృతుల సంఖ్యను ఊహించలేమన్న ట్రంప్



రష్యా రాజధాని మాస్కో నగర వీధుల్లో ట్యాంకర్లతో క్రిమిసంహారిణిని స్ప్రే చేస్తున్న దృశ్యం

**వాషింగ్టన్/బీజింగ్/మాడ్రిడ్:** ''మా అమ్మ వయసు 85 సంవత్సరాలు. కరోనా వ్యాధి సోకి ఊపిరి పీల్చుకోలేని దుస్థితి. ఆస్పత్రికి తీసుకువెళితే మత్తు మందు ఇచ్చి వెనక్కి పంపించేశారు. వృద్ధులకు చికిత్స చేయడానికి ఆస్పత్రులు సరిపోవడం లేదు. ఐసీయూలో యువతకే చికిత్స అందిస్తున్నారు ఇంక ఎవరూ చేయగలిగిందేమీ లేదు''స్పెయిన్‌లోని బార్సిలోనాకు చెందిన మారియా జోస్ అనే కూతురి ఆవేదన ఇది. కేవలం ఆమె మాత్రమే కాదు స్పెయిన్‌లో చాలా నగరాల్లో ఇదే దుస్థితి నెలకొంది. రోగులకు చికిత్స అందించడానికి ఆస్పత్రులు సరిపోవడం లేదు. రేయింబగళ్లు పనిచేయలేక వైద్యులు అలిసిపోతున్నారు. ప్రపంచ దేశాల్లో ఇటలీ తర్వాత అత్యధిక కరోనా మృతులు స్పెయిన్‌లో నమోదయ్యాయి. ఆదివారం ఒక్క రోజే 674 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం మృతుల సంఖ్య 13 వేలకు చేరువలో ఉంది. కేసులు లక్షా 40 వేలు దాటేశాయి.

**మృతుల సంఖ్యను ఊహించలేం: ట్రంప్**

కరోనా రక్కసి గుప్పిట్లో చిక్కుకొని అమెరికా విలవిల్లాడుతోంది. రాబోయే రోజులు భయంకరంగా ఉండబోతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. వచ్చే కొద్ది వారాల్లో కోవిడ్–19 మృతులు భయంకరంగా నమోదవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయితే దేశాన్ని లాక్‌డౌన్ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అమెరికాని లాక్‌డౌన్ చేయడం వల్ల కరోనా వైరస్ వ్యాప్తి తీవ్రతను అరికట్టవచ్చు, దేశాన్ని నాశనం చేయలేమన్నారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యకి చికిత్స చెయ్యాలే తప్ప నివారణ మార్గాల వల్ల వచ్చే అదనపు ప్రయోజనం ఉండదని ట్రంప్ అభిప్రాయపడ్డారు.

**న్యూయార్క్‌కు మిలటరీ వైద్యులు**

కరోనా విశ్వరూపం చూస్తున్న న్యూయార్క్‌లో రోగులకు చికిత్స అందించడానికి వైద్యుల కొరత ఏర్పడింది. దీంతో లైసెన్స్ కలిగిన వైద్య సిబ్బంది సాయానికి రావాలంటూ నగర మేయర్ బిల్ పిలుపునిచ్చారు. ఏప్రిల్, మే నెలల్లో 45 వేల మంది వైద్య సిబ్బంది అవసరం ఉంటుందన్నారు. మిలటరీలో పని చేసే వైద్య సిబ్బందిలో వెయ్యి మందిని న్యూయార్క్‌కు పంపించారు. వెంటిలేటర్లకు కొరత ఏర్పడడంతో న్యూయార్క్ నగరానికి చైనా వెయ్యి వెంటిలేటర్లను పంపింది. 17 వేల వెంటిలేటర్లు అవసరం ఉందని మేయర్ అంటున్నారు.

| ప్రపంచ వ్యాప్తంగా మొత్తం కేసులు | మరణాలు | కోలుకున్న వారు |
|---|---|---|
| 12,53,043 | 68,153 | 2,57,199 |

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| 1. అమెరికా | 3,27,848 | 9,325 |
| 2. స్పెయిన్ | 1,30,759 | 12,418 |
| 3. ఇటలీ | 1,28,948 | 15,887 |
| 4. జర్మనీ | 98,765 | 1,524 |
| 5. ఫ్రాన్స్ | 89,953 | 7,560 |
| 6. చైనా | 81,669 | 3,329 |
| 7. ఇరాన్ | 58,226 | 3,603 |
| 8. యూకే | 47,806 | 4,934 |
| 9. టర్కీ | 27,069 | 574 |
| 10. స్విట్జర్లాండ్ | 21,100 | 685 |

- చైనాలో తాజాగా మరో 30 కేసులు నమోదయ్యాయి.
- వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి దుబాయ్ రెండు వారాలు లాక్‌డౌన్ విధించింది.
- పాకిస్తానీయులకు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందని, అయినా కరోనాని దీటుగా ఎదుర్కొంటామని ఆ దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అన్నారు. న్యూయార్క్‌ని చూసి అయినా ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాక్‌లో కరోనా కేసుల సంఖ్య 3 వేలకు చేరువలో ఉంది.
- కరోనా భయంతో ఈజిప్ట్ ప్రభుత్వం ఈస్టర్ ఉత్సవాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది.

**జిల్లా మార్కెటింగ్ కార్యాలయం, నిర్మల్**
బైల్‌బజార్, మెయిన్‌రోడ్, నిర్మల్ :: ఫోన్ నం.08734-248666
No.DMO/NML/MSP/PADDY/RABI/06/2019-20 **సంక్షిప్త టెండరు ప్రకటన** తేది: 05.04.2020
నిర్మల్ జిల్లాలోని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలకు దిగువ తెలిపిన ఎక్విప్‌మెంట్స్ / ఐటమ్స్ సరఫరా చేయుటకు సీల్డ్ కొటేషన్లు కోరబడుచున్నవి.
1. టర్పాలిన్స్ సంఖ్య - 2589
2. ఎలక్ట్రానిక్ వెయింగ్ స్కేల్స్ సంఖ్య - 76
3. వరి & ధాన్యాల కోసం డిజిటల్ మాయిశ్చర్ మీటర్లు సంఖ్య - 45
4. పవర్ ప్యాడి క్లీనర్స్ సంఖ్య - 82
ఆసక్తిగల సంస్థలు / తయారీదారులు రూ.2,000.00 (రెండువేల రూపాయలు మాత్రమే) చెల్లించి జిల్లా మార్కెటింగ్ కార్యాలయం, నిర్మల్ నుండి టెండరు షెడ్యూళ్లను పొందగలరు. సెక్యూరిటీ డిపాజిట్ నిమిత్తం District Marketing Officer, Nirmal పేరున డిమాండ్‌డ్రాఫ్ట్ రూపంలో చెల్లించిన బయానాను టెండర్లకు జతచేయవలెను మరియు కొటేషన్లను జిల్లా మార్కెటింగ్ కార్యాలయం, నిర్మల్ వద్ద ఉంచిన టెండరు బాక్సులో **09.04.2020న మ.3.00 గం.లోగా** దాఖలు చేయవలెను. ఏదేని ఇతర సమాచారాన్ని జిల్లా మార్కెటింగ్ కార్యాలయం, నిర్మల్ నుండి కార్యాలయ పనివేళలలో పొందవచ్చును.
**టెండరు వివరాలు:** టెండరు షెడ్యూలు అమ్మకం తేది: **07.04.2020 నుండి 09.04.2020 మ.12.00 గం. వరకు.** టెండర్ల దాఖలు కోసం చివరి తేది: **09.04.2020 మ.3.00 గం. వరకు.** టెండర్లు తెరుచు తేది: **09.04.2020 సా.4.00 గం.**
**సం/- జిల్లా మార్కెటింగ్ అధికారి, నిర్మల్** **సం/- అడిషనల్ కలెక్టర్, నిర్మల్**
DIPR RO.No.1084-PP/CL/Advt/1/2020-21, Dt: 05.04.2020

**వ్యవసాయ మార్కెటింగ్ శాఖ**
జిల్లా మార్కెటింగ్ కార్యాలయం :: ఆదిలాబాద్, ఫోన్ నం.08732-230669
No.DMO/ADB/MSP/13/2019-20 **సంక్షిప్త టెండరు ప్రకటన** తేది: 05.04.2020
ఆదిలాబాద్ జిల్లాలోని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలకు దిగువ తెలిపిన ఎక్విప్‌మెంట్స్ సరఫరా చేయుటకు సీల్డ్ కొటేషన్లు కోరబడుచున్నవి.

| క్ర.సం. | ఎక్విప్‌మెంట్/ఐటమ్ పేరు | స్పెసిఫికేషన్లు | కావలసిన యూనిట్లు | బయానా మొత్తం |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1. | టార్పాలిన్స్ | **టార్పాలిన్స్:-** 5 లేయర్ల HDPE ఫ్యాబ్రిక్ షీట్స్ సైజు 24 అ.x 18 అ. (250 GSM బ్లాక్, టేర్ రెసిస్టెంట్ స్ట్రెంత్‌తో పాటు హెవీడ్యూటీ 5 లేయర్స్ రగ్డ్. కనీసం 25 mm ఓవర్‌ల్యాప్ బిగించిన ఐలెట్స్ 120 CMతో హెమ్మింగ్ చేయబడిన మరియు తాడుతో బలోపేతం చేసిన హీట్ స్కేలిన్ అంచుతో పాటు చుట్టురా సైజులుగా కట్ చేసినవి. | 500 | 20,000 |

ఆసక్తిగల సంస్థలు / తయారీదారులు రూ.1000/ (ఒకవేయి రూపాయలు మాత్రమే) చెల్లించి జిల్లా మార్కెటింగ్ కార్యాలయం, ఆదిలాబాద్ నుండి టెండరు షెడ్యూళ్లను పొందగలరు. సెక్యూరిటీ డిపాజిట్ నిమిత్తం **Asst. Director of Marketing, Adilabad** పేరున డిమాండ్‌డ్రాఫ్ట్ రూపంలో చెల్లించిన బయానాను టెండర్లకు జతచేయవలెను మరియు కొటేషన్లను జిల్లా మార్కెటింగ్ కార్యాలయం, ఆదిలాబాద్ వద్ద ఉంచిన టెండరు బాక్సులో **08.04.2020న మ.3.00 గం.లోగా** దాఖలు చేయవలెను. ఏదేని ఇతర సమాచారాన్ని జిల్లా మార్కెటింగ్ కార్యాలయం, ఆదిలాబాద్ నుండి కార్యాలయ పనివేళలలో పొందవచ్చును. **టెండరు వివరాలు:** టెండరు షెడ్యూలు అమ్మకం తేది: **06.04.2020 ఉ.10.30 గం. నుండి.** టెండర్ల దాఖలు కోసం చివరి తేది: **08.04.2020 మ.3.00 గం. వరకు.** టెండర్లు తెరుచు తేది: **08.04.2020 సా.4.00 గం.**
**సం/- జిల్లా మార్కెటింగ్ అధికారి, ఆదిలాబాద్** **సం/- అడిషనల్ కలెక్టర్, ఆదిలాబాద్**
DIPR RO.No.1086-PP/CL/Advt/1/2020-21, Dt: 05.4.2020

సాక్షి 24|7 నల్లగొండ
NALGONDA DISTRICT
సోమవారం। 6। ఏప్రిల్। 2020

## కరోనా మీటర్
(5వ తేదీ వరకు)



ఇప్పటికే బర్మా దేశస్తులు ఇద్దరికి కరోనా పాజిటివ్ వచ్చిన విషయం తెలిసిందే. వీటికి తోడు తాజాగా ఆదివారం సూర్యాపేట పట్టణంలోని ఓ మెడికల్ షాప్‌లో పని చేసే వ్యక్తికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు తేలింది.




నల్లగొండలో

| | |
|---|---|
| మీర్‌బాగ్ కాలనీ | 4 |
| బర్కత్‌పుర | 2 |
| మాన్యంచెల్క | 2 |
| రెహమాన్‌బాగ్ | 1 |

## న్యూస్‌రీల్

### ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలి

**నల్లగొండ :** కరోనా వ్యాప్తి నియంత్రణ చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కు లు ధరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యద ర్శి సోమేశ్ కుమార్ కోరారు. ఆదివారం ఆయన హైదరాబాద్ నుంచి అన్ని కలెక్టర్లు, వైద్య అధికారులతో కరోనా వైరస్‌పై వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా మాట్లాడారు. కరోనా పాజిటివ్ కేసు లను గుర్తించిన ప్రాంతాల్లో వ్యాధి మరొకరికి సోకకుండా ఇళ్ల నుం చి ఎవరూ బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆ ప్రాం తాల్లోని వారికి అవసరమైన మందులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేసే ఏర్పాటు చేయాలని సూచించారు. కరోనా పాజిటివ్ వచ్చిన ప్రాంతాల్లో రెండుసార్లు కెమికల్ స్ప్రే చేయించాలని తెలిపారు. వైద్య బృందాలు ఇల్లిల్లూ తిరిగి ఎవరైనా జలుబు, దగ్గు, జ్వరం తో బాధపడుతుంటే పరిశీలించాలని ఆదేశిం చారు. కరోనాను నియంత్రించడంలో పనిచేస్తు న్న ముఖ్యమైన శాఖల అధికారులు, సిబ్బంది పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్ట ర్లను ఆదేశించారు. మర్కజ్‌కి వెళ్లి వచ్చిన పాజిటివ్ కేసులు తప్పనిసరిగా గాంధీ ఆస్పత్రికి పంపిం చాలని, నెగిటివ్ వచ్చిన వారిని ప్రభుత్వ క్వారన్‌టైన్‌లో ఉంచాలని, అలాగే ప్రైమరీ కాం టాక్ట్‌ను హోమ్ క్వారన్‌టైన్‌లో ఉంచాలని సూచించారు. కరోనా పాజిటివ్ వచ్చిన ప్రాం తాలను జియో ట్యాగింగ్ చేసి పంపించాలని చీఫ్ సెక్రటరీ సెక్రటరీ ఆదేశించారు. ఈ వీడి యో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ ప్రశాం త్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, తదితరులు హాజరయ్యారు.

### మేమున్నామంటూ..



**చిట్యాల :** లాక్‌డౌన్ నేపథ్యంలో పోలీసులు కొన్ని చోట్ల కొంత అతిగా ప్రవరిస్తున్నారం టూ.. విమర్శలు వస్తున్నా.. ఇదే సందర్భంలో వారు ఆపదలో ఉన్న వారికి వెంటనే అవసర మైన సహాయం చేయడానికి ముందుకు వస్తు న్నారు. చిట్యాల పట్టణంలోని బొడ్రాయి బజార్‌కు చెందిన బానోతు చిట్టి కూతురు శారద నిండు గర్భిణి. ఆదివారం శారదకు పురిటినొప్పులు రావడంతో.. ఏం చేయాలో పాలుపోని చిట్టి చిట్యాల పోలీసులకు సమా చారం అందించింది. వెంటనే ఏఎస్‌ఐ లిం గయ్య, హోంగార్డులు అమరోజు సత్యనారాయ ణ, మేడి యాదయ్యతో కలిసి చిట్టి ఇంటికి వెళ్లి శారదను పోలీసు వాహనంలోనే రామన్నపే టలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకా లంలో స్పందించి తన కూతురును ఆసుపత్రికి తరలించినందుకు పోలీసులకు చిట్టి కృతజ్ఞత లు తెలిపింది. గతవారం కూడా చిట్యాల పో లీసులు ఓ గర్భిణిని నల్లగొండలోని ప్రభుత్వా సుపత్రికి తరలించించారు. దీంతో చిట్యాల పో లీసుల తీరును పలువురు అభినందిస్తున్నారు.

### మరికొందరిని క్వారంటైన్ చేసేలా..

**మిర్యాలగూడ అర్బన్ :** మిర్యాలగూడ డివిజన్ లో ఢిల్లీ ప్రార్థనలకు హాజరైన వారు ఉండడం తో పాటు వారిలో కొందరికి కరోనా పాజిటివ్ రావడంతో అప్రమత్తమైన అధికారులు ముం దస్తు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఇప్ప టికే ఢిల్లీ ప్రార్థనలకు హాజరైన వారిని హైద రాబాద్‌కు తరలించడంతో పాటు వారి కుటుం బ సభ్యులు, బంధువులను క్వారంటైన్‌లో ఉం చిన విషయం విధితమే. కాగా గత పదిహేను రోజులుగా వారు కలిసిన వారు 570 మందిని గుర్తించిన అధికారులు అవసరమైతే వారంద రిని క్వారంటైన్ కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం మండలం లోని తుంగపాడు బంధం వద్ద గల మోడల్ పాఠశాలలో 24 గదులను సిద్ధం చేశారు. మొత్తం 72 మంది క్వారంటైన్‌లో ఉండేలా ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి ఈ కేంద్రం అం దుబాటులోకి వచ్చే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. అంతే కాకుండా 570 మందికి సరిపడా క్వారంటైన్ కేంద్రాలను అవంతీపురం, దామరచర్లలోని గురుకుల పాఠ శాలల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్య లు తీసుకున్నట్లు తెలిసింది.

### అంధుల అభ్యున్నతికి వెంకట్‌రెడ్డి కృషి

**రామగిరి (తిప్పర్తి) :** అంధుల అభ్యున్నతికి బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొ న్నారు. తిప్పర్తి మండలం బుసిరెడ్డిగూడేనికి చెందిన బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం రాత్రి మృతిచెందగా.. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపా రు. వెంకట్‌రెడ్డి ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్, ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లై ండ్, వ్యవస్థాపకుడు, ఆల్‌ఇండియా కాన్ఫెడరే షన్ ఆఫ్ ది బ్లైండ్ ఉపాధ్యక్షుడు వ్యవస్థాపకుడి గా పలు సేవలు అందించారని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు అంధుడయ్యాడని అయినా ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ లెక్చరర్‌గా పనిచేశాడని తెలిపారు.

నల్లగొండలోని రవీంద్రనగర్‌లో జాతీయ జెండా ముగ్గువేసి దీపాలు వెలిగించిన ప్రజలు




కుటుంబ సభ్యులతో కలిసి దీపాలతో మంత్రి జగదీశ్‌రెడ్డి



## ఐక్యతా దివ్వెలు

కరోనా మహమ్మారిని పారదోలేందుకు ప్రజలంతా ఒక్కటై ఆదివారం రాత్రి దీపాలు వెలిగించి ఐక్యతను చాటి చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు రాత్రి 9గంటల నుంచి 9.09 వరకు విద్యుత్ లైట్లు బంద్ చేసి దీపాలు, ప్రమిదలు, కొవ్వొత్తులు, టార్చిలైట్లు, మొబైల్ లైట్లు వెలిగించారు. కరోనాపై పోరాటంలో భాగస్వాములైన వైద్య, రక్షణ, పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలంతా జేజేలు పలికారు. కరోనా రక్కసిని తరిమికొట్టేందుకు ఐక్యంగా సాగుతామని చాటిచెప్పారు. - సాక్షి నెట్‌వర్క్

# లిక్కర్ జోరు..!

## గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న మద్యం దందా

- వైన్స్‌ల నుంచి రాత్రివేళ సరఫరా
- లాక్‌డౌన్‌లోనూ విచ్చలవిడిగా అమ్మకాలు
- గ్రామాల్లో యథావిధిగా బెల్టు షాపుల నిర్వహణ
- నాలుగింతలు ధర పెంచి విక్రయాలు
- లాక్‌డౌన్ నిబంధనలు పాటించని వైనం
- తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు



**హాలియా /మునుగోడు :** కరోనా వైరస్ నివారణకు ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించి మందులు, కూర గాయలు, నిత్యావసర వస్తువుల దుకాణాలు మినహా మిగతా అన్నింటిని మూసివేయించింది. ప్రజలంతా గుంపుగా ఉండకుండా చూడాలని సంక ల్పించింది. ఈ క్రమంలో జిల్లాలో బార్లు, వైన్‌షాపు లు కూడా మూతబడ్డాయి. ఇదే అదునుగా మద్యం ప్రియుల అవసరాలను ఆసరాగా చేసుకుని కొం దరు అక్రమంగా మద్యం విక్రయిస్తూ వేల రూపా యలు కూడబెట్టుకుంటున్నారు. లాక్‌డౌన్ సమ యంలో గ్రామాల్లోని బెల్టుషాపులకు సరఫరా చేశా రని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బెల్టుషాపు నిర్వాహకులు నాలుగింతల రెట్టింపు ధరలతో మద్యం విక్రయిస్తున్నారని, అయినా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోప ణలు వినిపిస్తున్నాయి.

**నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఇలా..**

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా, సాగర్, పెద్దవూర, నిడమనూరు, త్రిపురారం మండ లాలు, గ్రామాల్లో లిక్కర్ అమ్మకాలు జోరుగా సాగు తున్నాయి. నియోజకవర్గంలోని హాలియా పట్టణం లో పలు కిరాణం దుకాణాల్లో మద్యం డంప్ చేసి, రాత్రి సమయంలో గ్రామాల్లోని బెల్టుషాపులకు సర ఫరా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే విధంగా సాగర్, పెద్దవూర మండల కేంద్రంలో ఉన్న వైన్‌షాపుల్లో నిల్వ ఉన్న మద్యాన్ని లాక్‌డౌన్ సమయంలో గ్రామాల్లోని బెల్టుషాపులకు సరఫరా చేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజక వర్గంలో 15 వైన్స్‌షాపులు ఉన్నాయి. హాలియాలో ఐదు, పెద్దవూరలో మూడు, సాగర్‌లో రెండు, నిడ మనూరు రెండు, త్రిపురారంలో మూడు వైన్స్ షాపుల చొప్పున ఉన్నాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో ఈ వైన్స్‌షాపులను ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. అయితే హాలియా పట్టణంలో సాగర్ రోడ్డు సమీపం లో ఉన్న ప్రగతి వైన్స్‌షాపును సీజ్ చేయడకపోవడం తో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ అధికారులు ఆ షాపును సీజ్ చేసి కేసు నమోదు చేశారు. నియోజకవర్గంలోని హాలియా, పెద్దవూర, పట్టణ కేంద్రాల నుంచే అక్రమంగా మద్యం తర లిస్తున్నట్లు సమాచారం. మండల కేంద్రాల నుంచి తెల్లవారుజాము న, రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ఎవరికంటా పడకుండా తలిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఎక్కడికక్కడ పికెట్, చెక్‌పోస్టులు ఏర్పా టు చేసినా దొడ్డిదారిన మద్యం తరలిస్తున్నారు.

**మునుగోడు పరిసరాల్లో..**

చండూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం లో ఉన్న ఓ మద్యం దుకాణంలో పనిచేస్తున్న వ్యక్తి ఆ దుకాణంతో పాటు ఇతర దుకాణాల ద్వారా రాత్రి వేళ మునుగోడు, నాంపల్లి, చిట్యాల, నారాయణపురం తదితర మండలాలకు మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఎక్సైజ్ వైన్స్‌లను సీజ్ చేసినప్పటికీ.. వైన్స్‌కు వెనుక భాగంలో ద్వారం ఉంటే.. అక్కడి నుంచి మద్యం తీసి అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలిసింది. ఇలా ఈ నాలుగు మండ లాల్లో దాదాపు రోజూ రూ.50 లక్షలకు పైగా వ్యాపారం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ విష యాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. కనీసం ఏ దుకాణం నుంచి వస్తున్నాయో తెలుసు కోమని మద్యం సీసాలపై ఉండే బార్ కోడ్ ఫొటోలు తీసి వాట్సప్‌లో ఎక్సైజ్ అధికారులకు పంపినా.. ఇప్పటి వరకు ఆ దుకాణాన్ని కనుగొనలేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబం ధిత అధికారులు చొరవ తీసుకొని మద్యం దందాను అరికట్టాలని, నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



తిరుమలగిరిలో పోలీసులు స్వాధీనం చేస్తుకున్న మద్యం

### భారీగా మద్యం పట్టివేత

**తిరుమలగిరి (నాగార్జునసాగర్) :** మండలంలో భారీగా మద్యం పట్టుబడింది. పోలీసులు పలు దుకాణాలను తనిఖీ చేయగా.. సుమారు రూ.1.30ల లక్షల విలువైన మద్యాన్ని తిరుమల గిరి పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకు న్నారు. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వెన్నపూ సల నాగమ్మ మద్యం విక్రయిస్తుందనే విశ్వస నీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించగా ఆమె వద్ద 668 బీర్లు, 31 ఫుల్ బాటిళ్లు, 48 ఆఫ్ బాటిళ్లు, 300 క్వాటర్లు పట్టు బడ్డాయి. వీటి విలువ సుమారు రూ.1.30 లక్ష లు ఉంటుందని తెలిపారు. సదరు వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నిబంధనలకు విరు ద్ధంగా ఎవరైనా మద్యం అమ్మకాలు చేపడితే.. వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ గురునాథం, విజయ్, బాబురావు, నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.

### భారీగా ధర పెంచి విక్రయాలు..

లాక్‌డౌన్‌తో మద్యం దొరకక పోవడం.. పలుచోట్ల గుట్టుచప్పుడు కాకుండా మద్యం సరఫరా అవు తుండడంతో.. ప్రస్తుతం మద్యం ధరలు నింగినం టుతున్నాయి. రూ.100 ఉండే క్వాటర్ రూ.400, రూ.700 వరకు ఉండే ఫుల్ బాటిల్ ధరను రూ.1600 వరకు అమాంతంగా పెం చేశారు. వెయ్యి వరకు ఉం డే ఫుల్ బాటిల్ ధరను రూ.2,500 నుంచి రూ.3000 వరకు బ్లాక్‌లో విక్రయాలు జరుపుతు న్నారు. ఇదేమని అడిగితే మాకే అధిక ధరకు వస్తోందని.. ఇష్టం ఉం టే తీసుకోండి లేదం టే వెళ్లండని చెప్పు తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

### కేసులు నమోదు చేస్తాం



నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసు కోవడంతో పాటు, కేసులు నమోదు చేస్తాం. లాక్‌డౌన్ నేపథ్యంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే సమాచారం అందించాలి.

**- యమునాథర్‌రావు, ఎక్సైజ్ సీఐ, హాలియా**

### ముగ్గురిపై కేసులు నమోదు చేశాం

బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిపై ఇటీవల కేసులు నమోదు చేశాం. ఆ మద్యా న్ని పరిశీలించి ఏ దుకాణం నుంచి వచ్చిందో ఆరా తీస్తున్నాం. ఏ గ్రామంలోనైనా మద్యం విక్రయించ నట్లు సమాచారం అందితే.. వెంటనే వెళ్లి సీజ్ చేస్తున్నాం. మాతో పాటు సివిల్ పోలీసులు కూడా అక్ర మంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

**- చంద్రభానునాయక్, ఎక్సైజ్ సీఐ, చండూరు**

# కరోనా కట్టడి.. కట్టుదిట్టం..!

- మర్కజ్‌కు వెళ్లి వచ్చినవారు, ప్రైమరీ కాంటాక్ట్‌లో కరోనా పాజిటివ్ వచ్చిన వారికి జియో ట్యాగింగ్
- వీరి కదలికలు గమనిస్తున్న అధికారులు
- ఇంకా పెండింగ్‌లో 58 మంది వైద్య పరీక్షల రిపోర్టులు



కరోనా పాజిటివ్ వ్యక్తుల కుటుంబ సభ్యులను ఎంజీయూ క్వారంటైన్‌కు తరలిస్తున్న వైద్యులు

**సాక్షి ప్రతినిధి, నల్లగొండ :** కరోనా కట్టడికి అధికారు లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారు. మర్కజ్ వెళ్లివచ్చిన వారితో పాటు ప్రైమరీ కాంటాక్ట్‌లో ఉన్న వారికి జియో ట్యాగింగ్ చేసి.. వారి కదలికలను గమనిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో ఢిల్లీకి వెళ్లి వచ్చిన 52 మందికి జియో ట్యాగింగ్ చేయగా.. శుక్రవారం కరోనా పాజిటివ్ నిర్ధారణ అయిన నలుగురికి శనివారం జియోట్యాగింగ్ చేశారు. దీం తో వీరు ఎవరితోనూ కాంటాక్ట్ కాకుండా చూసి.. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటు న్నారు. ఇప్పటి వరకు జిల్లాకు చెందిన 11 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. కాగా జిల్లాలో మసీదు ల్లో ప్రార్థనలు చేసే బర్మాకు చెందిన 17 మందిలో ఇద్దరికి కరోనా పాజిటివ్ రాగా.. వారిని హైద రాబాద్‌లో బాలాపూర్ అధికారులకు అప్పగించిన విషయం తెలిసిందే.

**జిల్లాలో 56 మందికి జియో ట్యాగింగ్..**

జిల్లాలో ఇప్పటి వరకు అధికారులు 56 మందికి జియో ట్యాగింగ్ అమర్చారు. 52 మంది ఢిల్లీ మర్కజ్ ప్రార్థనలకు వెళ్లివచ్చిన వారిలో కరోనా పాజిటివ్ వచ్చినవారు కూడా ఉన్నారు. వారి కుటుంబ సభ్యులకు కూడా నలుగురికి కరోనా పాజిటివ్ వచ్చింది. దీంతో మొత్తం 56 మందికి అధికారులు జియోట్యాగింగ్‌ను అమర్చారు. కాగా జియో ట్యాగింగ్ ద్వారా మ్యాప్‌లో ఎప్పటికప్పుడు వారు ఎక్కడ ఉన్నారు. అనేది వారిని అధికారులు పరిశీలిస్తున్నారు. వారు ఇతరులను కలవకపోవడం వల్ల వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**34 మందిని ఎంజీయూ క్వారంటైన్‌కు తరలింపు..**

ఢిల్లీ వెళ్లివచ్చిన వారిలో పలువురికి కరోనా పాజిటివ్ రాగా.. వారి కుటుంబ సభ్యులైన నలుగు రికి కూడా పాజిటివ్ వచ్చింది. ఈ నలుగురిని కూడా హైదరాబాద్ చెస్ట్ ఆస్పత్రికి తరలించారు. మరో 34 మందిని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన క్వారంటైన్‌కు తరలించారు.

**130 మందికి రక్తనమూనాలు సేకరణ..**

ఢిల్లీ వెళ్లివచ్చిన వారితోపాటు వారు ప్రైమరీలో కలిసిన వారిని గుర్తించి ఇప్పటి వరకు 130 మంది నుంచి రక్తనమూనాలు సేకరించి కరోనా పరీక్షలు నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. అందులో 72 మంది పరీక్షల రిపోర్టులు వచ్చాయి. జిల్లాలో ఇప్పటివరకు ఢిల్లీ వెళ్లినవారికి ఏడుగురికి కరోనా సోకగా వారి కుటుంబ సభ్యులు నలుగురికి కరోనా నిర్ధారణ అయ్యింది. 58 మంది రిపోర్టులు రావాల్సి ఉంది. మరో 20 మంది రక్త నమూనాలు పంపేం దుకు చర్యలు తీసుకుంటున్నారు. నల్లగొండ నుంచి 8 మంది, మిర్యాలగూడ నుంచి 12 మంది రక్త నమూనాలు సేకరించి పంపనున్నారు.

**పరీక్షల నిర్వహణలో ఆలస్యం**

ప్రస్తుతం ప్రైమరీ కాంటాక్ట్ పరీక్షల రిపోర్టులు కొన్నిరావాల్సి ఉంది. వాటిలో పాజిటివ్ వస్తే సెకం డరీ కాంటాక్ట్‌లకు కూడా కరోనా పరీక్షలు చేయాల్సి ఉంటుందని.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కొండల్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో చాలా మంది మర్కజ్ వెళ్లివచ్చిన వారు ఉండడం వారిలో కూడా కొందరికి కరోనా పాజిటివ్ రావడం.. వారి కుటుం బ సభ్యులకు కూడా పరీక్షలు చేయాల్సి రావడం తో.. రిపోర్టులు రావడం ఆలస్యమవుతోందని తెలిపారు.

# లాక్‌డౌన్.. మరింత కఠినంగా



నల్లగొండలో రెడ్ జోన్‌గా ప్రకటించిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

**నల్లగొండ క్రైం :** కరోనా నివారణలో భాగంగా పోలీసులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసు కుంటున్నారు. జిల్లా కేంద్రంలో కరోనా కేసులు పెరిగే అవకాశం ఉండడంతో లాక్‌డౌన్ సమయా న్ని కుదించారు. ఆదివారం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే నిత్యావసర సరుకులు, కూర గాయల విక్రయానికి అనుమతిస్తారు. పట్టణంలో 11 మందికి కరోనా సోకడంతో పోలీస్‌లు ఎక్కడిక క్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు బంద్ చేశారు. అనవసరంగా రోడ్లపైకి వచ్చిన వారి వాహనాలను సీజ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. లాక్‌డౌన్ తర్వాత వీరిని అరెస్ చేసి జైలు పంపు తామని చెబుతున్నారు. పట్టణంలోని మాన్యంచె ల్క, బర్కత్‌పుర, మీర్‌బాగ్‌కాలనీ, రెహమాన్‌బాగ్ కాలనీకు చెందిన వారికి కరోనా పాజిటివ్ రావవ డంతో ఈ కాలనీలను కార్డెన్‌ఆఫ్‌గా ప్రకటించారు. కాలనీలను పోలీస్‌లు ఆదీనంలోకి తీసుకుని ఒక్కరు కూడా ఇంచి నుంచి బయటకు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కాలనీల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కుటుంబ సభ్యుల వివ రాలు సేకరిస్తున్నారు.

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 674 ▼ | 170 ▼ |
| 27,591 | 8,084 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

| సూచీ | ముగింపు | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 7,373 | ▼ | 114 |
| డోజోన్స్ | 21,053 | ▼ | 361 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 5,415 | ▼ | 64 |
| డాక్స్ | 9,526 | ▼ | 45 |
| షాంఘై | 2,764 | ▼ | 17 |
| నికాయ్ | 17,820 | ▲ | 2 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | థామస్‌కుక్ | 72.95 | 79.81 |
| £ | బ్రిటన్ పౌండ్ | థామస్‌కుక్ | 91.52 | 98.22 |
| € | యూరో | థామస్‌కుక్ | 79.91 | 86.38 |
| ¥ | జపాన్ ఎన్ (100) | థామస్‌కుక్ | 60.00 | 78.00 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | థామస్‌కుక్ | 43.90 | 48.47 |
| SS | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 51.66 | 55.89 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 19.28 | 21.15 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 19.42 | 22.06 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.62 | 11.38 |

# ఇన్వెస్ట్ చేయాలా..? విక్రయించాలా..?

- ముందు అత్యవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- ఆ తర్వాతే పెట్టుబడుల యోచన
- మిగులు నిల్వలుంటే ఈక్విటీలకు కేటాయించుకోవాలి
- 2008–09 తర్వాత అత్యంత ఆకర్షణీయ విలువలు
- మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ ఎంచుకోవచ్చు



**కరోనా వైరస్ ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. దేశాలన్నీ ఇప్పుడు ఈ వైరస్ నియంత్రణ కోసమే తమ శక్తియుక్తులన్నింటినీ వెచ్చిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థలకు 'లాక్' వేసి పోరాటం సాగిస్తున్నాయి!. మన దేశంలో ఏప్రిల్ 14 వరకు లాక్‌డౌన్‌ను అమలు చేస్తున్నారు. నిత్యావసర వస్తువులు, సేవలు మినహా మిగిలిన పరిశ్రమలు, వ్యాపారాలన్నీ మూతబడ్డాయి. దీంతో ఎంతోమంది జీవనోపాధి అనిశ్చితిలో పడింది. ఈ పరిణామాల ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లలో చూస్తూనే ఉన్నాం. ఇప్పటికే ప్రధాన సూచీలు వాటి గరిష్టాల నుంచి 35 శాతం పడిపోయాయి. విడిగా స్టాక్స్‌ను పరిశీలిస్తే 60 శాతానికి పైగా క్షీణించినవీ ఉన్నాయి. ఈ పరిస్థితులు ఇన్వెస్టర్లను ఆత్మరక్షణలోకి నెట్టేవే. అదనంగా ఇన్వెస్ట్ చేయాలా..? లేక ఉన్న పెట్టుబడులను వెనక్కి తీసేసుకోవాలా..? ఇలా ఎన్నో ప్రశ్నలు రావచ్చు. వాటికి నిపుణులు ఏమంటున్నారో చూద్దాం..**

## భయపడక్కర్లేదు...



తమ పెట్టుబడులను సమీక్షించుకునేందుకు ఇది మంచి సమయమని నిపుణులు సూచిస్తున్నారు. నిఫ్టీ 50 సూచీ గరిష్టం నుంచి 40 శాతం వరకు పడిపోయి గత వారం కొంత రికవరీ చూపించింది. నిజానికి ఈ తరహా భారీ కరెక్షన్‌ను 2008లోనూ చూశాం. అయినా ఇన్వెస్టర్లలో చాలా మంది ఈ తరహా సంక్షోభాలకు సన్నద్ధంగా లేరు. ఈ నేపథ్యంలో మార్కెట్ల పతనం చూసి భయపడిపోయి ఉన్న ఈక్విటీ పెట్టుబడులను అమ్మేసుకుని వెళ్లిపోవడం ఈ తరుణంలో చేయాల్సిన పని కాదంటున్నారు విశ్లేషకులు. ''నగదుకు అత్యవసరం లేకపోతే ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్స్‌లో తమ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)ను, సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) కొనసాగించుకోవాలి'' అని సృజన్ ఫైనాన్షియల్ అడ్వైజర్స్ వ్యవస్థాపకురాలు దీపాలిసేన్ పేర్కొన్నారు. ఈ రెండూ కొనుగోలు ఖర్చును సగటుగా మారుస్తాయని, మార్కెట్ కరెక్షన్‌లో మరిన్ని యూనిట్లను సమకూర్చుకోవచ్చని ఆమె సూచించారు. ఒకవేళ ఉద్యోగం కోల్పోవడం వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైతే అప్పుడు ఈక్విటీ ఫండ్స్‌లో పెట్టుబడులను వెనక్కి తీసుకోవడాన్ని పరిశీలించొచ్చన్నారు. అది కూడా బ్యాంకు సేవింగ్స్ ఖాతా మొత్తం ఖాళీ అయ్యి, డెట్ ఫండ్స్, ఇతర నిల్వలన్నీ అడుగంటిన తర్వాతే ఈక్విటీ పెట్టుబడుల ఉపసంహరణను పరిశీలించాలని సూచించారు. మ్యూచువల్ ఫండ్స్‌లో ఏక మొత్తంలో పెట్టుబడులను కూడా ఈ తరుణంలో చేసుకోవచ్చని, కాకపోతే ఒకే విడత కాకుండా పలు విడతలుగా చేసుకోవాలని ప్లాన్‌రూపీ ఇన్వెస్ట్‌మెంట్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు అమోల్‌జోషి సూచించారు.

## అత్యవసరాలు చూసుకోవాలి...

ఈ సమయంలో జీవన అవసరాల కోసం నిధులు కావాల్సిన వారు ఈక్విటీ పెట్టుబడులను వెనక్కి తీసుకోవడానికి బదులు ఈపీఎఫ్ బ్యాలన్స్‌ను కొంత వెనక్కి తీసుకోవడాన్ని తాను సూచిస్తానని మ్యాక్స్ సెక్యూర్ ఫైనాన్షియల్ ప్లానర్స్ వ్యవస్థాపకుడు ప్రకాశ్ ప్రహరాజ్ తెలిపారు. ఈపీఎఫ్ సభ్యులు తమ భవిష్య నిధి నుంచి 75 శాతాన్ని లేదా మూడు నెలల బేసిక్ వేతనం, డీఏ ఈ రెండింటిలో ఏది తక్కువ మొత్తం అయితే ఆ మేరకు ఉపసంహరించుకోవడానికి ప్రభుత్వం అనుమతించిన విషయం తెలిసిందే. కరోనా వైరస్, లాక్‌డౌన్ సమీప కాలంలో వృద్ధి అవకాశాలను దెబ్బతీయగా.. దీర్ఘకాలంలో మాత్రం ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపనలు, వైరస్ నివారణ చర్యలతో పరిస్థితులు తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయని ఎక్కువ మంది అంచనా వేస్తున్నారు. ఆర్థిక వృద్ధి పట్ల ఉన్న భయాలు ఈక్విటీ మార్కెట్లను ప్రస్తుతం చౌకగా మార్చేశాయని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ పేర్కొంది. పీఈ, పీబీవీ, జీడీపీలో మార్కెట్ క్యాప్ కొలమానాల ఆధారంగా ఈ సంస్థ రూపొందించిన వ్యాల్యుయేషన్ ట్రాకర్ మార్చి 23న 72.6 స్థాయికి చేరింది. అంటే దూకుడుగా పెట్టుబడులు పెట్టుకోవచ్చన్నది దీని సంకేతం. చివరిగా ఈ స్థాయిలో వ్యాల్యుయేషన్ ట్రాకర్ కనిపించింది 2008–09లోనే కావడం గమనార్హం. మిగులు నిధులు కలిగిన వారు, రోజువారీ ఖర్చులకు సరిపడా పక్కన పెట్టేసి, అలాగే అత్యవసర పరిస్థితులకు కొంత కేటాయించుకున్న తర్వాత.. మిగిలిన మొత్తాన్ని ఈక్విటీల కోసం కేటాయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే, తమ ఆర్థిక లక్ష్యాలను చేరుకునేందుకు పెట్టుబడుల కేటాయింపు దోహదపడుతుందా? లేదా అని ఓ సారి సమీక్షించుకుని, అవసరమైతే మార్పులు కూడా చేసుకోవాలి.



## మ్యూచువల్ ఫండ్స్ మార్గం..

మార్కెట్ నిపుణులు, విశ్లేషకులను ప్రశ్నిస్తే ఎక్కువ మంది నుంచి వచ్చే స్పందన ఈక్విటీల్లో పెట్టుబడులకు ఇది మంచి అనుకూల సమయమనే. ఆకర్షణీయమైన పెట్టుబడుల అవకాశాల కోసం వేచి చూసేవారు, దీర్ఘకాలం కోసం పెట్టుబడులు పెట్టాలనుకునే వారు సిప్ మార్గాన్ని ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. స్టాక్స్ ధరల్లో దిద్దుబాటుతో అవి చాలా ఆకర్షణీయంగా మారాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హెల్త్‌కేర్, టెలికం రంగాలు ప్రస్తుత పరిస్థితుల్లో రాణించగలవన్న అంచనాతో ఉన్నారు. ఇన్వెస్టర్లు ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్, ఇండెక్స్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలని, వీటిల్లో లిక్విడిటీ మెరుగ్గా ఉంటుందని నిప్పన్ ఇండియా మ్యూచువల్ ఫండ్ ఈడీ, సీఈవో సందీప్‌సిక్కా తెలిపారు. మొదటి సారి ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్న వారికి, సీజన్ వారీగా ఇన్వెస్ట్ చేసే వారికి ఇండెక్స్ ఫండ్స్ అనుకూలమైనవిగా సిక్కా పేర్కొన్నారు. యాక్టివ్‌గా నిర్వహణతో కూడిన ఫండ్స్‌తో పాటు, ఈటీఎఫ్, ఇండెక్స్ ఫండ్స్‌ను వ్యూహాత్మకంగా ఎంచుకోవాలన్నారు. ''మార్కెట్లు రికవరీ అయినప్పుడు ముందుగా సూచీల్లోనే అది ప్రతిఫలిస్తుంది. ప్రతీ పతనం తర్వాత బలమైన రికవరీ ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈటీఎఫ్‌లు చక్కని ఆప్షన్'' అని సిక్కా వివరించారు.

## ఈక్విటీల్లో పెట్టుబడులు..

ప్రస్తుత తరుణంలో ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో పెట్టుబడులు కొనసాగించుకోవాలని, మిగులు నిధులు ఉంటే దీర్ఘకాలం కోసం క్రమంగా ఇన్వెస్ట్ చేసుకోవాలని యస్ అస్సెట్ మేనేజ్‌మెంట్ సీఈవో కన్వర్ వివేక్ సూచించారు. ''స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసేందుకు బేర్ మార్కెట్లు ఎంతో అనుకూలమైనవి. మార్కెట్ల పనితీరు దారుణంగా ఉందంటే మధ్య కాలం నుంచి దీర్ఘకాలానికి మంచి రాబడులకు అవకాశం ఉన్నట్టే'' అని ఆశికా వెల్త్ అడ్వైజర్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో అమిత్‌జైన్ అభిప్రాయపడ్డారు. ''ఇన్వెస్టర్లు తమ దగ్గరున్న నిధుల్లో 40 శాతాన్ని ఆర్బిట్రేజ్ ఫండ్స్‌కు కేటాయించుకోవాలి. ఇవి 7–8 శాతం వరకు రాబడులను ఇస్తాయి. మిగిలిన 60 శాతం నిధులను మిడ్‌క్యాప్, మల్టీక్యాప్ ఫండ్స్‌లో వచ్చే ఆరు నెలల కాలంలో క్రమంగా ఇన్వెస్ట్ చేసుకోవాలి'' అని అమిత్‌జైన్ సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో హెల్త్‌కేర్ రంగంలోని కంపెనీలు, ముఖ్యంగా డయాగ్నస్టిక్స్ కంపెనీలు మంచి పనితీరు చూపిస్తాయని పేర్కొన్నారు. అందరూ ఇంటికే పరిమితం కావడం, ఇంటి నుంచే పని చేస్తున్నందున డేటాకు డిమాండ్ భారీగా ఉంటుందని కనుక టెలికం కంపెనీలను సైతం పెట్టుబడులకు పరిశీలించొచ్చని సూచించారు. అలాగే, ఎఫ్‌ఎంసీజీ, రియల్ ఎస్టేట్ రంగాలపై ప్రస్తుత పరిస్థితుల ప్రభావం తక్కువే ఉంటుందన్నారు.

# భారత ఎకానమీకి కరోనా ముప్పు

### ఆర్థికవేత్త జీన్ డ్రీజ్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్‌ను మరింత కాలం కొనసాగించిన పక్షంలో భారత ఆర్థిక వ్యవస్థ పరిస్థితులు మరింత దిగజారే ముప్పు ఉందని ప్రముఖ ఆర్థికవేత్త జీన్ డ్రీజ్ అభిప్రాయపడ్డారు. లాక్‌డౌన్‌తో ఇప్పటికే దేశంలో పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆయన చెప్పారు. లాక్‌డౌన్ విషయాన్ని పక్కన పెట్టినా అంతర్జాతీయ మాంద్య ప్రభావాలు సైతం భారత ఎకానమీపై ప్రతికూలంగా ఉండవచ్చని పేర్కొన్నారు. కరోనావైరస్ వ్యాప్తితో దేశీయంగా కొన్ని రంగాలు కుదేలైనప్పటికీ.. సంక్షోభ సమయంలో కూడా మెడికల్ కేర్ వంటి కొన్ని విభాగాలు వృద్ధి చెందుతున్నాయని చెప్పారు. అయితే, కొన్ని రంగాలు సరిగ్గా లేకపోతే మిగతా రంగాలు మనలేవన్నారు. 'సైకిల్ టైరుకు పంక్చర్ పడితే ఒక్క చక్రంతో ఎలాగైతే ముందుకు వెళ్లలేదు కదా. అలాగే, లాక్‌డౌన్ కారణంగా సంక్షోభం కొనసాగిన పక్షంలో అది బ్యాంకింగ్ వ్యవస్థ సహా ఎకానమీలోని మిగతా రంగాలన్నింటినీ దెబ్బతీస్తుంది' అని డ్రీజ్ చెప్పారు. లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వలస కార్మికులంతా స్వస్థలాలకు చేరుకునేందుకు ప్రయత్నిస్తారని, కొంత కాలం దాకా మళ్లీ వలస వెళ్లకపోవచ్చని అభిప్రాయపడ్డారు. స్వంతంగా పొలాలు ఉన్న వారికి తప్ప స్వస్థలాల్లో ఉపాధి దొరికే పరిస్థితి లేదని చెప్పారు. మరోవైపు, వలస కార్మికులు వెళ్లిపోవడంతో వారిపై ఎక్కువగా ఆధారపడిన రంగాల్లో కార్మికుల కొరత ఏర్పడుతుందన్నారు.

### బీమా పాలసీదార్లకు ఐఆర్‌డీఏఐ ఊరట

# ప్రీమియంల చెల్లింపునకు మరో 30 రోజుల వ్యవధి




**న్యూఢిల్లీ:** కరోనావైరస్ కట్టడిపరమైన లాక్‌డౌన్ అమలవుతున్న నేపథ్యంలో జీవిత బీమా పాలసీదారులకు ప్రీమియంల చెల్లింపు విషయంలో వెసులుబాటునిస్తూ బీమా రంగ అభివృద్ధి, నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ నిర్ణయం తీసుకుంది. మార్చి, ఏప్రిల్‌లో కట్టాల్సిన రెన్యువల్ ప్రీమియంలకు సంబంధించి పాలసీదారులకు మరో 30 రోజుల వ్యవధి ఉంటుందని వెల్లడించింది. జీవిత బీమా సంస్థలు, లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ విజ్ఞప్తుల మేరకు తాజా నిర్ణయం తీసుకుంది. ఆరోగ్య బీమా, వాహన థర్డ్ పార్టీ బీమా పాలసీలకు ఐఆర్‌డీఏఐ ఇప్పటికే ఈ వెసులుబాటు ప్రకటించింది. మార్చి 25 – ఏప్రిల్ 14 మధ్య కట్టాల్సిన మోటార్ థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలను ఏప్రిల్ 21లోగా చెల్లించవచ్చని వెసులుబాటు ఇచ్చింది. ఈ వ్యవధిలో రిస్క్ కవర్ కొనసాగుతుందని పేర్కొంది. మరోవైపు, నియంత్రణ సంస్థకు బీమా రంగ సంస్థలు సమర్పించాల్సిన రిటర్న్ల విషయంలోనూ మరికాస్త వ్యవధినిచ్చింది. నెలవారీ రిటర్న్లకు అదనంగా 15 రోజులు, త్రైమాసిక, అర్ధ సంవత్సర, వార్షిక రిటర్నులు సమర్పించేందుకు 30 రోజుల వ్యవధి లభిస్తుంది.

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 06-4-2020

| | |
|---|---|
| విశాఖ | 345–00 |
| చిత్తూరు | 388–00 |
| వరంగల్ | 348–00 |
| గోదావరి | 345–00 |
| విజయవాడ | 345–00 |
| 5-4-2020 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 345–00 |

# కరోనా వార్తలే కీలకం

- ఈ వారంలో మూడు రోజులే ట్రేడింగ్
- మహావీర్ జయంతి, గుడ్‌ఫ్రైడే కారణంగా నేడు, శుక్రవారం మార్కెట్లు సెలవు

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ కేసుల పోకడను బట్టే దేశీయంగా గానీ, అంతర్జాతీయంగా గానీ ఈ వారం స్టాక్ మార్కెట్ల కదలికలు ఉంటాయని నిపుణులంటున్నారు. సెన్సెక్స్, నిఫ్టీలు తీవ్రమైన ఒడిదుడుకులకు గురవుతాయని వారంటున్నారు. దేశీ, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి, డాలర్‌తో రూపాయి మారకం విలువ కదలికలు, ముడి చమురు ధరల గమనం....ఈ అంశాలు కూడా ఈ వారం మార్కెట్‌పై ప్రభావం చూపుతాయని విశ్లేషణ.

**ఫిచ్ అంచనా ప్రభావం!:** 2020–21లో భారత్ జీడీపీ వృద్ధి రేటు 2 శాతానికి పడిపోతుందన్న ఫిచ్ అంచనా మార్కెట్‌పై ప్రభావం చూపవచ్చు. నేడు వెలువడే (సోమవారం) సేవల రంగం పీఎమ్ఐ గణాంకాలు, 9న ఫిబ్రవరి నెల పారిశ్రామికోత్పత్తి గణాంకాలు మార్కెట్‌పై ప్రభావం చూపుతాయి.



**దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు మంచి అవకాశం....** కాగా కరోనా వైరస్ కేసులను బట్టే దేశీ, విదేశీ స్టాక్ మార్కెట్ల తీరు ఉంటుందని మోతిలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎనలిస్ట్ సిద్ధార్థ ఖేమ్కా చెప్పారు. మార్కెట్ ఇప్పటికే చెప్పుకోదగిన స్థాయిలో కరెక్షన్‌కు గురయిందని, దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు ఇది మంచి అవకాశమని అభిప్రాయపడ్డారు.

మహావీర్ జయంతి సందర్భంగా నేడు(సోమవారం) సెలవు. అలాగే గుడ్‌ఫ్రైడే (ఈ నెల 10న) సందర్భంగా కూడా స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్ జరగదు. దీంతో ఈ వారంలో మూడు రోజులే ట్రేడింగ్ జరగనున్నది.

**భారీ విదేశీ నిధులు వెనక్కి..:** కరోనా వైరస్ కల్లోలం ప్రపంచవ్యాప్తంగా సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో విదేశీ ఇన్వెస్టర్లు మన క్యాపిటల్ మార్కెట్ నుంచి గత నెలలో రూ.1.1 లక్షల కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. ఈక్విటీ మార్కెట్ నుంచి రూ.61,973 కోట్లు, బాండ్ మార్కెట్ నుంచి రూ.56,211 కోట్లు వెరసి రూ.1.18,184 కోట్ల పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. విదేశీ ఇన్వెస్టర్లు ఈ స్థాయిలో పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం బహుశా ఇదే మొదటిసారి.

# లాక్‌డౌన్‌తో ఉద్యోగాలకు ముప్పు

### సీఐఐ సీఈవోల సర్వేలో వెల్లడి

**న్యూఢిల్లీ:** కరోనావైరస్ వ్యాప్తి, లాక్‌డౌన్‌తో దేశ ఎకానమీపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోంది. వీటితో భారీగా ఆదాయాలు, డిమాండ్ పడిపోవడంతో పాటు గణనీయంగా ఉద్యోగాల కోతలు కూడా ఉంటాయని కార్పొరేట్లు భావిస్తున్నారు. కంపెనీల సీఈవోలతో పరిశ్రమల సమాఖ్య సీఐఐ నిర్వహించిన ఆన్‌లైన్ సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. వివిధ రంగాల సంస్థలకు చెందిన సుమారు 200 మంది సీఈవోలు ఇందులో పాల్గొన్నారు. 'గత త్రైమాసికంతో (జనవరి–మార్చి) పోలిస్తే ప్రస్తుత క్వార్టర్‌లో (ఏప్రిల్–జూన్) ఆదాయాలు 10 శాతం, లాభాలు 5 శాతం పైగా తగ్గిపోతాయని మెజారిటీ సంస్థలు భావిస్తున్నాయి. జీడీపీ వృద్ధిపై కరోనా ఏ మేరకు ప్రభావం చూపబోతోందన్నది ఇది తెలియజేస్తోంది. సర్వేలో పాల్గొన్న 52 శాతం సంస్థలు.. తమ తమ రంగాల్లో గణనీయంగా ఉద్యోగాల్లో కోతలు ఉంటాయని అంచనా వేస్తున్నాయి' అని సీఐఐ వెల్లడించింది.

# సెన్సెక్స్ కీలకస్థాయి 27,735 పాయింట్లు

**మార్కెట్ పంచాంగం**

కరోనావైరస్ వివిధ దేశాల్లో ఉధృతమవుతున్న నేపథ్యంలో గతవారం ప్రపంచ ప్రధాన ఈక్విటీ మార్కెట్లన్నీ నష్టాల్ని చవిచూడగా, భారత్ సూచీల నష్టం అధికంగా వుంది. ఉదాహరణకు అమెరికా ఎస్ అండ్ పీ–500 సూచి రికార్డు గరిష్టం నుంచి ఇప్పటివరకూ 26.67 శాతం పతనంకాగా, ఇటీవలి కనిష్ట స్థాయి నుంచి 13.50 శాతం పెరిగివుంది. ఇదే మన నిఫ్టీ–50 సూచి రికార్డు గరిష్టం నుంచి 35 శాతం నష్టపోగా, మార్చి 24నాటి కనిష్టం నుంచి ఇప్పటివరకూ రికవరీ అయ్యింది 7.62 శాతమే. భారత్ సూచీల నష్టం ఎక్కువగా వుండటానికి, రికవరీ తక్కువగా వుండటానికి అధిక వెయిటేజి కలిగిన బ్యాంకింగ్ షేర్లే ప్రధాన కారణం. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ జనవరిలో సాధించిన రికార్డు గరిష్టం నుంచి 48 శాతం పడిపోయింది. వచ్చే కొద్దివారాల్లో బ్యాంకింగ్ షేర్లు కోలుకోవడం లేదా కొత్త లీడర్లు ఆవిర్భవిస్తేనే మార్కెట్ గణనీయంగా పుంజుకునే అవకాశం వుంటుంది. ఇక మన సూచీల స్వల్పకాలిక సాంకేతికాలు ఇలా వున్నాయి.....




### సెన్సెక్స్ సాంకేతికాంశాలు...

ఏప్రిల్ 3తో ముగిసిన నాలుగురోజుల ట్రేడింగ్‌వారంలో 29,770 పాయింట్ల గరిష్టస్థాయి నుంచి 27,500 పాయింట్ల కనిష్టస్థాయికి పతనమైన బీఎస్‌ఈ సెన్సెక్స్ చివరకు అంతక్రితం వారం ముగింపుతో పోలిస్తే 2,225 పాయింట్ల భారీనష్టంతో 27,591 పాయింట్ల వద్ద ముగిసింది. మార్చి 24–27 తేదీల మధ్య 25,639 పాయింట్ల నుంచి 31,126 పాయింట్ల వరకూ జరిగిన ర్యాలీకి 61.8 శాతం రిట్రేస్‌మెంట్ స్థాయి 27,735 పాయింట్లు సెన్సెక్స్‌కు ఈ వారం కీలకం. ఈ స్థాయి దిగువన తొలి మద్దతు 26,835 పాయింట్ల వద్ద లభిస్తోంది. ఈ స్థాయిని కోల్పోతే క్రమేపీ 26,360 పాయింట్ల వరకూ పడిపోవొచ్చు. పైన ప్రస్తావించి కీలకస్థాయిపైన సెన్సెక్స్ స్థిరపడితే తొలుత 28,075 పాయింట్ల వద్దకు చేరవచ్చు. అటుపైన ముగిస్తే 28,670 పాయింట్ల వరకూ పెరగవచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే 29,770 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు.

### నిఫ్టీ ప్రధానస్థాయి 8,095 ...

క్రితంవారం ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 576 పాయింట్ల భారీ నష్టాన్ని చవిచూసి 8,084 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ మార్చి చివరివారంలో 7,511 పాయింట్ల నుంచి 9,039 పాయింట్ల వరకూ జరిపిన రిలీఫ్‌ర్యాలీకి 61.8 శాతం రిట్రేస్‌మెంట్ స్థాయి అయిన 8,095 పాయింట్ల స్థాయి ఈ వారం కీలకం. ఈ స్థాయి దిగువన నిఫ్టీకి 7,845 పాయింట్ల వద్ద తొలి మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును కోల్పోతే 7,500 పాయింట్ల స్థాయిని మరోదఫా పరీక్షించవచ్చు. ఈ వారం 8,095 పాయింట్లపైన నిఫ్టీ స్థిరపడితే తొలుత 8,200 పాయింట్ల వద్దకు చేరవచ్చు. అటుపైన 8,360 పాయింట్ల వరకూ పెరిగే అవకాశం వుంటుంది. ఈ స్థాయిని దాటితే క్రమేపీ 8,680 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు.




– పి. సత్యప్రసాద్

# ఇప్పుడు కొత్త సిప్ మొదలు పెట్టవచ్చా ?




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

**ఫ్రాంక్లిన్ ఇండియా ఫీడర్ ఫ్రాంక్లిన్ యూఎస్ అపర్చునిటీస్ ఫండ్ ద్వారా అమెరికా మార్కెట్లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. ఇది సరైన నిర్ణయమేనా ?**

–అలేఖ్య, హైదరాబాద్

మ్యూచువల్ ఫండ్ల ద్వారా విదేశీ మార్కెట్లలో ముఖ్యంగా అమెరికా లాంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తే మంచిదేనని నా అభిప్రాయం. మన మార్కెట్‌తో పాటు ఇతర మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తే, డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు పొందవచ్చు. అయితే ప్రస్తుతం కరోనా వైరస్ కల్లోలంతో ప్రపంచవ్యాప్తంగా అన్ని మార్కెట్లు పతన బాటలోనే ఉన్నాయి. మన స్టాక్ మార్కెట్ 30 శాతం మేర పతనమైంది. అమెరికా స్టాక్ సూచీలు కూడా బాగానే నష్టపోయాయి. కరెన్సీ ఒడిదుడుకుల ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే ఫ్రాంక్లిన్ ఇండియా ఫీడర్ ఫ్రాంక్లిన్ యూఎస్ ఆపర్చునిటీస్ ఫండ్ ద్వారా అమెరికా మార్కెట్లో ఇన్వెస్ట్ చేయడం సరైన నిర్ణయమే. ఐదు నుంచి పదేళ్ల కాలం పాటు ఈ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయగలిగితే మీకు మంచి రాబడులే వస్తాయి.

**ప్రస్తుత పతనం నుంచి మార్కెట్ కోలుకోవడం ఎప్పుడు మొదలవుతుంది ? ప్రస్తుతం మార్కెట్ బాగా నష్టపోయిన నేపథ్యంలో భారీ మొత్తంలో ఒకేసారి ఇన్వెస్ట్ చేయవచ్చా ?**

–వెంకట్, విజయవాడ

ప్రస్తుత పతనం నుంచి మార్కెట్ కోలుకోవడం ఎప్పుడు మొదలవుతుందనే విషయమై సరైన అంచనాలు లేవు. మూడు, నాలుగు నెలల్లోపే మార్కెట్ కోలుకోవచ్చు. లేదా కనీసం ఏడాది–ఏడాదిన్నర వరకూ సమయం పట్టవచ్చు. మార్కెట్ రికవరీని అంచనా వేయడఢం కష్టసాధ్యమైన విషయమే కాకుండా అసాధ్యమైన విషయం కూడా. కరోనా వైరస్ ఇప్పుడిప్పుడే తన విశ్వరూపం చూపిస్తోంది. భారీ జనాభా, వైద్య సౌకర్యాలు అరకొరగా ఉన్న మన దేశంలో కరోనా వైరస్ ప్రబలితే పరిణామాలు దారుణంగా ఉంటాయి. మొత్తం మీద పరిస్థితులన్నీ చక్కబడి, వ్యా పారాలన్నీ సాధారణ స్థాయికి రావడానికి కనీసం ఏడాది, ఏడాదిన్నర సమయం పట్టవచ్చు. మార్కె ట్ ఎంతగా పతనమైనా, భారీ మొత్తంలో ఒకేసారి ఇన్వెస్ట్ చేయడం సరైనది కాదు. మీరు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్న మొత్తాన్ని కనీసం 12 భాగాలు చేసి, నెలకు కొంత చొప్పున ఇన్వెస్ట్ చేయండి. దీంతో యావరేజింగ్ ప్రయోజనాలు పొందవచ్చు.

**స్టాక్ మార్కెట్ బాగా పతనమైన ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త సిప్(సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్)ను మొదలు పెట్టాలనుకుంటున్నాను. మార్కెట్ క్షీణపథంలో ఉన్నప్పుడు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సమంజసమేనా ?**

–ఇంతియాజ్, హైదరాబాద్

మార్కెట్ పతన బాటలో ఉన్నా, పెరుగుతున్నా.. ఎప్పుడైనా సరే, కొత్త సిప్(సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) మొదలు పెట్టవచ్చు. మార్కెట్ బాగా నష్టపోయిన ప్రస్తుత తరుణంలో సిప్‌లను కొనసాగించడమే ఉత్తమమైనది అనుకుంటే, కొత్త సిప్‌ను ఆరంభించడం అత్యుత్తుమమైన పెట్టుబడి వ్యూహమేనని చెప్పవచ్చు. మార్కెట్ ఇంకా పతనమైనప్పుడు కొత్త సిప్ మొదలుపెడదాంలే అని చాలామంది ఇన్వెస్టర్లు అనుకుంటారు. కానీ అది సరైనది కాదు. మార్కెట్ ఏ స్థాయి వరకూ పతనమవుతుందో ఎవ్వరూ అంచనా వేయలేరు. పతన సమయంలో ఇన్వెస్ట్ చేస్తేనే మనకు ఎక్కువ యూనిట్లు లభిస్తాయి. ఏతావాతా, మార్కెట్ ఎలా ఉంది అని ఆలోచించకుండా, మీ ఆర్థిక లక్ష్యాలకనుగుణంగా సిప్‌లను కొనసాగించండి.



## ఇది కరోనాను చంపే గన్..

ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రపంచానికి దేని అవసరం ఎక్కువ ఉందో సింబాలిక్‌గా చెబుతున్న చిత్రమిది.. ఆదివారం ఢిల్లీలో నిరాశ్రయులకు ఉచిత భోజనం అందిస్తున్న కేంద్రం వద్ద విధుల్లో ఉన్న ఓ పోలీసు గన్‌బెల్ట్‌లో తుపాకీకి బదులు శానిటైజర్ పెట్టుకున్న దృశ్యం..

# మ.. మ.. మాస్క్!

**కరోనాతో విరివిగా మాస్కుల వాడకం ➤ సామర్థ్యాన్ని బట్టి మాస్కుల్లో రకాలు**

**సాక్షి, హైదరాబాద్:** కరోనా మహమ్మారి వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా మాస్కులకు డిమాండ్ పెరిగింది. ఒకప్పుడు నగరాల్లో కాలుష్యాన్ని తట్టుకునేందుకు, డస్ట్ ఎలర్జీ ఉన్నవారు, సిమెంట్, ఫార్మా కంపెనీల్లో పని చేసేవారు మాత్రమే మాస్కులు వినియోగించేవారు. కానీ, ప్రస్తుతం కరోనా పాజిటివ్ కేసులకు చికిత్స చేసే వైద్యులు, 24 గంటల పాటు గస్తీ విధులు నిర్వహిస్తున్న పోలీసులు, గ్రామం నుంచి పట్టణం దాకా పౌరులందరూ మాస్కులు ధరిస్తున్నారు. ఇందులో అభివృద్ధి చేసిన విధానం, దుమ్ము, ధూళి, బ్యాక్టీరియా, వైరస్‌లను అడ్డుకునే సామర్థ్యాన్ని బట్టి అనేక రకాలు ఉన్నాయి. బెంగళూరుకు చెందిన వర్సో హెల్త్ కేర్.కామ్ అందించిన వివరాల ప్రకారం.. ఏ మాస్క్ దేనిని ఎంత మేర అడ్డుకుంటుందో చూద్దామా..?



|  | ఎన్-95 మాస్క్ | సర్జికల్ మాస్క్ | ఎఫ్ఎఫ్‌పీ1 మాస్క్ | యాక్టివేటెడ్ కార్బన్ మాస్క్ | క్లాత్ మాస్క్ | స్పాంజ్ మాస్క్ |
|---|---|---|---|---|---|---|
| వైరస్ | 95% | 95% | 95% | 10% | 0% | 0% |
| బ్యాక్టీరియా | 100% | 80% | 80% | 50% | 50% | 5% |
| దుమ్ము | 100% | 80% | 80% | 50% | 50% | 5% |
| పుప్పొడి | 100% | 80% | 80% | 50% | 50% | 5% |

# నేరాల రేటు 'డౌన్'

**సాక్షి, హైదరాబాద్:** లాక్‌డౌన్ కారణంగా రాష్ట్రంలో నేరాలు గణనీయంగా తగ్గాయి. సాధారణ రోజుల కంటే కాస్త అటూ ఇటుగా 33 నుంచి 55 శాతం తగ్గదల నమోదైంది. రోడ్లపై, వీధుల్లో జనసంచారం లేకపోవడం నేరాలు తగ్గడానికి ప్రాథమిక కారణమైతే.. ప్రతీ వీధిలోనూ పోలీసు గస్తీ, నిఘా పెరగడం రెండో కారణం. అదే సమయంలో లాక్‌డౌన్‌కు సంబంధించిన కేసులు మాత్రం పెరుగుతున్నాయి. నగరాలు, పట్టణాల్లో ప్రజలు ముఖ్యంగా యువత లాక్‌డౌన్ నిబంధనలను ఇష్టానుసారంగా ఉల్లంఘిస్తున్నారు. మార్చి 22 నుంచి 31 వరకు 10 రోజుల పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కమిషనరేట్లలో 4 వేలకు పైగా నేరాలు నమోదయ్యాయి. 2018 నేషనల్ క్రైం బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ప్రకారం.. ఈ నేరాలను పోల్చి చూసినపుడు ఐపీసీ సెక్షన్ల కింద రోజూ 383 నేరాలు నమోదు కాగా, 33 శాతం (254 నేరాలు మాత్రమే) తగ్గుదల నమోదైంది. ఇందులో సాధారణంగా పెట్టీ కేసులు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం నమోదైన ఐపీసీ కేసుల్లో అధికశాతం లాక్‌డౌన్‌కు సంబంధించినవే కావడం గమనార్హం. ఇక కిడ్నాపుల పరంగా చూస్తే.. రోజుకు సగటున దాదాపు 5 కిడ్నాపు కేసులు నమోదు కాగా.. ఈ పదిరోజుల్లో రోజుకు 2.5 కేసులే నమోదయ్యాయి. 2018 ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో రోజుకు 2.5 హత్యల చొప్పున నమోదవగా.. ఈ పదిరోజుల్లో రోజుకు 1.4 హత్యల చొప్పున రికార్డయింది.



- హత్యలు,కిడ్నాప్‌లు, ఇతర నేరాలు తగ్గుముఖం
- కరోనాను నియంత్రించేందుకు విధించిన లాక్‌డౌనే కారణం

**పదిరోజుల్లో 4,369 కేసులు..**

డెకాయిటీ (1), రాబరీ (2), పగటి చోరీలు(2), రాత్రిచోరీలు (17), దొంగతనాలు (153), హత్యలు (14), అల్లర్లు (14), కిడ్నాప్‌లు (24), లైంగిక దాడులు (8), తీవ్రంగా గాయపర్చడం (4), స్వల్పదాడులు (260), మోసాలు (101), నమ్మకద్రోహం (12), మాదకద్రవ్యాల సరఫరా (0), హత్యాయత్నాలు (18), తీవ్ర రోడ్డు ప్రమాదాలు (48), సాధారణ రోడ్డు ప్రమాదాలు (92), ఐపీసీ సెక్షన్ల కింద నమోదైన కేసులు (2,546), ఇతర సెక్షన్ల కింద 1,053 కేసులు కలిపి మొత్తంగా పదిరోజుల్లో 4,369 కేసులు నమోదయ్యాయి.

**అధిక రోడ్డు ప్రమాదాలు అందువల్లే..**

రోడ్ సేఫ్టీ గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో రోజుకు సగటున 63 రోడ్డు ప్రమాదాలు జరుగుతాయి. అందులో 60మంది గాయపడగా, 18 మంది ప్రాణాలు విడుస్తున్నారు. ఈ పది రోజుల్లో చిన్నాపెద్దా అన్నీ కలిపి 140 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో 90 శాతం ప్రమాదాలు వాహనదారుల స్వయంకృతాపరాధం వల్లే జరిగాయని పోలీసులు చెబుతున్నారు.

## 'పోలీసులకూ కరోనా పరీక్షలు' వార్త అవాస్తవం

**డీజీపీ కార్యాలయం**



**సాక్షి, హైదరాబాద్:** పోలీసుశాఖలో పని చేసే ప్రతీ ఒక్కరూ కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని ఎస్పీలు, కమిషనర్లకు ఆదేశాలు వెలువడ్డాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని డీజీపీ కార్యాలయం ఖండించింది. కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో ఇలాంటి సమాచారం వైరల్ అవుతోందని, ఆ వదంతులు సత్యదూరమని డీజీపీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చర్యలకు పాల్పడ్డ వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కరోనా నియంత్రణకు కళాకారుల గీతాలు

**అవగాహన గీతాలను ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ మహమ్మారి నియంత్రణ చర్యల్లో భాగంగా కళాకారులు సైతం నడుం బిగించారు. తమ వంతుగా అవగాహన గీతాలను రూపొందించారు. ఈమేరకు ఆదివారం మంత్రుల నివాస ప్రాంగణంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గీతాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ అవగాహన గీతాలను రచించిన రచయితలను, గాయకులను అభినందించారు. కరోనా వైరస్ నియంత్రణ కోసం సీఎం కేసీఆర్ అనుక్షణం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, దర్శకుడు నరేందర్‌గౌడ్ నంగునూరి, ప్రముఖ గీత రచయిత, సాంస్కృతిక సారథి కళాకారుడు అభినయ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## గురుకుల సీఓఈ కాలేజీల్లో ప్రవేశ పరీక్ష వాయిదా

**లాక్‌డౌన్ తర్వాత షెడ్యూల్ ప్రకటిస్తామన్న ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీలు**



**సాక్షి, హైదరాబాద్:** ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని సీఓఈ(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ) కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ వాయిదా పడింది. వాస్తవానికి ఈనెల 8వ తేదీన అర్హత పరీక్ష నిర్వహించాల్సి ఉంది. దేశవ్యాప్త లాక్‌డౌన్ కారణంతో ఈ పరీక్షను వాయిదా వేశారు. కరోనా వైరస్ వ్యాప్తిని నియంత్రించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీలు ప్రకటించాయి. ఈ పరీక్ష నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని, విద్యార్థుల తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు సంక్షిప్త సమాచారాన్ని అందిస్తామని స్పష్టం చేశాయి.

## కరోనాపై టెన్షన్.. టెన్షన్

# అమ్మ్రో.. బాబోయ్!

"రాత్రి నిద్రలో ఉన్న నాకు మూడింటికి ఉన్నట్టుండి మెలకువ వచ్చింది. దేశంలో, రాష్ట్రంలో పెరుగుతున్న కరోనా కేసుల అంశం నన్నెంతో కలవరపెట్టింది. మనకూ ఇటలీ పరిస్థితి తలెత్తుతుందా అని మదిలో ఆందోళన రేగింది. వైరస్‌ను మనం కట్టడి చేయగలమా లేదా అనే ఆలోచనతో మళ్లీ నిద్రపట్టలేదు. గుండె వేగంగా కొట్టుకుంటున్నట్లు అనిపించింది.

– ఇది సిద్దిపేటకు చెందిన శశి మాట

ఢిల్లీలోని నిజాముద్దీన్‌కు వెళ్లిన వారంతా వైద్యులను సంప్రదించి పద్ధతిగా రెండు వారాలు స్వీయ గృహనిర్బంధంలో ఉంటే మళ్లీ పరిస్థితి అదుపులోకి వచ్చేదేమో. కానీ వారిలో చాలా మంది చిరునామాలు దొరకటం లేదట. వారు ఇంకా జనంలోనే ఉంటే ఎన్ని వందల వేల మందికి వైరస్ సోకుతుందో ఏమిటో? నిన్నంతా నాకిదే ఆలోచన."

– దిల్‌సుఖ్‌నగర్ రామకృష్ణాపురానికి చెందిన ప్రకాశం ఆవేదన ఇది.

## రాష్ట్రంలో వైరస్ వ్యాప్తిపై ప్రజల్లో మానసిక ఒత్తిడి

- మర్కజ్ ఉదంతంతో కేసులు పెరగడంపై ఆందోళన
- కొందరికి సరిగ్గా నిద్ర కూడా పట్టని పరిస్థితి
- ఉదయం నుంచి రాత్రి దాకా వైరస్ వార్తలపైనే దృష్టి
- తప్పుడు ప్రచారంతో బెదరగొడుతున్న సోషల్ మీడియా
- వర్గాల మధ్య అభిప్రాయభేదాలకు కారణమవుతున్న వైనం
- మనసును మళ్లిస్తే బయటపడొచ్చంటున్న మానసిక విశ్లేషకులు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రమంతా ఇప్పుడు కరోనా గుప్పిట 'బందీ' అయిపోయింది. యావత్తు తెలంగాణ సమాజం వైరస్ తమను కబళిస్తుందేమోననే భయంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతోంది. కరోనా కట్టడికి 'లాక్‌డౌనే' మందు, ప్రజలంతా ఇంటిపట్టున ఉండటమే శ్రేయస్కరమని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా ప్రజల్లో మాత్రం ఆందోళన తగ్గట్లేదు. గ్రామాలతో పోలిస్తే ముఖ్యంగా హైదరాబాద్, పట్టణాల్లో ఇది మరింత ఎక్కువగా ఉంది. ప్రస్తుతం హైదరాబాద్, పట్టణ ప్రాంతాల్లో 75 శాతం ప్రజలు ఇళ్లకే పరిమితమవగా సామాజిక స్పృహ, బాధ్యత మరిచిన 25 శాతం మంది మాత్రం రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ 'లాక్‌డౌన్' స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారు. కానీ బలాదూర్‌గా తిరిగే వాళ్లు బిందాస్‌గా ఉంటే ఎంతో బాధ్యతతో ఇళ్లకే పరిమితమైన ప్రజలు మాత్రం ఉదయం నుంచి రాత్రి వరకు వైరస్ విస్తృతిపై మథనపడుతున్నారు.

**అందరిలో 'మర్కజ్' టెన్షన్...**

ముఖ్యమంత్రి కేసీఆర్ వారం క్రితం మీడియా సమావేశం నిర్వహించి ఏప్రిల్ 4తో విదేశాల నుంచి వచ్చిన వారి క్వారంటైన్ గడువు పూర్తవుతుందని, కొత్త పాజిటివ్ కేసులు రాకుంటే ఇక రాష్ట్రం కరోనా కోరల నుంచి విముక్తి పొందినట్లేనని పేర్కొనడంతో రాష్ట్ర ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. కానీ అంతలోనే తెలంగాణపై 'మర్కజ్'పిడుగు పడింది. ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో జరిగిన మత ప్రార్థనల్లో వందల మంది తెలంగాణవాసులు పాల్గొని రాష్ట్రానికి తిరిగి చేరుకోవడం, వారిలో కరోనా పాజిటివ్ కేసులు పెద్ద సంఖ్యలో బయటపడటం పరిస్థితిని ఒక్కసారిగా తలకిందులు చేసింది. పైగా వారిలో కొందరు అజ్ఞాతంలోకి వెళ్లారన్న వార్తలు వెలుగులోకి రావడంతో జనంలో విపరీతమైన ఆందోళన మొదలైంది. ఇప్పుడిదే వారిని మానసిక ఒత్తిడిలోకి నెట్టేసింది. సాధారణంగా ఎవరైనా ఎక్కువ సమయం ఇంట్లోనే ఉంటే వారి మానసిక పరిస్థితిలో కొంత మార్పు రావడం సహజం. అలాంటిది మొత్తం 21 రోజులు 'లాక్‌డౌన్'లో ఉండాల్సి రావడం, ఎక్కువ మందితో నేరుగా మాట్లాడే పరిస్థితి లేకపోవడంతో ప్రజల మానసిక స్థితి అనూహ్యంగా మారిపోయింది. సానుకూల దృక్పథం ఉన్నప్పుడు పరిస్థితి పెద్ద ఇబ్బందిగా ఉండకపోయినా మర్కజ్ వ్యవహారంతో రాష్ట్రంలో పరిస్థితి అదుపు తప్పేలా ఉండటం ప్రజల్లో వ్యతిరేక ఆలోచనలకు కారణమైంది. ఇప్పుడిదే వారిని తీవ్ర మానసిక వేదనకు గురి చేసి ఒత్తిడికి లోనయ్యేలా చేస్తోంది. ఇది మంచి పరిణామం కాదని, వెంటనే వారు వీలైనంత మేర ఆలోచనలను పక్కకు మళ్లించాలని మానసిక విశ్లేషకులు సూచిస్తున్నారు. అలాంటి వారు క్రమంగా సానుకూల ధోరణికి వచ్చేలా చూసుకోవాలని, లేకుంటే సున్నిత మనస్కుల్లో ఈ అంశం విపరీత పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు.

**సోషల్ మీడియా వికృత పోకడలతో...**

కరోనాకు సంబంధించి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున అసత్యాలు ప్రచారమవుతున్నాయి. ఎవరికి తోచింది వారు డంప్ చేస్తున్నారు. ఇలాంటి అసత్యాలు ప్రజల్లో అభద్రతా భావాన్ని పెంచుతున్నాయి. వెనెజువెలాలో కరెన్సీ మారిన వేళ కొందరు పాత కరెన్సీని రోడ్లపై వెదజల్లిన ఏడాది క్రితం నాటి ఫొటోలను సర్క్యులేట్ చేసి ఇటలీలో డబ్బున్నా కరోనాను జయించలేకపోతున్నామన్న మానసిక వైరాగ్యంతో జనం రోడ్లపై విసిరారని ప్రచారం చేశారు. ఫలానా చోట కరోనా పాజిటివ్ వ్యక్తి పారిపోయాడని, జనంలో కలిసిపోయాడని లాంటి తప్పుడు వార్తలతో భయం సృష్టిస్తున్నారు. వాస్తవ పరిస్థితి కంటే ఈ తప్పుడు వార్తలే ఆందోళనను పెంచుతున్నాయి.

**మతాల మధ్య స్పర్ధలకు కారణం...**

ఇటీవల 'మర్కజ్' వ్యవహారంతో ఒక్కసారిగా సోషల్ మీడియా మతాల మధ్య చిచ్చుకు ఎక్కువగా కారణమవుతోంది. 'మర్కజ్' వ్యవహారాన్ని సమర్థిస్తూ కొందరు పోస్టులు పెడుతుంటే వ్యతిరేకిస్తూ మరికొందరు పెడుతున్నారు. దీంతో పోటాపోటీ వీడియోలు పరిస్థితిని ఆందోళనకరంగా మారుస్తున్నాయి. కొందరు కావాలనే వైరస్ వ్యాప్తి చెందేలా చేస్తున్నారన్న వీడియోలు భయం పుట్టిస్తున్నాయి. పాత వీడియోలు కూడా ఇప్పటివే అన్నట్టుగా దర్శనమిస్తున్నాయి. ఓ ప్రార్థనా మందిరంలో కొందరు యువకులు ప్లేట్లు, గ్లాసులు, చెంచాలను ఎంగిలిచేసి పంపుతున్న వీడియో ఇటీవల బాగా వైరల్ అయింది. చార్మినార్ వద్ద ఓ వర్గానికి చెందిన వారు ప్రార్థనల వేళ పోలీసులపై దురుసుగా వ్యవహరించారని, అది నేడే జరిగిందంటూ ప్రచారంలో ఉంది. కానీ అది కొన్ని నెలల క్రితం నాటిది. ఇలాంటి తప్పుడు వీడియోలు, సమాచారాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తూ జనాన్ని మరింత మానసిక ఆందోళనకు గురి చేస్తున్నాయి.

### నిపుణుల మాట ఇది

- ఎక్కువసేపు కుటుంబంతో కలిసుండే అవకాశం ఉన్నందున గతంలోని సంతోషకర జ్ఞాపకాలను గుర్తుచేసుకొని మాట్లాడుకోవాలి. నాటి ఫొటోలు, వీడియోలు చూడాలి. వాట్సాప్ ద్వారా దగ్గరి బంధువులు, స్నేహితుల పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల ఫొటోలు, వీడియోలు పరస్పరం షేర్ చేసుకుంటూ స్మృతులను నెమరు వేసుకోవాలి.



- ఇళ్లలోని పెండింగ్ పనులను చక్కబెట్టుకోవాలి. పెరటి పనుల్లో నిమగ్నం కావాలి. అవకాశం ఉన్నవారు మిద్దెపై కుండీల్లో మొక్కలు పెంచే పని కల్పించుకోవాలి.
- పుస్తక పఠనం ఒత్తిడిని దూరం చేస్తుంది. మంచి పుస్తకాలను చదివి, వాటి సారాంశాన్ని కుటుంబ సభ్యులతో పంచుకోవాలి. పిల్లలకు కథలు చెప్పే అలవాటు ఇప్పటికే దూరమైంది. మళ్లీ వారిని కథలలోకి దింపేందుకు ఇదో చక్కని అవకాశం. అందుబాటులో పుస్తకాలు లేకుంటే ఇంటర్నెట్‌ను వినియోగించుకోవచ్చు.
- ఆంగ్లం సహా ఇతర భాషలు నేర్చుకునే వెసులుబాటును అందిపుచ్చుకోవాలి.
- ఆధ్యాత్మికత వైపు మళ్లాలనుకుంటే టీవీ, యూట్యూబ్‌ల్లో ప్రవచనాలు చూడవచ్చు.
- బొమ్మలు గీయడం పెద్ద మానసిక ప్రశాంతతనిచ్చే ప్రక్రియ. వచ్చినట్టు బొమ్మలు గీసి స్నేహితులకు షేర్ చేయొచ్చు. సంగీత వాయిద్యాలను నేర్చుకోవడం, పాటలు పాడటం కూడా చేయొచ్చు.
- పిల్లలతో కలిసి చెస్, క్యారమ్స్ లాంటి ఇండోర్ గేమ్స్ ఆడటం మరవొద్దు.
- యోగా, మెడిటేషన్ చేయాలి.
- రోజంతా అదేపనిగా టీవీలకు అతుక్కుపోవద్దు. ఎక్కువ సేపు వార్తలు చూడకుండా ఉండటం మంచిది. వీలైనంత ఎక్కువగా మానసిక ఉల్లాసం, విజ్ఞానం అందించే చానళ్లను చూడటం ద్వారా మనసును తేలికపరుచుకోవాలి.

### అంతకుమించి..



కరోనా నేపథ్యంలో జ్యోతి వెలిగించాలనే ప్రధాని పిలుపు మేరకు ఆదివారం అంతా దీపాలు వెలిగించారు. జ్యోతి వెలిగిస్తే కరోనా తగ్గదు. కానీ ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఇది దోహదపడుతుంది. కరోనా విషయంలో మనకు మంచే జరుగుతుందన్న నమ్మకాన్ని కల్పించేందుకు ఈ సందర్భం ఉపయోగపడొచ్చు. జ్యోతి ప్రజ్వలన మనల్ని మోటివేట్ చేసేందుకు ఉపయోగపడుతుంది. అయితే కరోనాపై విజయం సాధించాలంటే ఇలాంటి సింబాలిజమ్ కంటే కావాల్సిన చర్యలను ప్రభుత్వాలు చేపట్టాలి. - ప్రొఫెసర్ నాగేశ్వర్

### లాక్‌డౌన్ పాటిస్తే చాలు...



"కరోనా కట్టడి అంశాన్ని ప్రభుత్వాలు చూసుకుంటున్నాయి. డాక్టర్లు, పోలీసులు వారి పనుల్లో ఉన్నారు. మనం చేయాల్సింది ఇళ్లు దాటకుండా ఉండటమే. దీన్ని మాత్రమే మనసులో ఉంచుకుంటే ఒత్తిడి ఉండదు. వైరస్‌ను మాయం చేసే శక్తి మనకు లేనప్పుడు దాని గురించి బుర్ర బద్దలు కొట్టుకోవద్దు. మనం ఇళ్లను చక్కబెట్టుకోవడం వరకే మన ఆలోచనలను పరిమితం చేయాలి. అప్పుడు టెన్షన్ పోతుంది

- జయసింహ, మానసిక విశ్లేషకులు

## కన్నతల్లి కడచూపునకు నోచుకోక..

**విధుల్లోనే ఉండిపోయిన ఓ కానిస్టేబుల్**



**మేడిపల్లి:** కరోనా నేపథ్యంలో విధించిన లాక్‌డౌన్ మిగిలిస్తున్న కన్నీటి గాథలెన్నో.. జన్మనిచ్చిన అమ్మ ఇక లేదని తెలిసినా, కన్నతల్లి కడచూపునైనా నోచుకోనివ్వని బాధ్యతలు ఆ కానిస్టేబుల్‌నే కాదు మిగతా సిబ్బందినీ కంట తడిపెట్టించాయి. కానిస్టేబుల్ గౌరీనాయుడు మేడిపల్లి ఠాణా పరిధిలో లాక్‌డౌన్ విధులు నిర్వర్తిస్తున్నాడు. తల్లి ఎల్లమ్మ (48) విజయనగరం జిల్లా వెట్టిపల్లిలో అనారోగ్యంతో శనివారం మృతి చెందినట్టు సమాచారం అందింది. లాక్‌డౌన్‌తో రాష్ట్ర సరిహద్దులు మూసుకుపోవడంతో తన తల్లిని కడసారి చూసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. ఆదివారం తల్లి అంత్యక్రియలకు హాజరుకాలేకపోయిన గౌరీనాయుడు గుండెదిటవు చేసుకుని బాధ్యతలు నిర్వర్తించాడు. విషయం తెలిసిన సహోద్యోగులు అతడిని ఓదార్చి సంఘీభావం తెలిపారు. సీఐలు అంజిరెడ్డి, యద్భాల్ జానీ, ఎస్ఐ రఘురామ్ కానిస్టేబుల్‌ను పరామర్శించి ఓదార్చారు.

# నిండు గర్భిణి పురిటి కష్టాలు



దుకాణం ఎదుట కూర్చున్న స్వప్న

- ప్రసవం కోసం వస్తే రిపోర్టులు లేవని వైద్యం నిరాకరించిన వైద్య సిబ్బంది
- రాత్రంతా దుకాణం ఎదుట జాగారం

**కొందుర్గు:** కరోనా వైరస్ విజృంభణతో ఓ వైపు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలవుతున్న పరిస్థితుల్లో బాధ్యతతో ఓ వైపు ప్రాణాలొడ్డి సేవలందిస్తున్న వైద్య సిబ్బంది...మరోవైపు నిండు గర్భిణికి పురిటినొప్పులొస్తే రిపోర్టులు లేవన్న సాకుతో వైద్య సిబ్బంది వైద్యం చేసేందుకు నిరాకరించి ఆమెను రాత్రంతా ఆరుబయటే జాగారం చేయించింది. కొందుర్గు మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని శివరాంపల్లిలో నివాసం ఉంటున్న వడ్డె స్వప్న ఉగాది పండుగ కోసం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని ఎదిర గ్రామంలోని తన పుట్టింటికి వచ్చింది. నిండు గర్భిణి అయిన ఆమెకు శనివారం రాత్రి 12 గంటల సమయంలో పురిటినొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కుటుంబీకులు తరలించారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఏఎన్‌సీ రిపోర్టులు చూపించాలని స్వప్నను అడుగగా తమ వద్ద లేవని చెప్పింది. రిపోర్టులు తన అత్తగారింట్లో ఉన్నాయని చెప్పినా ఆస్పత్రి సిబ్బంది కనికరించలేదు. రిపోర్టులు లేకుంటే వైద్యం చేయమని చెప్పి కనీసం ఆస్పత్రిలోనికి కూడా అనుమతించకపోవటంతో చేసేదేమీలేక స్వప్న తన మూడేళ్ల కుమారుడు, తల్లి యాదమ్మతో కలిసి పీహెచ్‌సీ వద్ద ఉన్న ఓ దుకాణం ఎదుట రాత్రంతా జాగరణ చేసింది. ఆదివారం ఈ విషయమై స్థానికులు ఆస్పత్రి సిబ్బందిని ప్రశ్నించగా..స్వప్న ప్రసవానికి ఇంకా సమయం ఉందని, పీహెచ్‌సీలో పేషెంట్‌తోపాటు మరొకరు మాత్రమే ఉండాలని సూచించగా గర్భిణితోపాటు కుటుంబీకులు బయటకు వెళ్లారని స్టాఫ్‌నర్స్ సలోమి తెలిపారు. అనంతరం కుటుంబీకులు స్వప్నను షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

## పోలీసు సహాయ నిధికి రూ.25 లక్షల విరాళం



**సాక్షి, హైదరాబాద్:** పోలీసు సంక్షేమ నిధికి కాకినాడ సీపీపోర్టు రూ.25 లక్షలు విరాళంగా ఇచ్చింది. ఈ మేరకు సంస్థ సీఈఓ కేవీ రావు చెక్కును డీజీపీ మహేందర్ రెడ్డికి ఆయన కార్యాలయంలో అందజేశారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో 24 గంటలు శ్రమిస్తున్న పోలీసుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏడీజీ (లా అండ్ ఆర్డర్) జితేందర్, చాముండేశ్వరీనాథ్, కేఎల్ నారాయణ పాల్గొన్నారు.

## 'మార్చి నెల పూర్తి వేతనం చెల్లించాలి'

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ మిగులు బడ్జెట్ కలిగిన రాష్ట్రం అని పదే పదే చెబుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్ల సంఘాలతో కనీసం సంప్రదించకుండా ఏకపక్షంగా వేతనాల్లో కోత విధించడం సరికాదని పెన్షనర్ల జేఏసీ ఒక ప్రకటనలో పేర్కొంది. వెంటనే మార్చి నెల వేతనాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించాలని డిమాండ్ చేసింది. ఫ్యామిలీ పెన్షనర్లకు రూ. 10 వేలు కూడా రాని పరిస్థితి నెలకొందని, అలాంటి వారు ఎలా జీవనం గడుపుతారని జేఏసీ ప్రశ్నించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com